www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

శుక్రవారం | 23-2-2018 | పేజీలు: 18 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 58 సంచిక: 309 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 12.44 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక మ. 12.43 తదుపరి రోహిణి; వర్జ్యం: రా. 3.53-5.24; దుర్ముహూర్తం: ఉ. 9.01-9.47; మ. 12.52-1.39; అమృతఘడియలు: ఉ. 10.24-11.56; రాహుకాలం: మ. 10.30-12.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

దసరాకల్లా రాష్ట్రానికి హైకోర్టు?



- నేలపాడులో సిటీ సివిల్ కోర్టు భవనాలు
- నిర్మాణానికి ఫుల్‌కోర్టు పచ్చజెండా
- ఆగస్టు 31 లేదా దసరా సెలవుల్లోపు పూర్తి
- జస్టిస్ భవన్ పూర్తయ్యేవరకు అందులోనే హైకోర్టు కార్యకలాపాలు

6

ట్యాంక్ ఫుల్... అయినా ట్రబుల్!



- పెట్రోల్‌లో పెరిగిన ఇథనాల్ దెబ్బ ఇదీ
- చెమ్మ తగిలితే నీరవుతున్న ఇంధనం
- మిశ్రమంలో ఆయిల్ కంపెనీ ఇష్టారాజ్యం
- వాహనాల ట్యాంకుల్లో చేరుతున్న నీరు
- వినియోగదారుకు లీటరుకు రూ.8 నష్టం

6

గురుకులాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష

- 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 8న పరీక్ష
- మంత్రి ఆనందబాబు వెల్లడి

6

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ • శుక్రవారం 23 ఫిబ్రవరి 2018

పీఎస్ఎల్‌ది రెండో స్థానమే : రమీజ్

కరాచీ: పాకిస్థాన్ సూపర్ లీగ్ విజయవంతమైనప్పటికీ దానికి ఇండియన్ ప్రీమియర్ లీగ్ తరువాతి స్థానమే దక్కుతుందని పాకిస్థాన్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ రమీజ్ రాజా వ్యాఖ్యానించాడు. స్టార్లతో కూడిన ఐపీఎల్‌తో పోల్చితే పీఎస్ఎల్‌కు ఆదరణ తక్కువేనన్నాడు. గురువారం దుబాయ్‌లో ఆరంభమైన పీఎస్ఎల్ గతంలో కంటే ఘనంగా, మెరుగ్గా నిర్వహిస్తున్నారన్నాడు.

సెమీస్‌కు మేరీ కోమ్



సోఫియా (బల్గేరియా): ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్ స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. 48 కిలోల విభాగం క్వార్టర్స్ బౌట్‌లో రొమేనియా బాక్సర్ స్టెలుటా డుటాపై మేరీ విజయం సాధించింది. పురుషుల 64 కిలోల విభాగంలో ధీరజ్ రంగీ మొదటి రౌండ్‌లో లూయిస్ కొలిన్ రిచార్నే చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

కోహ్లీని చూసి నేర్చుకున్నా !

సిడ్నీ: విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చూసి కొంత నేర్చుకున్నానని ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ తెలిపాడు. అలాగే దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలీర్స్, న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్ ఆటను కూడా అనుకరించానని చెప్పాడు. స్మిత్ గతేడాది 24 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఏడు సెంచరీలతో మొత్తం 1,754 పరుగులు చేశాడు. 2017 సంవత్సరానికి 'ఐసీసీ టెస్టు ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా కూడా ఎంపికయ్యాడు. ఒక వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్మిత్ తన అంతరంగాన్ని ఆవిష్కరించాడు. భారత కెప్టెన్ కోహ్లీ స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనే తీరును, ఆఫ్‌సైడ్‌కు బంతిని ఆడే విధానాన్ని క్షుణ్ణంగా గమనించానని, అందులోని కొన్ని అంశాలను గ్రహించానన్నాడు. అంతేగాక డివిలీర్స్, కేన్ బ్యాటింగ్‌ను కూడా అనుకరించానన్నాడు. కొన్నాళ్ల క్రితం విలియమ్సన్‌లా ఆడేందుకు ప్రయత్నించానని, డివిలీర్స్ షాట్లను ప్రయత్నించానన్నాడు. ప్రస్తుత ఆటగాళ్లలో కోహ్లీ, డివిలీర్స్, విలియమ్సన్ ఉత్తమ ఆటగాళ్లని ప్రశంసించాడు. వారినుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని కితాబిచ్చాడు.



ఓయ్...ఎటు చూస్తున్నావ్

• మనీష్‌పై మహీ మండిపాటు

సెంచూరియన్: క్రికెట్‌లో మిస్టర్ కూల్‌గా మహేంద్ర సింగ్ ధోనీకి పేరుంది. ఎంత ఒత్తిడి ఉన్నా సహచరులకు



మార్గదర్శనం చేస్తూ ప్రశాంతంగా తన పని తాను చేసుకుపోతాడు. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో ఒకానొక సమయంలో ధోనీకి ఆగ్రహం వచ్చింది. సహచర బ్యాట్స్‌మన్ మనీష్ పాండేను ఒక్కసారిగా గద్దించాడు. ఇప్పుడు ఆ వీడియో నెట్‌లో వైరల్‌గా మారింది. ఆరంభంలోనే వికెట్లు కోల్పోయిన భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. భారత ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో పాండే మిడ్‌వికెట్ దిశగా ఆడి ఓ సింగిల్ తీశాడు. కానీ ధోనీ డబుల్ కోసం చూశాడు. ఆ సమయంలో పార్ట్‌నర్‌ను గమనించాల్సిన మనీష్.. బంతివైపు చూస్తుండడం ధోనీకి చిరాకు తెప్పించింది. దీంతో స్ట్రయిక్ తీసుకునే ముందు 'అటు కాదు ఇటు చూడు అంటూ' మనీష్‌పై గట్టిగా అరిచి అతడిని అప్రమత్తం చేశాడు. స్టంప్ కెమెరాలో రికార్డయిన ఈ దృశ్యం నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

భువీ, బుమ్రాలకు విశ్రాంతి?



ముంబై: వచ్చే నెలలో శ్రీలంకలో జరుగనున్న ముక్కోణపు టీ-20 సిరీస్‌కు భారత పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలకు విశ్రాంతి కల్పించే అవకాశముంది. దక్షిణాఫ్రికాలో సుదీర్ఘ పర్యటనతోపాటు తీరికలేని సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెస్కే ప్రసాద్ నేతృత్వంలోని జాతీయ సెలెక్షన్ కమిటీ ఆదివారం జరిగే సమావేశంలో దీనిపై ఒక నిర్ణయానికి రానున్నది. ఈ భేటీలో ఆటగాళ్లపై పెరుగుతున్న పని భారాన్ని ప్రధానంగా చర్చించనున్నారని బీసీసీఐ అధికారి ఒకరు స్పష్టంచేశారు. దక్షిణాఫ్రికా పర్యటనలో భువీ, బుమ్రా ముఖ్యపాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆ పర్యటనలో వారు దాదాపు అన్ని మ్యాచ్‌లలో ఆడారు. ఇక కెప్టెన్ విరాట్ కోహ్లీకి కూడా విశ్రాంతి కల్పించే అవకాశముంది. అయితే అది కోహ్లీ స్వయంగా నిర్ణయించుకుంటాడని, కావాలంటే అతనికి విశ్రాంతి కల్పిస్తామని బోర్డు అధికారి ఒకరు చెప్పారు. ఈ విషయమై వ్యాఖ్యానించడానికి ఎమ్మెస్కే నిరాకరించాడు. రానున్న సీజన్‌లో భారత జట్టు 30 వన్డేలు సహా 63 అంతర్జాతీయ మ్యాచ్‌లలో పాల్గొనాల్సి ఉంది. దానిని దృష్టిలో ఉంచుకునే భువీ, బుమ్రాలకు విశ్రాంతి కల్పిస్తారని భావిస్తున్నారు.

డీఎస్పీగా హర్మన్‌ప్రీత్



చండీగఢ్: భారత మహిళా క్రికెట్ టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పంజాబ్ పోలీస్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఉద్యోగం లభించింది. ఆమె మార్చి 1న డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనుంది. ప్రస్తుతం ఇండియన్ రైల్వేస్ ఉద్యోగి అయిన హర్మన్‌ప్రీత్‌ను విజ్ఞాపనపై రిలీవ్ చేసేందుకు అంగీకరించడంతో పంజాబ్ పోలీస్‌లో చేరేందుకు మార్గం సుగమమైంది. పంజాబ్‌లోని మోగా ప్రాంతానికి చెందిన హర్మన్‌ప్రీత్‌ను రైల్వేస్ రిలీవ్ చేయాలని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ రైల్వే మంత్రికి స్వయంగా విజ్ఞప్తి చేశారు. ఐదేళ్ల కాలానికి ఒప్పందపత్రం సమర్పించడంతో తొలుత రైల్వేస్ హర్మన్‌ప్రీత్‌ను రిలీవ్ చేసేందుకు నిరాకరించింది. చివరకు పెద్దల జోక్యంతో హర్మన్‌ప్రీత్‌కు స్వరాష్ట్రంలో ఉద్యోగానికి అడ్డంకులు తొలిగాయి.

ఇలా ఫ్లాపయితే ఎలా?



'ఆల్‌రౌండర్‌గా పరిగణించబడడం అతని అదృష్టం. అతను బ్యాట్‌తో ఏ మాత్రం రాణించడం లేదు. కేవలం బంతితోనే కాస్తో కూస్తో మెరుస్తున్నాడు. అందుకే జట్టులో చోటు నిలబెట్టుకుంటున్నాడు' ఇదీ భారత యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గురించి మాజీ ఆల్‌రౌండర్ రోజర్ బిన్నీ చేసిన కామెంట్. తొలి టెస్టు మినహా సౌతాఫ్రికా పర్యటనలో హార్దిక్ బ్యాటింగ్‌లో నిరాశాజనక ఆట తీరు చూస్తుంటే ఒక్క బిన్నీకే కాదు...చాలా మందికి ఇలాంటి అనుమానమే కలుగుతోంది. బంతితో మాత్రమే రాణిస్తూ బండి లాగేస్తున్న పాండ్యాను భారత్ ఆశిస్తున్న నిజమైన ఆల్‌రౌండర్ అనుకోవచ్చా?

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నిజానికి ఈ టూర్‌కు ముందు హార్దిక్ పాండ్యాపై భారీ అంచనాలున్నాయి. కొన్ని నెలల కిందట శ్రీలంక గడ్డపై అతని ఆల్‌రౌండ్ ప్రదర్శన చూసి మరో కపిల్ దేవ్ కోసం ఎంతోకాలంగా చూస్తున్న నిరీక్షణ ఫలిస్తున్నట్టేనని అంతాభావించారు. సౌతాఫ్రికా గడ్డపై అతను సత్తా చాటుతాడని కెప్టెన్ కోహ్లీతో పాటు మాజీలు.. విశ్లేషకులు భరోసాతో ఉన్నారు. ఈ టూర్‌కు ఎంపికచేసేందుకుగాను స్వదేశంలో లంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఆడించకుండా పాండ్యాకు విశ్రాంతి ఇచ్చారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కేప్‌టౌన్ తొలి టెస్టులో భారత బ్యాటింగ్ విఫలమైన చోట.. పాండ్యా కౌంటర్ అటాకింగ్ ఆటతో 93 పరుగులు చేసి జట్టును కుప్పకూలకుండా కాపాడాడు. విదేశీ గడ్డపై.. అత్యంత పటిష్ట మైన బౌలింగ్‌ను ఎదుర్కొంటూ పాండ్యా ఆడిన ఇన్నింగ్స్ చూసి ఫిదా అయ్యారంతా. క్రికెట్ పండితులు సైతం హార్దిక్‌ను మరో కపిల్ అంటూ పొగిడేశారు.

కానీ, రెండో టెస్టుకు వచ్చేసరికే విమర్శకులు అభిప్రాయాన్ని మార్చుకున్నారు. కనీసం బ్యాటును క్రీజులో ఉంచకుండా అత్యంత నిర్లక్ష్యంగా రనౌట్ కావడాన్ని... స్లిప్ మీదుగా అడ్డంగా షాట్ ఆడి అవుటైన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. పాండ్యా రనౌట్‌ను చూసి అలాంటి తెలివితక్కువ తప్పులు చేస్తే అతణ్ణి తనతో పోల్చకండి అంటూ కపిల్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. హార్దిక్ వైఫల్యం రెండో టెస్టుతోనే ఆగలేదు. తర్వాతి ఐదు ఇన్నింగ్స్‌ల్లో 1, 15, 6, 0, 4 స్కోర్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఇక, వన్డేల్లో అయితే అత్యంత దారుణమైన ఆట తీరును కనబరిచాడు. ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయిస్తూ భారత్ 5-1తో కైవసం చేసుకున్న ఈ సిరీస్‌లో పాండ్యా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 8.66 సగటుతో 26 పరుగులే చేశాడు. ఇలాంటి ఆటతీరుతో మరో ఆటగాడిపైనైతే వేటు పడివుండేది. కానీ, సీమ్ బౌలింగ్‌తో మెరుస్తూ.. చురుకైన క్యాచ్‌లు అందుకోవడంతో అతను తుది జట్టులో కొనసాగుతున్నాడు. కెప్టెన్ కోహ్లీ ఉంచిన విశ్వాసం కూడా అతనికి లాభిస్తుందనొచ్చు. అయితే, కేవలం బంతితో మాత్రమే రాణిస్తున్న పాండ్యాను ఆల్‌రౌండర్ కోటాలో కొనసాగించడం ఎంత వరకూ సమంజసం? అనే ప్రశ్న రోజర్ బిన్నీ నుంచే కాదు ఇప్పుడు అన్ని వర్గాల నుంచి ఎదురవుతోంది. అందుకే పాండ్యాను కపిల్‌తో పోల్చడం ఆపాలని రోజర్ డిమాండ్ చేస్తున్నాడు. 'ఒక బ్యాట్స్‌మన్‌గా కపిల్‌తో పాండ్యా ఎంతమాత్రం సరితూగలేడు. టెస్టు జట్టులోకి వచ్చేముందు కపిల్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఎన్నో సెంచరీలు చేశాడు. కానీ, అత్యున్నత స్థాయి క్రికెట్ ఆడే ముందు పాండ్యా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో రాణించనేలేదు. టీ-20 క్రికెట్‌లో మెరుపులను చూసి అతణ్ణి టెస్టు జట్టులోకి తీసుకున్నారు. టెస్టులు వేరు పరిమిత ఓవర్ల ఆట వేరు. షార్ట్ ఫార్మాట్‌లో పరుగులు చేయడం చాలా తేలిక. కానీ టెస్టుల్లో అలా కాద'ని రోజర్ పేర్కొన్నాడు. ఫస్ట్‌క్లాస్‌ల్లో బరోడా తరఫున బరిలోకి దిగి నిలకడగా పరుగులు చేస్తే తప్ప పాండ్యా భారత్ తరఫున రాణించలేడని, టెస్టు క్రికెట్‌లో కుదురుకోలేడని సూచించాడు. అయితే, దేశవాళీల్లో ఎక్కువగా ఆడే సామర్థ్యం కూడా అతనికి లేదన్నాడు. బ్యాట్స్‌మన్‌గా పాండ్యా అతి దూకుడు.. వచ్చీరాగానే షాట్లు ఆడాలన్న ఆత్రుతే అతణ్ణి దెబ్బతీస్తోందని చాలా మంది భావిస్తున్నారు. బిన్నీ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాడు. 'అతను ప్రతీ బంతిని షాట్ కొట్టాలని చూస్తున్నాడు. అది అసాధ్యం. పాండ్యా ఎక్కువగా స్ట్రోక్స్ ఆడడంపైనే దృష్టి పెడుతున్నాడు తప్పితే.. క్రీజులో కుదురుకునే ఆలోచనే చేయడం లేద'ని రోజర్ విశ్లేషించాడు. పాండ్యా రాకతో తన కుమారుడు, ఆల్‌రౌండర్ అయిన స్టువర్ట్ బిన్నీ టీమిండియాకు దూరం కావాల్సివచ్చిందన్న కోపంతోనే రోజర్ ఇలా అంటున్నాడని కొంత మంది భావించే అవకాశం లేకపోలేదు. అంతెందుకు రోజర్ సహచరుడు, పాండ్యా కోచ్ అయిన మాజీ వికెట్ కీపర్ కిరణ్ మోరే.. బిన్నీతో విభేదిస్తున్నాడు. 'టెస్టుల గురించి మాట్లాడితే జట్టులో ఎంతమంది అర్ధ సెంచరీ చేశారో చెప్పాలి. కేప్‌టౌన్‌లో పాండ్యా చేసిన 93 పరుగులు 150 రన్స్‌తో సమానం' అని తన శిష్యుడిని వెనకేసుకొచ్చాడు. కానీ, ఆ ఇన్నింగ్స్ తర్వాత పాండ్యా బ్యాటింగ్‌ను చూసిన వారికి రోజర్ చెప్పేదాంట్లో నిజం ఉన్నదనిపిస్తోంది. ఎందుకంటే కేవలం బౌలింగ్ కోసమే పాండ్యాను జట్టులోకి తీసుకోవడం లేదు. ఆ మాట కొస్తే ప్రధాన బౌలర్లతో పోల్చితే అతను బంతితో కూడా ఆశించినంత ఆకట్టుకున్నదీ లేదు. మూడు టెస్టుల్లో తీసినవి మూడు వికెట్లే. అదే సమయంలో బుమ్రా 14, రెండేసి టెస్టులే ఆడిన భువనేశ్వర్ 10, ఇషాంత్ 8 వికెట్లు తీశారు. ఆరు వన్డేల్లో హార్దిక్ నాలుగు వికెట్లు మాత్రమే తీశాడు. ఒక్క పర్యటనలో ఆటను చూసి పాండ్యా భవిష్యత్‌ను అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. కానీ, భావి ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకొని.. కెప్టెన్ కోహ్లీ ఎంతో భరోసా ఉంచిన అతను ఇలా వరుసగా ఫ్లాపవడం ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. అలా అయితే అతను జట్టులో ఎక్కువ కాలం కొనసాగడం కూడా కష్టమే. పాండ్యా ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి రెండు విభాగాల్లోనూ రాణిస్తేనే అతణ్ణి భారత్ కోరుకున్న ఆల్‌రౌండర్‌గా పరిగణించగలం..!

భారత బ్యాడ్మింటన్‌కు స్వర్ణ యుగం

• నెం:1 గురించి ఆలోచించడం లేదు
• ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్

న్యూఢిల్లీ: సరికొత్త స్టార్లతో భారత బ్యాడ్మింటన్ స్వర్ణ యుగంలోకి అడుగిడుతోందని ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ అన్నాడు. ఈ ఏడాది కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరగనున్న నేపథ్యంలో ఎంతో మంది యువ షట్లర్లు పతకాల వేటకు సిద్ధమయ్యారంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపాడు. ప్రపంచ టాప్-15 ర్యాంకింగ్స్‌లో చైనాతో సమానంగా భారత ప్లేయర్లు కూడా ఉన్నారు. శ్రీకాంత్ 3, హెచ్ఎస్ ప్రణయ్ 11, సాయి ప్రణీత్ 14వ ర్యాంక్‌లు సాధించారు. ఇక మహిళల విభాగంలో 4వ ర్యాంక్‌లో పీవీ సింధు, 11వ స్థానంలో సైనా నెహ్వాల్ ఉన్నారు. 'పురుషుల సింగిల్స్‌లో ఐదారుగురు ఉత్తమ ఆటగాళ్ల



ఉన్నారు. సైనా, సింధు అద్భుతంగా ఆడుతున్నారు. వీరికి తోడు డబుల్స్ ప్లేయర్లు కూడా సత్తాచాటుతున్నారని శ్రీకాంత్ చెప్పాడు. గత పదేళ్లతో పోల్చితే ఇప్పుడు ఎక్కువ మంది ప్రతిభ గల ప్లేయర్లు అందుబాటులో ఉన్నారన్నాడు. 'ఒలింపిక్ పతకం నెగ్గడం చిరకాల కోరిక. కానీ ఇప్పుడే టోక్యో క్రీడల గురించి ఆలోచించడం లేద'ని కిడాంబి చెప్పాడు. మెగా టోర్నీల్లో నిలకడగా రాణించి పతకాలు కొల్లగొట్టడమే తమకు ఎంతో ముఖ్యమన్నాడు. ర్యాంకుల గురించి తాను పట్టించుకోవడం లేదని చెప్పాడు. రిటైర్మెంట్ తర్వాత వాటి గురించి ఆలోచిస్తానేమోనని సరదాగా అన్నాడు. దూకుడు, సుదీర్ఘ సమయం ఆడగలగడం తన బలమని శ్రీకాంత్ చెప్పాడు. 1980ల్లో ప్రకాశ్ పదుకోన్, ఆ తర్వాత పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ హీరోలుగా నిలిచారు. కానీ ఇంత మంది ప్రతిభావంతులైన ఆటగాళ్ల బృందం గతంలో ఎప్పుడూ లేదు. గత ఏడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన కిడాంబి పురుషుల ర్యాంకింగ్స్‌లో రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. ఆస్ట్రేలియాలో జరిగే కామన్వెల్త్, ఇండోనేసియాలో జరిగే ఆసియా క్రీడలపైనే శ్రీకాంత్ ప్రస్తుతం దృష్టి నిలిపాడు.

సెమీఫైనల్లో ఆంధ్ర

• క్వార్టర్స్‌లో ఢిల్లీపై ఘన విజయం

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర అప్రతిహతంగా సాగుతోంది. లీగ్ దశలో ఓటమి ఎరుగని ఆంధ్ర జట్టు క్వార్టర్‌ఫైనల్లోనూ బలీయమైన ఢిల్లీ జట్టును చిత్తుగా ఓడించి సెమీఫైనల్‌కు చేరుకుంది. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తొలుత ఢిల్లీని 32.1 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ చేసిన ఆంధ్ర 28.4 ఓవర్లలో 4 వికెట్లను మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తొలుత టాస్ గెలిచిన ఆంధ్ర జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. శివకుమార్ (4/29), భార్గవ్ భట్ (3/28) ధాటికి ఢిల్లీ బ్యాట్స్‌మెన్ తలవంచారు. ఉన్ముక్త్ (4), గౌతమ్ (8), హితేన్ దలాల్ (11), నితీష్ రాణా (2) విఫలమయ్యారు. 9 ఓవర్లలో 33 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన స్థితినుంచి రిషభ్‌పంత్ (38), ధ్రువ్ షోరె (21) జట్టును గట్టెక్కించే ప్రయత్నం చేశారు. ఐదో వికెట్‌కు 36 పరుగులు జోడించిన అనంతరం ధ్రువ్‌ను భార్గవ్ అవుట్ చేసి ఆ జోడీని విడగొట్టాడు. ఈ తరుణంలో రిషభ్ ఒంటరిపోరు సలిపాడు. మరో 20 ఓవర్లు మిగిలిఉండగా రిషభ్ అవుటవడంతో ఢిల్లీ ఒక్కసారిగా కుప్పకూలింది. ఢిల్లీ జట్టు కేవలం 35 పరుగులకు ఆరు వికెట్లను కోల్పోయింది.


ఆంధ్ర జట్టు

అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర ఆరంభంలో తడబడినా లక్ష్యాన్ని చేరుకుంది. 11 పరుగులకే భరత్ (0), విహారి (6) వికెట్లను కోల్పోయిన దశలో రికీ భుయ్ (32), అశ్విన్ హెబ్బర్ (38) మూడో వికెట్‌కు 54 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. లక్ష్యం ముంగిట ఈ ఇద్దరూ అవుటైనా సుమంత్ (24 నాటౌట్), రవితేజ (3 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ నెల 25న జరిగే సెమీస్‌లో సౌరాష్ట్రతో ఆంధ్ర తలపడనుంది.

బరోడాపై సౌరాష్ట్ర గెలుపు:

మరో క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర మూడు వికెట్లతో బరోడాను ఓడించింది. తొలుత క్రునాల్ పాండ్యా (61) రాణించడంతో బరోడా 8 వికెట్లకు 247 పరుగులు చేసింది. బరోత్ (82) మెరుపులతో సౌరాష్ట్ర 48.4 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.



మన్‌దీప్ జాతీయ రికార్డు

విశాఖపట్నం (స్పోర్ట్స్): జాతీయ యూత్, జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ టోర్నీలో హరియాణాకు చెందిన మన్‌దీప్ కౌర్ జాతీయ రికార్డు నెలకొల్పింది. స్థానిక పోర్టు ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన మహిళల 53 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె క్లీన్ అండ్ జెర్క్ 104 కిలోల బరువెత్తి రికార్డు సృష్టించింది. స్నాచ్‌లో 74 కిలోలతో మొత్తంగా 178 కేజీలతో స్వర్ణ పతకం దక్కించుకుంది. ఇదే విభాగంలో ఉత్తరప్రదేశ్ లిఫ్టర్ గౌరీ పాండే 176 కిలోల బరువెత్తి (స్నాచ్ 73, జెర్క్ 103) రజతం సాధించింది. యూత్ పురుషుల 56 కిలోల విభాగంలో జెర్మీ లాల్ రినుంగా (మిజోరాం) స్నాచ్‌లో 115 కిలోల బరువెత్తి రికార్డు సృష్టించాడు. జిమ్‌జాంగ్ దెరు (అరుణాచల్‌ప్రదేశ్) పేరిట ఉన్న 110 కిలోల రికార్డును అతడు అధిగమించాడు. కాగా, రెండో రోజు జరిగిన పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ లిఫ్టర్లు పతకాలు సాధించలేకపోయారు.

కపిల్, అజర్‌తో క్రికెట్ ఆడిన ట్రూడో

న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పిల్లలతో కలసి సరదాగా క్రికెట్ ఆడుతూ కనిపించారు. గురువారం ఢిల్లీ మోడ్రన్ స్కూల్ గ్రౌండ్‌లో టీమిండియా మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, అజరుద్దీన్‌తో కలసి క్రికెట్ ఆడారు. అజర్‌తోపాటు మరి కొందరు ఫీల్డింగ్ చేయగా.. ట్రూడో కుమారుడికి కపిల్ బౌలింగ్ చేశాడు.







KIA
TOGETHER WE WILL DRIVE INTO A PROSPEROUS FUTURE









"> 21

[illegible]

> hkl @¶
ô 瞢<éö • Òv

[illegible]

"† {_ ‡_ˆ‰w ^? 0R‰6 Š>
‹ ^ Œ • 0 u +R :
^ Ž 7 0
" •# •#eh_ _"' ""[
0•# ? 0 "#– "
-b 7s •h — •?
Q" c_ 3˜ w:Vs _%• W
"† _e !~!~ F ""[

[illegible]

š ›X W O X_œT •žk Ÿ"7 c9
" ¡tV#e [%e *M5¢Z1 3£uP i_
¤„¥Ž` _ g ¦ ¡tV#e ['Ÿ # M¦1 ^_
H§ †¨ œ •žk E]g ©:O ª 9~ c]«
^f „¬-®g ¯NVs _°7 \u±"_ E]g
Ü •žk f1 ¦1~ c]«

[illegible]

4 Y(b # 'Ü,

[illegible]

()*+, -. /012 3 4 56 -. $7 89: ; <=>? @A
BCCC D EF GCHIJ K$7 L MN ? 0 0OPQ
3T U =0V W XN Y Z [\ ]^_ HI 3 `7
WaO b! cX ! Nd _e f1gT hi c j?
=0Vk7 7 l0m7 no'pmeq rZs t0 #e s
'uN Vv[MN hw x f y / 7? # h z7?
_R{| }w u Z' 'F'Fs R ~ 0 • s p [

[illegible]

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్

విజయవాడ (గవర్నర్‌పేట), ఫిబ్రవరి 22: ఐసీడబ్ల్యూఏ ప్రకటించిన సీఎంఏ ఫైనల్ పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థిని జి.పూజిత(హాల్‌టిక్కెట్ నెంబరు-205770)కు ఆలిండియా ఫస్ట్ ర్యాంకు లభించిందని మాస్టర్‌మైండ్స్ విజయవాడ బ్రాంచి అడ్మిన్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐసీడబ్ల్యూఏలో 'మోడ్రన్' ర్యాంకులు

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):డిసెంబర్-2017 సీఎంఏ(ఐసీడబ్ల్యూఏ) ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్టు మోడరన్ అకాడమి డైరెక్టర్ వినయ్‌రంజన్ తెలిపారు. ఎస్.కౌసల్య 24వ ర్యాంకు, డి.బాలకృష్ణ 28వ ర్యాంకు, జి.అనుప్ ధీరజ్ 32వ ర్యాంకు, ఐ.మౌనిక ఇంటర్‌లో 31వ ర్యాంకు, పి.దివ్యశ్రీ ఇంటర్‌లో 36వ ర్యాంకు సాధించారన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే

- ఎంత మెజారిటీ ఇస్తారన్నదే ప్రధానం
- సంక్షేమం, అభివృద్ధి చూడండి
- ఓటుతో విజ్ఞత చూపండి: లోకేశ్

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం ఖాయమని పంచాయతీ రాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అయితే ఎంత మెజారిటీతో గెలిపిస్తారన్నదే ప్రధానమని ఆయన అభిప్రాయపడ్డారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో రూ.28 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు లోకేశ్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాలను దృష్టిలో ఉంచుకుని విజ్ఞతతో ఓటెయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు మండలంలో పది గ్రామాలకు అత్యవసరమైన బుడమేరు వంతెనతోపాటు తాగునీటి చెరువు సుందరీకరణ, నూతన జిల్లా పరిషత్ పాఠశాల భవనం, ఆరోగ్య కేంద్రం వంటి పనులను లోకేశ్ ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్యదీప్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... ఆర్థిక కష్టాల్లో ఉన్నా దేశంలో ఏ రాష్ట్రమూ అమలుచేయని విధంగా రైతులకు, డ్వాకా సంఘాల రుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. మంత్రి కామినేని శ్రీనివాసరావు, మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణరావు, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, ఉంగుటూరు గ్రామ అభివృద్ధి దాత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న లోకేశ్, కొనకళ్ల నారాయణ

మార్చి 5 నుంచి ఆందోళన: కొనకళ్ల

రాష్ట్రానికిచ్చిన హామీలను నెరవేర్చుతామని చెప్పేవరకు ఆందోళన కొనసాగిస్తామని ఎంపీ కొనకళ్ల నారాయణరావు చెప్పారు. వచ్చే నెల 5న మొదలయ్యే పార్లమెంటు సమావేశాల్లో టీడీపీ ఎంపీలంతా ఆందోళన చేసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని ఆయన తెలిపారు. తమకు రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ముఖ్యమని చెప్పారు.

సమయపాలన పాటించని డీలర్లను తొలగిస్తాం

- మంత్రి ప్రత్తిపాటి

గుంటూరు: 'రాష్ట్రంలోని చౌకధరల దుకాణాల డీలర్లందరూ ప్రభుత్వం నిర్దేశించిన పని వేళల్లో షాపులు తెరిచి ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎవరైతే సమయపాలన పాటించరో సంబంధిత డీలర్‌ని తక్షణమే తొలగించాలి' అని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి మాట్లాడారు.

ఏసీబీ వలలో సీఐ, కానిస్టేబుల్

- 30 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

గుంటూరు, ఫిబ్రవరి 22: ఓ కేసులో నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటుండగా గుంటూరు నల్లపాడు సీఐ కె.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శేషగిరిరావు అలియాస్ శేషును ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ వాహనానికి సంబంధించి ఫైనాన్స్ సంస్థకు మొత్తం బకాయి చెల్లించినట్లుగా నకిలీ ఎన్‌వోసీ సృష్టించి గుంటూరు డీటీసీ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసే ప్రయత్నం చేశారు. దీనిపై గత నవంబరు 9న డీటీసీ నల్లపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు ఏడుగురు నిందితులను గుర్తించారు. వారిలో నరసరావుపేటకు చెందిన నిఖిల్ ప్రింటర్స్ నిర్వాహకుడు కసుకుర్తి రాజశేఖర్ కూడా ఉన్నాడు. రాజశేఖర్ వద్ద మిగిలిన నిందితులు చోళమండలం ఫైనాన్స్ నకిలీ స్టాంపులు తయారు చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఈ కేసులో రాజశేఖర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు నల్లపాడు పోలీసులు రూ.లక్ష డిమాండ్ చేశారు. చివరకు రూ.30వేలకు బేరం కుదిరింది. అయితే ఈ కేసులో తాను నిర్దోషినని, తనకు ఏ పాపం తెలియదని ఆవేదనకు గురైన రాజశేఖర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువారం రాత్రి నల్లపాడు స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావును కలిశాడు. అయితే ఆయన కానిస్టేబుల్ శేషగిరిరావును కలవాలని సూచించారు. దీంతో రాజశేఖర్ నుంచి శేషు రూ.30వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ డీఎస్పీ దేవానంద్ శాంతో ఆధ్వర్యంలో సీఐలు ఫిరోజ్, వెంకటేశ్వర్లు దాడిచేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



స్తుతి విశేషం



స్తవ్యస్తవ ప్రియ స్తోత్రం స్తుతస్తోతారణ ప్రియః..

విష్ణు సహస్ర నామ 'స్తోత్రం'లో ఉన్న ఈ శ్లోక భాగం ఎంతో విశేషమైంది. మనం సామాన్యంగా స్తుతి, స్తోత్రం, స్తవం అనే పదాలతో ఉన్న స్తోత్ర సాహిత్యాన్ని చూస్తున్నాం. చదువుతున్నాం. కానీ వీటన్నిటికీ అర్థాలు వివిధ రీతులుగా ఉన్నాయి. వీటిల్లో 'స్తవం' అనేది భగవంతుని వర్ణించినప్పుడే సార్థకం అవుతుంది. ఎందుకంటే అది భగవత్ గుణవర్ణనం కాబట్టి. సమగ్ర గుణ సంపన్నుల విషయంలోనే 'స్తవం' యోగ్యమైంది. దీనికి భగవంతుని మించిన వారెవరు? అందుకే ఆయన్ను స్తుతః అన్నారు. మనుష్య లోకంలో మహర్షులు మొదలైనవారు స్తుతించటానికి తగిన శక్తి గల వారే అయినా భగవత్ వైభవాన్ని సంపూర్ణంగా స్తుతించేవారని మాత్రం భావించరాదు. యామునాచార్యుల వారు తమ స్తోత్రరత్నంలో చెప్పిన విధంగా.. నదిలో లేదా సముద్రంలో మునగడానికి అణువు, పర్వతం రెండూ సమానమే (కోమజ్జతోరణుకులాచల యోర్విశేషః) కాబట్టి దైవస్తుతి చేయడానికి మనం ఎంతో మునులు కూడా అంతే అని భావం. భగవంతుడు కూడా తనను స్తుతించే వారిని 'మీరెంతో గొప్పవారు' అని స్తుతిస్తాడట. దీనికి ఒక ఉదాహరణ.. ఒకసారి కైలాసానికి వెళ్లిన శ్రీకృష్ణుడిని ప్రస్తుతిస్తూ శివుడు ఎదురుగా వచ్చి నమస్కరించాడు. దీని ఫలం.. ఉభయులూ పరస్పరం వరాలను ఇచ్చుకుంటారు. ఇక్కడ కృష్ణుడు శివుని స్తుతించడం వల్ల 'స్తోతా' అని వ్యవహరిస్తారు. అందుకే స్తుతి, స్తోత్రం శబ్దాలను కూడా దైవేతరుల గూర్చి ప్రయోగించడం తగదు. వీటిని సులభ శబ్దాలుగా భావించరాదు.

- శ్రీ రంగాచార్య

Paramjyothi

పరంజ్యోతి

దసరాకల్లా రాష్ట్రానికి హైకోర్టు?

- నేలపాడులో సిటీ సివిల్ కోర్టు భవనాలు
- నిర్మాణానికి ఫుల్‌కోర్టు పచ్చజెండా
- ఆగస్టు 31 లేదా దసరా సెలవుల్లోపు పూర్తి
- జస్టిస్ భవన్ పూర్తయ్యేవరకు అందులోనే హైకోర్టు కార్యకలాపాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దసరా సెలవుల్లో రాష్ట్రానికి తరలి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ఫుల్ కోర్టు గురువారం సాయంత్రం హైకోర్టు సమావేశ మందిరంలో సమావేశమైంది. హైకోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలనకు బిల్డింగ్ కమిటీ గతవారం రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. తాను పరిశీలించిన భవనాలపై ఆ కమిటీ నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ భవనాలు హైకోర్టు ఏర్పాటుకు అనువుగా లేవని పేర్కొన్నట్లు సమాచారం. సిటీ సివిల్ కోర్టుకు అనుమతించాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం రాసిన లేఖ సారాంశాన్ని జస్టిస్ రమేశ్ రంగనాథన్ న్యాయమూర్తులకు ఈ సందర్భంగా వివరించినట్లు తెలిసింది. అమరావతిలో నిర్మించ తలపెట్టిన జస్టిస్ సిటీ సమీపంలోనే నేలపాడు వద్ద సిటీ సివిల్ కోర్టు భవనాలు నిర్మిస్తామని, ఇది శాశ్వత హైకోర్టు నిర్మించే ప్రాంతానికి సమీపంలోనే ఉంటుందని సదరు లేఖలో ప్రభుత్వం తెలియజేసింది. మార్చి 15 నుంచి సిటీ సివిల్ కోర్టు నిర్మాణాలు ప్రారంభించి ఆగస్టు చివరకు.. లేదా వచ్చే దసరా సెలవులకల్లా పూర్తి చేస్తామని, ఆ భవనాల్లో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసింది. హైకోర్టు శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యాక అందులోకి మారవచ్చని, తాత్కాలికంగా సిటీ సివిల్ కోర్టు భవనం నిర్మాణానికి అనుమతించాలని అభ్యర్థించింది. ఈ ప్రతిపాదనలకు ఫుల్‌కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

రయ్.. రయ్... రహదారి!

శరవేగంగా రాజధాని రోడ్ల నిర్మాణం.. రూ.9 వేల కోట్లతో 36 రహదార్లు.. 85% పూర్తయిన 'సీడ్ యాక్సిస్'

నెలలో తొలిదశ రహదారులు పూర్తి



మంగళగిరి, ఫిబ్రవరి 22: "హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు చూశాను. రాజధాని పనులు జోరుగా సాగుతున్నాయి. రహదారులు బాగా వేస్తున్నారు" అని నిన్నటికి నిన్న రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ ప్రశంసించారు. ఔను... నవ్యాంధ్ర రాజధాని ప్రాంతంలో రహదారుల నిర్మాణం జెట్ స్పీడులో సాగుతోంది. హైవేలను మించిన వెడల్పుతో తయారవుతున్న విశాలమైన రహదారులను చూసి స్థానికులు అబ్బురపడుతున్నారు. రాజధాని ప్రాంతంలో ఎటువైపు వెళ్లినా... రోడ్ రోలర్లు, టిప్పర్లు, పొక్లయిన్లతో సాగుతున్న రహదారి నిర్మాణ పనులే కనిపిస్తాయి. ఇక్కడ రూ.9వేల కోట్లకుపైగా వ్యయంతో 36 రహదారులను నిర్మిస్తున్నారు. అవసరమైనప్పుడు ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రిళ్లు సైతం పనులు చేస్తున్నారు. మొదటి దశలో చేపట్టిన 7 రోడ్ల పనులు మరో నెలలో పూర్తికానున్నాయి. మొత్తం రహదారుల పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులను పరుగులు తీయిస్తున్నారు.

ఎటుచూస్తే అటు...

'గ్రీన్ సిటీ'గా ఆవిర్భవిస్తున్న అమరావతిలో ప్రభుత్వ పరిపాలన నగరి, ఆరోగ్యనగరి, న్యాయ నగరి, క్రీడా నగరి, మీడియా సిటీ ఇలా 'నవ నగరాలను' నిర్మించాలని ప్రతిపాదించారు. వెలగపూడిలో ఇప్పటికే తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించారు. ముఖ్యమైన ప్రాంతాలన్నింటినీ కలిపేలా అమరావతిలో మొత్తం 593 కిలోమీటర్ల నిడివితో రహదారులను నిర్మిస్తున్నారు. వీటిలో అతి ముఖ్యమైన 316 కిలోమీటర్ల పొడవున్న 36 రహదార్ల నిర్మాణం కోసం రూ.9162 కోట్లను వెచ్చిస్తున్నారు. మొత్తం 15 ప్యాకేజీల్లో చేపట్టిన పనులను పదికిపైగా ప్రముఖ నిర్మాణ సంస్థలు చేస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో ఎటు చూసినా రహదారి పనులు సాగుతున్నాయి. వందల సంఖ్యలో యంత్రాలు, వాహనాలు... తిరుగుతున్నాయి. రాజధానిలో మేజర్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్, కలెక్టర్ రోడ్ల పేరుతో నాలుగు రకాల రహదార్లను నిర్మిస్తున్నారు. మేజర్ ఆర్టీరియల్ రహదారులను 180 అడుగుల వెడల్పుతో వేస్తున్నారు. ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రహదార్లను 150 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నారు. కలెక్టర్ రోడ్లను మాత్రం 75 అడుగుల వెడల్పుతో వేస్తున్నారు.



సీడ్ యాక్సిస్ స్పెషల్...

రాజధానిలో అత్యంత ప్రధానమైనది... 'సీడ్ యాక్సిస్ రోడ్'. ఇది (విజయవాడలో కనకదుర్గమ్మ వారధి దాటిన తర్వాత) 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి అమరావతి నగరంలోకి నేరుగా తీసుకెళ్లే ఎక్స్‌ప్రెస్ హైవే! మొత్తం 21.26 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ దారిని రెండు ప్యాకేజీలుగా చేపట్టారు. మొదటి ప్యాకేజీలో 18.27 కిలోమీటర్ల దారిలో 85 శాతం పనులు పూర్తయ్యాయి. దీనికోసం రూ.230 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అటూ ఇటూ రహదారి మధ్యలో భారీగా ఖాళీ స్థలాన్ని వదిలారు. భవిష్యత్తులో రోడ్డును వెడల్పు చేయాల్సి వస్తే... కొత్తగా భూసేకరణ జరపాల్సిన అవసరం లేకుండా, మధ్యలోని స్థలాన్నే ఉపయోగించుకునేలా ప్రణాళిక రచించారు. ఇక సీడ్ యాక్సెస్ రోడ్‌కు ఇరువైపులా మొక్కలు నాటారు. భవిష్యత్తులో ఇవి భారీ వృక్షాలై... చల్లని నీడను అందించనున్నాయి. ఒకసారి రోడ్లు వేయడం... ఆ తర్వాత పైప్‌లైన్లు, ఇతర పనులకోసం వాటిని తవ్వేయడం ప్రతిచోటా జరిగేదే! రాజధాని రోడ్ల విషయంలో ఇలాంటివి జరగవు. సుమారు 15 ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రహదారుల వెంట గ్యాస్, తాగునీరు, ఎలక్ట్రికల్, కేబుల్ వంటి పైపులైన్లను కూడా ఒకేసారి ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఆయా అవసరాల కోసం మళ్లీ మళ్లీ తవ్వాల్సిన అవసరం ఉండదు.

ట్యాంక్ ఫుల్... అయినా ట్రబుల్!

- పెట్రోల్‌లో పెరిగిన ఇథనాల్ శాతం
- చెమ్మ తగిలితే నీరవుతున్న ఇంధనం
- మిశ్రమంలో ఆయిల్ కంపెనీ ఇష్టారాజ్యం
- తగ్గుతున్న మైలేజ్, ఇంజన్‌పై దుష్ప్రభావం
- వినియోగదారులకు లీటరుకు రూ.8నష్టం
- మా తప్పేం లేదు: ఏపీఎఫ్‌పీటీ ప్రతినిధులు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈ మధ్యకాలంలో మీ వాహనం అకస్మాత్తుగా ఆగిపోతోందా? స్టార్ట్ చేస్తే వెంటనే కదలడం లేదా? మైలేజ్ కూడా తగ్గుతున్నట్లు అనుమానంగా ఉందా? అయితే అందులో ఉంది కచ్చితంగా పెట్రోలు కాదు. దానిస్థానంలో నీరు ఉండటమే ఈ సమస్యలకు కారణం. బంకులో పోయించుకునే ప్రతి లీటరు పెట్రోలులో 10శాతం నీరే వాహనదారులకు వస్తోంది! ఫలితంగా మైలేజ్ తగ్గడం, వాహనం ఆగిపోవడంతో పాటు క్రమంగా ఇంజన్లు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం లీటరు పెట్రోలు ధర దాదాపుగా రూ.80 ఉన్నందున ఒక్కో లీటరుపై వాహనదారులకు సుమారు రూ.8 వరకూ నష్టం వాటిల్లుతోంది. కొలతపరంగా ఇబ్బంది లేకపోయినా అది ఇంధనంగా పని చేయకపోవడమే సమస్య. ఇథనాల్ ఒక రకమైన ఆల్కాహాల్ ద్రావకం. అంతర్జాతీయంగా దిగుమతి సుంకాలు తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పెట్రోలులో ఇథనాల్ శాతం పెంచాలని ఇటీవల నిర్ణయం తీసుకుంది. 2003 నుంచి పెట్రోలులో దీనిని 5శాతం కలుపుతుండగా, ఇప్పుడు 10శాతానికి పెంచింది. ఇది కూడా ఇంధనం తరహాలోనే పనిచేస్తుంది. దానితో సమానంగా మైలేజ్ ఇస్తుంది. అయితే సరైన విధంగా మిశ్రమం చేయకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయి. పెట్రోలులో కొద్దిగా నీరు కలిసినా వెంటనే అందులోని ఇథనాల్ మండే స్వభావం కోల్పోయి సాధారణ నీటిగా మారుతోంది. దానివల్ల ఇంజను పనితీరుపై దుష్ప్రభావం చూపుతోంది.

పాత పద్ధతుల్లో మిశ్రమం

పెట్రోలులో ఇథనాల్ కలిపే విధానం సక్రమంగా జరగడం లేదు. ఈ విషయంలో ఇతర దేశాల్లో అధునాతన పద్ధతులు అమల్లో ఉండగా ఇక్కడ మాత్రం ఆయిల్ కంపెనీలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయని ఆరోపణలొస్తున్నాయి. ముందు సగం ట్యాంకర్‌ను పెట్రోలుతో నింపిన తర్వాత ఇథనాల్ కలిపి మళ్లీ పెట్రోలు నింపుతున్నారని చెబుతున్నారు. ఈ విధానంలో అది సరిగా కలవకుండా తడి తగిలిన వెంటనే వేరుపడుతోంది. పెట్రోలులో నీరు కలిస్తే అది వెంటనే ట్యాంకరు అడుగు భాగానికి చేరుతుంది. వాహనాల్లో కూడా ఈ నీరు ట్యాంకు అడుగుకు చేరడంతో స్టార్టింగ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. బంకుల యాజమాన్యాలే దీనికి కారణమని వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల అనంతపురం, కృష్ణా జిల్లాల్లో రెండు బంకులను సీజ్ చేశారు.

మాపై నిందలు సరికాదు: ఏపీఎఫ్‌పీటీ

పెట్రోలులోని ఇథనాల్ నీరుగా మారడంతో తమకేం సంబంధం లేదని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెట్రోల్ అండ్ డీజిల్ డీలర్స్ అసోసియేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మలినేని నారాయణ ప్రసాద్, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడారు. ఇథనాల్‌ను సరైన విధానంలో కలపకపోవడం, వేపర్స్ రికవరీ సిస్టమ్ పనిచేయకపోవడం వల్ల ఈ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో తమ ప్రమేయం లేకున్నా వాహదారులు తమపై నిందలు వేస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో వాహనదారులకు అవగాహన కల్పించే వరకూ ఆయిల్ కంపెనీలు పెట్రోల్‌లో ఇథనాల్ కలపకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బంకుల్లోని డ్రై డిప్ సామర్థ్యాన్ని 800 లీటర్లకు పెంచాలని, దానివల్ల ఇథనాల్ నీరుగా మారినా అది కిందే ఉండిపోయి, వాహనదారులకు నాణ్యమైన ఇంధనం అందుతుందని సూచించారు.



పెట్రోల్‌లో ఇథనాల్ నీరుగా మారి కిందకు చేరిన దృశ్యం

నీరుగా మారుతోందిలా...

- ప్రస్తుత రవాణా విధానం, బంకుల నిర్వహణతో 90శాతం ఇథనాల్ నీరుగా మారుతోంది. రవాణా చేసే సమయంలో ట్యాంకరులో కొద్దిగా నీరున్నా అది ఇథనాల్‌ను నీటిగా మార్చేస్తుంది.
- సాధారణంగా 5వేల లీటర్ల ట్యాంకర్లు బంకులకు వస్తాయి. అంటే అందులో 500లీటర్ల ఇథనాల్ ఉంటుంది. ఈ ట్యాంకర్లకు ఏమాత్రం చెమ్మ తగిలినా ఇథనాల్ స్వభావం వెంటనే మారిపోతుంది.
- బంకుల్లో భూమిలో ఉండే ట్యాంకర్ల అడుగు భాగం తేమకు గురవుతుంది. దీనివల్ల కూడా ఇథనాల్ నీరుగా మారుతుంది.
- వాహనాల్లోని ట్యాంకుల్లో ఎక్కడైనా కొద్దిపాటి తడి ఉన్నా ఇదే పరిస్థితి తలెత్తుతుంది.
- అయితే బంకుల్లోని ట్యాంకర్లలో నీరు నిలవకుండా ఆయిల్ కంపెనీలు వేపర్ రికవరీ సిస్టమ్‌ను ఏర్పాటుచేశాయి. కానీ ప్రస్తుతం ఇది ఎక్కడా పనిచేయడం లేదు.



ధర్నాలో పాల్గొన్న రఘువీరా తదితరులు

ఏప్రిల్ 5లోపే హోదా తెచ్చుకోవాలి

- రాహుల్ వస్తే తొలిసంతకం హోదాపైనే: రఘువీరా

చిత్తూరు, ఫిబ్రవరి 22: కేంద్రంపై ఒత్తిడి తెచ్చి..బడ్జెట్‌లో సవరణలు చేసి ప్రత్యేకహోదా సాధించుకోవాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. ఏప్రిల్ ఐదో తేదీలోగా ప్రత్యేకహోదా తెచ్చుకోకుంటే.. ఎన్‌డీఏ హయాంలో ఇక ఎప్పటికీ రాదని చెప్పారు. 2019లో రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాక తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే పెట్టిస్తామన్నారు. గురువారం చిత్తూరులో కాంగ్రెస్ నిర్వహించిన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష సభలో ఆయన ప్రసంగించారు. రాజకీయ ఎత్తుగడల కోసం రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టొద్దన్నారు. 'నాలుగేళ్లలో సీఎం చంద్రబాబు 29 సార్లు ఢిల్లీకి వెళ్లినా చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా మోదీ.. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు. ప్రత్యేకహోదా వస్తే తప్ప రాష్ట్రం బాగుపడదన్న విషయాన్ని ఇప్పుడు ప్రజలు గుర్తించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా హోదా కోసం నాలుగేళ్లుగా పోరాడుతున్నది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే' అని ధ్వజమెత్తారు. అనంతరం రోడ్డుపై కొంతసేపు ధర్నా చేశారు.

హోదాపై.. ఓ యాక్టర్ పిల్లిమొగ్గలు

- మోదీని ఎదిరించే సత్తా జగన్‌కే: భూమన

విజయనగరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకహోదాపై ఓ సినిమా యాక్టర్ పిల్లిమొగ్గలు వేస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై వైసీపీ ప్రధానకార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రత్యేకహోదా కావాలంటూ మొదటి నుంచీ పోరాటాలు చేస్తోంది వైసీపీయేనని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. గురువారం విజయనగరంలో విజయనగరం, అరకు పార్లమెంటరీ నియోజకవర్గాల వైసీపీ బూత్ కమిటీల కన్వీనర్ల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీని ఎదురించే సత్తా తమ పార్టీ అధ్యక్షుడు జగన్‌కు మాత్రమే ఉందన్నారు. సోనియాగాంధీ నీచ రాజకీయాల కారణంగా జగన్ జైలుకెళ్లారని, ఆ కేసులన్నీ ఛేదించుకుని త్వరలో అగ్నిపునీతుడై బయట పడతారన్నారు.

హామీలను నెరవేర్చాలి: మంత్రి ఆది

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):వివిధ సందర్భాల్లో రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని మార్కెటింగ్ మంత్రి ఆదినారాయణరెడ్డి స్పష్టం చేశారు. నిరుడు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బుందేల్‌ఖండ్‌కు ఏడాదిలోపే రూ.20 వేల కోట్లు ఇస్తున్నట్లు మోదీ ప్రకటించారని.. నాలుగేళ్లు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వెంకయ్య మాటకు కేంద్రం విలువ ఇవ్వాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే చంద్రబాబు రాజకీయపరమైన నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తు ఉండాలో వద్దో ఆయనే నిర్ణయిస్తారని అన్నారు. 'బిల్‌గేట్స్, ముఖేశ్ అంబానీ, సింగపూర్ ప్రధాని వంటి వారు చంద్రబాబు పని తీరును మెచ్చుకుంటున్నారు. తమిళనాడులో పార్టీ పెట్టిన కమల్‌హాసన్ సైతం తన హీరో చంద్రబాబేనని ప్రకటించారు.

గురుకులాలాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష

- 2018-19 నుంచి అమలు.. 5వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్
- మార్చి 20 వరకూ దరఖాస్తుల స్వీకరణ.. ఏప్రిల్ 8న పరీక్ష: మంత్రి ఆనందబాబు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయాలు, ఏపీ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఇకపై ఉమ్మడిగా ఒకే ప్రవేశపరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 విద్యా సంవత్సరానికిగాను ఏప్రిల్ 8వ తేదీన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించి, జిల్లాను యూనిట్‌గా తీసుకుని మార్కుల ఆధారంగా ఆయా విద్యాలయాల్లో సీట్లు భర్తీ చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు చెప్పారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... ఆయా విద్యాలయాలకు ఇంగ్లిష్ మాధ్యమంలో వేర్వేరుగా ప్రవేశపరీక్షలు నిర్వహించేవారని, ఈ క్రమంలో విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన సీఎం చంద్రబాబు... ఉమ్మడి పరీక్ష నిర్వహించాలని ఆదేశించారని వివరించారు. నాలుగో తరగతిలోని ఇంగ్లిష్, తెలుగు, గణితం, సైన్స్, సోషల్ పాఠ్యాంశాల నుంచి 10 ప్రశ్నల చొప్పున మల్టిపుల్ చాయిస్‌లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఉంటుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని మంత్రి తెలిపారు. ఇందుకోసం రూపొందించిన... 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీజీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్‌ను మంత్రి ఆవిష్కరించారు. విద్యార్థి ఆధార్ నంబర్ అందులో ఎంటర్ చేయగానే.. ఆ విద్యారి అన్ని వివరాలు నమోదైపోతాయన్నారు. మీ-సేవా కేంద్రాల్లో కూడా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.



ఉమ్మడి పరీక్ష కోసం వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఆనందబాబు

లోకం తీరు




ఓట్ల కోసం ఉన్న డబ్బంతా పంచి పెట్టవయ్యా... వాళ్లు మళ్లీ దాచుకునేది బ్యాంకుల్లోనే కదా!!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	18.4	35.0
గుంటూరు	19.5	36.0
హైదరాబాద్	19.8	33.5
అనంతపురం	20.0	35.0
విజయవాడ	20.1	34.1

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. గురువారం కర్నూలులో 36.3, విశాఖపట్నం, అనంతపురంలలో 35 డిగ్రీలు నమోదయ్యాయి. సముద్రం నుంచి గాలులు లేకపోవడంతో పగటి పూట ఎండలు పెరిగాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. అదే సమయంలో రాత్రి చలి వాతావరణం నెలకొంది. ఆకాశం నిర్మలంగా వుండడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. ఆరోగ్యవరంలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక నుంచి పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



ప్రధాని పదవిని ఆశించిన సోనియా!

వాజపేయి సర్కారు పడిపోయిన తర్వాత 1999లో సోనియాగాంధీ ప్రధాని పదవిని ఆశించారు. అందుకే అప్పుడు కాంగ్రెస్ నుంచి తప్పుకున్నా. ప్రధాని పదవికి తాను లేదా మన్మోహన్‌సింగ్ మాత్రమే అర్హులం అని నా అభిప్రాయం. ఇటీవలి కాలంలో రాహుల్‌లో ఎంతో మార్పు వచ్చింది. దేశమంతా పర్యటిస్తూ ప్రజలతో మమేకమై, నేర్చుకోవాలనే తపన అతనిలో కన్పిస్తున్నాయి.

- ఎన్సీపీ అధినేత శరద్‌పవార్

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 10 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి w w లో సంప్రదించాలి. w

- ఆంధ్రజ్యోతి, తిరుమల



ఈ-సిగరెట్లలో విష లోహాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: మామూలు సిగరెట్‌కు ప్రత్యామ్నాయంగా ధూమపాన ప్రియుల కోసం సృష్టించిన ఈ-సిగరెట్ చాలా ప్రమాదమని అంటున్నారు అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఈ-సిగరెట్ ఆవిరిలో విష లోహాలున్నాయని చెబుతున్నారు. పరికరం వేడెక్కినపుడు వెలువడే పొగలో సీసం, క్రోమియం, మాంగనీసు లాంటి విష లోహాలు ఉంటున్నాయని, ఆ ఆవిరిని పీల్చితే ఊపిరితిత్తులు, కాలేయం, రోగ నిరోధక వ్యవస్థ, మెదడు, గుండె దెబ్బ తింటాయని, కేన్సర్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు.

కార్బన్ మోనాక్సైడ్‌తో యాంటీబయాటిక్స్ పని మెరుగు

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: కార్బన్ మోనాక్సైడ్ ఆరోగ్యానికి హానికరం. ఇది వాతావరణంలో 35పీపీఎం కంటే మించి ఉంటే ప్రమాదం. కానీ, ఈ వాయువు యాంటీ బయాటిక్స్ పనితీరు మెరుగుపర్చడంలో బాగా పనిచేస్తుందని అమెరికాలోని జార్జియా స్టేట్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. మెట్రోనైడజోల్ యాంటీ బయాటిక్ ఔషధానికి కార్బన్ మోనాక్సైడ్ జతచేసినపుడు అది 'హెచ్ పైలోరీ' అనే బ్యాక్టీరియాను నాశనం చేసినట్లు తమ పరిశోధనల్లో తేలిందని వెల్లడించారు.

నవ్య
శుక్రవారం • 23 ఫిబ్రవరి 2018
navya@andhrajyothy.com

సొగసు

వేడుక చిన్నదైనా, పెద్దదైనా సల్వార్‌కమీజ్, చుడీదార్లు వేసుకోవడమే సౌకర్యంగా భావిస్తారు ఎక్కువమంది. కాకపోతే ఆ డ్రెస్‌లు కాస్త గ్రాండ్‌లుక్‌తో స్పెషల్‌గా కనిపించాలని జల్లెడ పట్టి వెతికి మరీ కొంటారు. లేదా తమకు నచ్చిన డిజైన్లను స్పెషల్‌గా డిజైన్ చేయించుకుంటారు. అలాంటి కొన్ని స్పెషల్ డిజైన్‌లు మీ కోసం...

గ్రాండ్ లుక్



లేత గులాబీ రంగు ఆర్ట్ సిల్క్ అనార్కలి ఎంబ్రాయిడర్డ్ సూట్ ఇది. నేలను తాకేంత పొడవు ఉన్న కమీజ్‌కు జరీ ఎంబ్రాయిడరీ, స్టోన్‌వర్క్, లేస్ అంచులు కొత్త అందాన్ని తెచ్చాయి. ఈ కమీజ్‌కు అదే రంగులో అంటే లేత గులాబీ రంగులోనే షాంతూన్ చుడీదార్ కుట్టారు. నెట్ దుపట్టాకు లేస్ డిటెయిల్స్ ఇవ్వడంతో గ్రాండ్ అండ్ స్పెషల్ లుక్ వచ్చేసింది.
ధర : 7,221 రూపాయలు.

ఫాక్స్ జార్జెట్ పార్టీవేర్ అనార్కలి సల్వార్ కమీజ్. ఆవపిండి రంగులో ఉన్న ఈ డ్రెస్ పార్టీలకు వేసుకుంటే వెలిగిపోవడం ఖాయం. కమీజ్ లోపల, బాటమ్‌లకు సంతూన్ ఫ్యాబ్రిక్ వాడారు. బాటమ్ రంగు పసుపు. దుపట్టాకు వాడిన ఫ్యాబ్రిక్ నంజ్‌నీన్. సెల్ఫ్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రెస్‌ను మొదటి ఉతుకు డ్రైక్లీనింగ్‌కు ఇవ్వాలి. పండుగలకు, పార్టీలకు, పెళ్లి వేడుకలకు వేసుకుంటే సెంటరాఫ్ అట్రాక్షన్ మీరే.
ధర: 1,799 రూపాయలు.

నీలం, ఎరుపు రంగుల అనార్కలి డ్రస్ ఇది. జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో స్టిచ్ చేసిన ఈ డ్రెస్‌ను రిసెప్షన్, సంగీత్, పెళ్లి వేడుకలకు వేసుకుంటే బాగుంటుంది. జార్జెట్ మెటీరియల్ వాడారు కాబట్టి డ్రైక్లీనింగ్ చేయించాలి. ఈ అనార్కలి స్టయిల్ కమీజ్‌కు చుడిదార్ బాటమ్ అయితేనే బాగుంటుంది. దుపట్టా వేసుకోవాలి అనిపిస్తే వేసుకోవచ్చు. లేకపోయినా స్టయిలిష్‌గానే ఉంటుంది.
ధర : 1,500 రూపాయలు

కశ్మీర డిజైనర్ స్ట్రెయిట్ సల్వార్ కమీజ్‌ను జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో కుట్టారు. ఈ డ్రెస్ ఇన్నర్, బాటమ్‌లు కూడా జార్జెట్ మెటీరియల్‌వే. దుపట్టా మాత్రం సంతూన్ ఫ్యాబ్రిక్ వాడారు. కమీజ్ పైన ఎంబ్రాయిడరీ వర్క్ ఇవ్వడంతో గ్రాండ్‌లుక్ వచ్చేసింది. పార్టీ, పెళ్లిళ్ల వంటి వేడుకలకు వేసుకుంటే స్పెషల్ అట్రాక్షన్ మీరే అవుతారు. ప్రత్యేక సందర్భాల్లో వేసుకునే ఈ డ్రెస్‌ను డ్రైక్లీన్ మాత్రమే చేయించాలి.
ధర: 1,765 రూపాయలు

జార్జెట్ ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేసిన స్ట్రెయిట్ సల్వార్ కమీజ్ ఇది. ఈ డ్రెస్ మీదంతా హ్యాండ్ వర్క్ చేశారు. పార్టీలు, పెళ్లిళ్ల వంటి వేడుకలకు వేసుకునే ఈ సల్వార్ కమీజ్‌ను డ్రైక్లీన్ చేయించాలి. ఇన్నర్, బాటమ్‌లకు వెల్వెట్ మెటీరియల్ వాడారు. దుపట్టాగా షిఫాన్ ఫ్యాబ్రిక్‌ను ఇచ్చారు.
ధర: 2,275 రూపాయలు.

కౌన్సెలింగ్ కార్నర్

ఈ బంధం నిలిచేదెలా?

నా పెళ్లయి మూడేళ్లు. ఒక పాప. మేము కలిసి ఉన్నది ఆరునెలలే. అంటే విడిపోయామని కాదు. చదువు కోసం అతను దూరం వెళ్లడంతో, నేను పాపతో అమ్మవాళ్ల దగ్గరే ఉంటూ పీజీ పూర్తి చేశా. ఇటీవల నా భర్త చదువు పూర్తి చేసి వచ్చాడు. పై చదువుల కోసం అమెరికా వెళుతున్నాడు. నేను, పాప కూడా అతనితో వెళుతున్నాం. కానీ ఏదో భయం. మొదటి నుంచీ మా ఇద్దరి మధ్య చిన్న చిన్న గొడవలు! ఇన్నాళ్లూ పెద్దగా కమ్యూనికేషన్ లేదు. నాకేమో ఉద్యోగం చేయాలని కోరిక. అంత దూరం వెళ్కాక అతను నేను ఉద్యోగం చేయడానికి అంగీకరించకపోతే? ఈ ఆలోచనలు నన్ను వెంటాడుతున్నాయి. ఈ బంధాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలో తెలియడం లేదు.

- షామిలి



వివాహమైన తొలి రోజుల్లో ఎంతగా ప్రేమానురాగాలు ఉంటాయో, అంతే కోపతాపాలూ ఉంటాయి. వాటినే భూతద్దంలో చూసి భయపడుతున్నారేమో ఆలోచించండి. మూడేళ్ళలో ఇద్దరి మధ్య మాటలు, ఉత్తరాలు అసలు లేకుండా ఉండవు కదా! అందులోనూ... పాప కూడా ఉందంటున్నారు. మీరన్నా, పాపన్నా అతనికి నిర్లక్ష్యం ఉంటే తనతో పాటు అమెరికా తీసుకెళ్ళడు. మీరు కూడా ఇన్నేళ్ళలో అతనికి దగ్గర కావడానికి ఏమీ ప్రయత్నించినట్లు లేదు. బహుశా ఇద్దరూ చదువులతో బిజీగా ఉండి ఉంటారు. ఇప్పటికైనా కలసి ఉండే అవకాశం వచ్చింది. లేనిపోని భయాలతో అది పోగొట్టుకోకండి. వెళ్లేలోపే ఇద్దరూ కూర్చొని మాట్లాడుకోండి. పోట్లాట ఇద్దరి మధ్య అగాధం సృష్టిస్తే, మంచి మాటలు వంతెనలా కలుపుతాయి. మీకు కూడా ఈ బంధం నిలవాలని ఉంది కాబట్టే తాపత్రయపడుతున్నారు. మీ భర్త ఉద్దేశం తెలియకుండా నిందించడం, భయపడటం అనవసరం. చదువు విలువ తెలిసిన వ్యక్తి కాబట్టి, ఆయన మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టరు. హాయిగా మీ భర్తతో వెళ్లి ఇద్దరి కలలూ సాకారం చేసుకోండి. ఆల్ ది బెస్ట్!

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

ఫిట్‌నెస్

ఆ టైములోనూ చేయొచ్చు!

బహిష్టు సమయంలో వర్కవుట్లు చేయకూడదని చాలామంది అనుకుంటుంటారు. కానీ ఇది పూర్తిగా అపోహ మాత్రమే. క్రమం తప్పకుండా రోజూ చేసే వ్యాయామాలనే ఆ టైములో కూడా చేయవచ్చంటున్నారు ఫిట్‌నెస్ నిపుణులు. పైగా ఇలా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని చెప్తున్నారు. బహిష్టు సమయంలో వ్యాయామాలు ఆడవాళ్లకు ఇబ్బంది కలిగిస్తాయనేది కేవలం అపోహ మాత్రమేనని స్పష్టంచేస్తున్నారు. అయితే రుతుస్రావం ఎక్కువగా ఉన్నప్పుడు హై ఇంటెన్సిటీ ట్రైనింగ్ లేదా హెవీ లిఫ్టింగ్‌లను చేయవద్దంటున్నారు.

ఎందుకంటే కొంతమంది మహిళలు ఆ టైములో కడుపులో తీవ్ర నొప్పితో బాధపడుతుంటారు. అసౌకర్యంగా ఫీలవుతుంటారు. కొందరు ఆడవాళ్లయితే ఆ సమయంలో వాటర్ రిటెన్షన్ సమస్యతో, గ్యాస్ సమస్యతో బాధపడుతుంటారు. అయితే వీటి కారణంగా బహిష్టు సమయంలో వ్యాయామాలు ఆపాల్సిన పని లేదు. రోజూ చేసే వ్యాయామాలనే ఆ టైములో చేసేటప్పుడు అలసటగా అనిపించినా, కడుపులో నొప్పిగా అనిపించినా... యోగా, రన్నింగ్, క్రీడలు ఆప్షన్స్‌ను అనుసరించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఆ సమయంలో వ్యాయామాలు చేయడం వల్ల బ్లడ్ లాస్ ఏమీ ఉండదంటున్నారు. ఒకవేళ వర్కవుట్ చేసేటప్పుడు కళ్లు తిరిగినట్టు ఉన్నా, నీరసంగా అనిపించినా తలను నేలకానిచ్చి పడుకుని, కాళ్లను పైకి పెట్టి కాసేపు అలాగే ఉంటే సాధారణ స్థితికి వస్తారని చెప్తున్నారు.

అయితే ఆ టైములో శరీరానికి అలవాటైన వ్యాయామాలను మాత్రమే చేయాలి. అంతేతప్ప చేసే వ్యాయామాల్లో తీవ్ర మార్పులు మాత్రం చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు.



స్ఫూర్తి

నింగిలో నిప్పుకణిక!

పైకి ఎగిరేటప్పుడు, దిగేటప్పుడే ఆ యుద్ధ విమానం వేగం గంటకు 340 కిలోమీటర్లు. అంతకంతకీ వేగం పెంచుకుంటూ, రాకెట్‌లా ఆకాశంలోకి దూసుకెళ్లి, గిరికీలు కొట్టే 'మిగ్ - 21 బైసన్' ఫైటర్ జెట్ నడపటం అంటే ఆషామాషీ కాదు. అలాంటిది ఆ విమానాన్ని 30 నిమిషాలపాటు...ఒంటరిగా నడిపి చరిత్ర సృష్టించింది అవనీ చతుర్వేది. ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ని నడిపిన మొట్టమొదటి భారతీయ మహిళగా గుర్తింపు పొందిన అవని విశేషాలు చాలానే ఉన్నాయి.



ఎప్పటికైనా ఆకాశంలో ఎగరాలనేది మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాకు చెందిన అవనీ చతుర్వేది చిన్నప్పటి కల. ఆ కల ఆమెతోపాటే పెరిగి పెద్దయింది. అయితే ఆ కల నిజమయ్యేదెలా? చదవాలనుకుంటున్నది కంప్యూటర్ ఇంజనీరింగ్. కానీ ఫైటర్ జెట్ నడపాలనేది కల. ఆ రెండు కోరికలు తీరాలంటే ఆ రెండు ప్రయత్నాలు సమాంతరంగా సాగాలి. అందుకే, రాజస్థాన్‌లోని బనస్థలి యూనివర్సిటీలో బిటెక్ చదువుతూనే, ఫ్లయింగ్ క్లబ్‌లో మెంబర్‌గా చేరింది. అలా శిక్షణ తీసుకుంటూనే, బిటెక్ ముగించి, 2014లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పరీక్ష పాసై, భారతీయ వైమానికదళంలో చేరిపోయింది.



అవని తండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తల్లి గృహిణి. అవని అన్నయ్య కూడా ఆర్మీ ఆఫీసరే! చిన్నప్పటి నుంచీ అన్నను ఆర్మీ దుస్తుల్లో చూసిన అవనికి అతనిలా ఆర్మీలో స్థిరపడాలనే కోరిక కూడా కలిగేదట. ఆ విషయం గురించి చెబుతూ...'మా అన్నయ్యే నాకు స్ఫూర్తి. తనని చూసినప్పుడల్లా ఆర్మీ వృత్తిలో స్థిరపడాలని అనిపిస్తూ ఉండేది. మరోపక్క, ఆర్మీలో వైమానికదళంలో చేరితే, విమానాలు నడపాలనే నా కలనూ నిజం చేసుకోవచ్చు. అందుకే, చదువు పూర్తవగానే ఆర్మీలో చేరిపోయాను' అంటూ చెప్పుకొచ్చింది అవని. ఫైటర్ జెట్ నడిపిన తొలి మహిళా పైలట్‌గా పేరు తెచ్చుకున్న వేళ ఆమె మాట్లాడుతూ....'ఫైటర్ పైలట్లను బట్టే ఏ వైమానికదళానికైనా పేరొస్తుంది. అలాంటి మంచి ఫైటర్ పైలట్ కావాలనేది నా కల. అన్నిటికంటే మంచి ఎయిర్‌క్రాఫ్ట్ నడపాలనేది నా ఆశయం' అంటూ చెప్పింది. అవనికి విమానాలు నడపటమే కాదు, బొమ్మలు గీయటం, వయొలిన్ కూడా వచ్చు. ఖాళీ సమయాల్లో చెస్ ఆడుతుందట. తన చిన్ననాటి కలను సాకారం చేసుకున్న అవనీ చతుర్వేది, 'ది బెస్ట్ ఫైటర్ పైలట్'గా గుర్తింపు పొందాలని కోరుకుందాం!

పోటీ తప్పింది!

ఏప్రిల్ 20న మహేశ్... మే 4న అల్లు అర్జున్


మహేశ్‌బాబు


అల్లు అర్జున్

మహేశ్ నటిస్తున్న 'భరత్ అనే నేను'. అల్లు అర్జున్ నటిస్తున్న 'నా పేరు సూర్య' చిత్రాలు ఎట్టిపరిస్థితుల్లో ఒకేరోజున .. అంటే ఏప్రిల్ 26న విడుదలవుతాయన్న వార్త ఆయా హీరోల అభిమానుల్లో ఉత్సాహం నింపినా, ఈ వార్త విని పరిశ్రమలోని పెద్దలు మాత్రం ఆందోళన చెందారు. ఇది పరిశ్రమకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదనీ, దీని వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ అనే అభిప్రాయంతో ఈ పోటీనీ నివారించడానికి దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు రంగంలోకి దిగారు. ఈ రెండు చిత్రాల నిర్మాతలతో సమావేశమై వారికి నచ్చజెప్పారు. ఈ రెండు చిత్రాల మధ్య కనీసం 15 రోజుల గ్యాప్ ఉండేలా చూడమని కోరడంతో చివరకు నిర్మాతలు అందుకు సరేనన్నారు. హీరోలిద్దరూ ఈగోలకు పోకుండా నిర్మాతలు తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పడంతో మహేశ్, అల్లు అర్జున్ మధ్య పోటీ తప్పింది. నిజంగా తెలుగు చిత్రపరిశ్రమలో ఇది శుభ పరిణామమే. ఈ సందర్భంగా నిర్మాతలు డి.వి.వి. దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ 'మా రెండు చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలన్న ఉద్దేశ్యంతో 'ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను' , మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చేయడానికి నిర్ణయించాం. పరిశ్రమలో ఆరోగ్యకరమైన వాతావర ణం ఉండాలన్న అభిప్రాయంతో తీసుకొన్న ఈ నిర్ణయానికి సపోర్ట్ చేసిన మా హీరోలకు, దర్శకులకు కృతజ్ఞతలు' అని తెలిపారు. పోటీ నివారించడానికి రంగంలోకి దిగిన పెద్దలు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబు మాట్లాడుతూ 'రెండు భారీ చిత్రాలు ఒకేసారి విడుదలకు సిద్ధమైనప్పుడు వాటి మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండటం పరిశ్రమకు చాలా మంచిది. సంక్రాంతి సీజన్‌ను మినహాయిస్తే మిగిలిన అన్ని సందర్భాల్లోనూ ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చేయడం వల్ల పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది' అన్నారు.

'దాగుడు మూతలు' తర్వాత 'సీటీ మార్'...



అల్లు అర్జున్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'దువ్వాడ జగన్నాథమ్' సినిమా ఎంత హిట్టో... అందులోని 'సీటీ మార్.. సీటీ మార్... సీటీ మార్' పాట కూడా అంతే హిట్! థియేటర్లలో మాస్ ప్రేక్షకుల చేత స్టెప్పులు వేయించిన ఆ పాటలోని పదాలు 'సీటీ మార్' టైటిల్‌గా హరీశ్ శంకర్ దర్శకత్వంలో ఒక చిత్రం రానుంది. ఇటీవల 'జవాన్' చిత్రాన్ని నిర్మించిన అరుణాచల్ క్రియేషన్స్ అధినేత కొమ్మలపాటి కృష్ణ ఈ చిత్రానికి నిర్మాత. ఇందులో వరుస విజయాల్లో ఉన్న అగ్ర కథానాయకుడు నటించనున్నారట! అయితే... ఈ చిత్రం కంటే ముందు హరీశ్ శంకర్ 'దాగుడు మూతలు' చేస్తారు. 'దువ్వాడ జగన్నాథమ్' తర్వాత ఆయన చేయనున్న చిత్రమిదే. ప్రస్తుతం 'దాగుడు మూతలు' చిత్రపనుల్లో నిమగ్నమైన హరీశ్ ఆ తర్వాత 'సీటీ మార్' వివరాలు ప్రకటించనున్నారు.

వంశధార క్రియేషన్స్ చిత్రం షురూ


నవీన్ శొంఠినేని, బెల్లంకొండ శ్రీనివాస్, వినాయక్

బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా శ్రీనివాస్ దర్శకత్వంలో వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని (నాని) నిర్మిస్తోన్న చిత్రం ప్రారంభోత్సవం గురువారం ఉదయం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి గుజరాల ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు, దర్శకుడు శ్రీవాస్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్‌నిచ్చారు. తెలంగాణ ఎఫ్.డి.సి. ఛైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మహేందర్ రెడ్డి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. నిర్మాత మాట్లాడుతూ "మా సంస్థ నుంచి వస్తోన్న తొలి సినిమా ఇది. వైవిధ్యంగా ఉంటుంది" అని అన్నారు. హీరో మాట్లాడుతూ "నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఇన్నాళ్లకు కుదిరింది. తెలుగు సినిమా పరిశ్రమలో ఇలాంటి కథను ఇప్పటిదాకా ఎవరూ చూడలేదు. చోటాగారితో 'అల్లుడు శీను' తర్వాత ఈ సినిమాకు పనిచేయడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "రొమాంటిక్ థ్రిల్లర్ ఇది. మార్చి 2 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతంది. ఇద్దరు నాయికలుంటారు" అని చెప్పారు. సినిమా పెద్ద విజయం సాధించాలని యరపతినేని శ్రీనివాసరావు అభిలషించారు. మంచి ఔట్‌పుట్ ఇవ్వడానికి కష్టపడతామని కెమెరామేన్ చోటా.కె.నాయుడు అన్నారు. ఈ చిత్రానికి మాటలు: కేశవ్ పప్పల, ఎడిటర్: ఛోటా.కె.ప్రసాద్, ఆర్ట్: చిన్నా, సంగీతం: తమన్.ఎస్, ఫైట్స్: స్టన్ శివ, వెంకట్, సహ నిర్మాత : చాగంటి శాంతయ్య.

ఇక మొహమాటాల్లేవ్!

\- శ్రీకాంత్



"ఇకపై మోహమాటం కోసం సినిమాలను అంగీకరించను. స్క్రిప్ట్ పక్కాగా నచ్చితేనే సినిమాలు చేస్తాను. విలన్‌గా నటించమని చాలా మంది అడిగారు. కానీ ఇప్పటికిప్పుడే ఆ దారిలో పోదలచుకోలేదు" అని అన్నారు హీరో శ్రీకాంత్. ఆయన నటించిన 'రారా' సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దానికి సంబంధించి శ్రీకాంత్ మాట్లాడుతూ "దెయ్యాలకు, మనుషులకు మధ్య జరిగే కథ ' రా రా'. ఆద్యంతం కొత్తగా ఉంటుంది. హారర్ జోనర్‌లో సాగుతుంది. గ్రాఫిక్స్ కూడా ఉంటాయి. ఈ చిత్ర దర్శకుడికీ, నిర్మాతకు మధ్య భేదాభిప్రాయాలు రావడంతో, మరో పేరున్న దర్శకుడు చిత్రాన్ని పూర్తి చేశారు. ముందున్న దర్శకుడికి, నిర్మాతలకు మధ్య సయోధ్య కుదుర్చుదామని ప్రయత్నించాను. కానీ వీలుపడలేదు. పరిశ్రమకు నిర్మాతల అవసరం చాలా ఉంది. పైగా శ్రీమిత్ర చౌదరి, విజయ్ నాకు స్నేహితులు. చిత్రాన్ని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించారు" అని అన్నారు. కుటుంబం గురించి మాట్లాడుతూ "మా పెద్దబ్బాయి రోషన్‌కి 'నిర్మలా కాన్వెంట్' తర్వాత నటన మీద ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో యాక్టింగ్‌లో డిప్లమో చేస్తున్నాడు. ఇంకో అబ్బాయి రోహన్ కూడా ప్రస్తుతం త్రిభాషా చిత్రం చేస్తున్నాడు. అందులో ప్రభుదేవా కీలక పాత్రధారి. అమ్మాయి నేషనల్ లెవల్స్ బాస్కెట్ బాల్‌కి ఎంపికైంది. ఊహకి ప్రస్తుతం సినిమాల మీద ఆసక్తి లేదు" అని చెప్పారు.

దానికి.. వయసుతో పనేంటి?

\- తమన్నా



"కొన్ని పనులు చేయడానికి మనసులో కోరిక ఉంటే చాలు. వయసుతో పనేంటి?" అని అంటున్నారు తమన్నా. ఈ మిల్కీ బ్యూటీకి దక్షిణాదిన ప్రస్తుతం చేతినిండా సినిమాలున్నాయి. ఈ మధ్య విక్రమ్‌తో కలిసి ఆమె నటించిన చిత్రం 'స్కెచ్'. ఈ సినిమా పోస్టర్స్‌లో, ఫొటోల్లో ఆమె చీరకట్టుతో కనిపిస్తున్నారు. చీరకట్టు గురించి ఆమె మాట్లాడుతూ "చీర కట్టుకోవడానికి వయసుతో పని ఉండదు. కట్టుకోవాలనే కోరిక మాత్రం ఉంటే సరిపోతుంది. నా 16 ఏట నుంచి నేను చీరకట్టుకుంటున్నాను. ఇప్పటికీ ప్రత్యేక సందర్భాల కోసం చీరలనే ఎంపిక చేసుకుంటున్నాను. మహిళలకు చీర చూడముచ్చటగా ఉంటుంది. చీరకట్టును ఆస్వాదించగలిగితే సౌకర్యవంతంగానూ ఉంటుంది. వయసు మీద పడ్డవారే శారీలు కట్టుకుంటారని ఎవరైనా అనుకుంటే వాళ్లు భ్రమల్లో ఉన్నట్టే" అని చెప్పారు తమన్నా.

అడ్వెంచరస్ ట్రెక్కింగ్...


నేహ, శివ తాండేల్

శివ తాండేల్, నేహా దేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'వాడేనా'. సాయి సునీల్ నిమ్మల దర్శకుడు. మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మాతలు. కిరణ్ వెన్న సంగీతం అందించిన పాటల్ని బుధవారం ప్రసాద్స్ ప్రివ్యూ థియేటర్‌లో పాటల్ని విడుదల చేశారు. ఎన్.శంకర్ ఆడియో సీడీలను, రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్ ను ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ "అడ్వెంచర్, ట్రెక్కింగ్ నేపథ్యంలో సాగే కథ ఇది. సెకెండ్ హాఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇందులో నాలుగు పాటలు రాసి కొరియోగ్రఫీ కూడా చేశా. నాకు నచ్చిన కొందరు దర్శకులు, టెక్నీషియన్ల స్ఫూర్తితో దర్శకుడిగా మారాను. అవుట్‌పుట్ చూశాక మంచి సినిమా తీశాననే నమ్మకం కలిగింది" అని అన్నారు. నిర్మాత ధృవ్ మాట్లాడుతూ.. "కిరణ్ వెన్న చక్కనిపాటలు అందించారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా క్వాలిటీగా సినిమా తీశాం" అని అన్నారు.

ప్రేమకథతో...


ప్రియాంక శర్మ

అవంతిక ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తున్న 'కార్తీక' చిత్రం టీజర్‌ను ఇటీవల దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. మచేందర్ నట్టాల నిర్మిస్తున్న ఈ చిత్రంలో విజయభాస్కరరెడ్డి, ప్రియాంక శర్మ, సింధు హీరోహీరోయిన్లు. కొత్త పరశురామ్ దర్శకుడు. సినిమా బాగా వచ్చిందనీ, త్వరలోనే ఆడియోను విడుదల చేస్తామనీ నిర్మాత చెప్పారు. 'ఈ సినిమాలో చిన్న పిల్ల పాత్ర ప్రధానంగా ఉంటుంది. బేబి వెన్నెల ఆ పాత్ర చేసింది. ప్రేమ ప్రధానాంశంగా రూపుదిద్దుకొన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. మా అందరికీ మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాం' అని దర్శకుడు చెప్పారు.

సుధీర్‌బాబు 'సమ్మోహనం'


అదితీరావు, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు, అదితీరావు హైదరీ జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'సమ్మోహనం' టైటిల్ ఖరారు చేశారు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తోన్న సినిమా ఇది. గురువారం సాయంత్రం చిత్ర యూనిట్ టైటిల్‌ను ప్రకటించింది. దర్శకుడు మాట్లాడుతూ 'సమ్మోహనం అంటే మంత్రముగ్ధుల్ని చేసే ఒక అందమైన ఆకర్షణ. మ్యాజికల్ ఎట్రాక్షన్. ఇందులో హీరోహీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. నవతరం ప్రేమకథతోపాటు ఆద్యంతం హాస్యం, కుటుంబ బంధాలు, ఉద్వేగభరిత సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది" అని అన్నారు.

ఆంధ్రజ్యోతి
బిజినెస్
11
విజయవాడ • శుక్రవారం 23 ఫిబ్రవరి 2018

ఒకే రోజు 91 వేల మంది ప్రయాణం

బెంగళూరు ఎయిర్‌పోర్టు సరికొత్త రికార్డు

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త రికార్డు నమోదు చేసింది. ఫిబ్రవరి 19న సోమవారం ఏకంగా 91,339 మంది ఇక్కడ నుంచి ప్రయాణించారు. ఆ రోజున 628 విమానాలు టేకాఫ్, లాండింగ్ అయ్యాయి. 2017 డిసెంబర్ 23వ తేదీన 87,815 ప్రయాణికులతో రికార్డు ఉండగా అది అధిగమించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. 2008లో ఎయిర్‌పోర్టు ప్రారంభం కాగా ఏటా ప్రయాణికుల వృద్ధి రేటు పెరుగుతోందన్నారు. దేశంలోనే అత్యధిక ప్రయాణికులు ఉపయోగించుకొనే 3వ అంతర్జాతీయ విమానాశ్రయం బెంగళూరే అన్నారు. అంతర్జాతీయ మార్గంలో బ్రహెయిన్, ఆమ్‌స్టర్‌డామ్‌లకు కొత్తగా విమాన సర్వీసులో ప్రారంభమైనట్టు చెప్పారు.

andhrajyothibusiness@gmail.com

అన్నీ పక్కాగా ఉంటేనే ఎంఒయులు



సిద్ధమవుతున్న ప్రధాన వేదిక

డిపిఆర్ స్కానింగ్ చేశాకే.. రూ.3 కోట్లు దాటిన ప్రాజెక్టులకే గ్రీన్ సిగ్నల్

గత రెండు విడతల్లో ఒప్పందం చేసుకొని అడ్రస్ లేని సంస్థలు 306

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

విశాఖపట్నంలో శనివారం నుంచి జరిగే పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం, భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) భారీ ఏర్పాట్లుచేశాయి. గణాంకాల్లో గొప్పల కోసం పోకుండా పక్కాగా ప్రాజెక్టును నెలకొల్పుతారని విశ్వాసం కలిగిన పార్టీలతోనే సంప్రదింపులు జరిపి ఎంఒయూలకు రంగం సిద్ధం చేస్తున్నారు. గత రెండు సదస్సుల ద్వారా వచ్చిన అనుభవాలను దృష్టిలో వుంచుకొని ఈసారి అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)తో ముందుకు వచ్చిన వారి ప్రతిపాదనలనే స్వీకరించారు. వాటిని స్కానింగ్ చేసి, ఆ కంపెనీకి నిజంగానే ఆసక్తి, చిత్తశుద్ధి వున్నాయని విశ్వాసం కుదిరితేనే వాటిని ఎంఒయూ వరకు తీసుకువెళుతున్నారు. ఈ విధంగా ఇప్పటివరకు 400 ప్రాజెక్టులను సిద్ధం చేశారు. వీటికి ఎంఒయూలు చేసుకుంటే రూ.4 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని అంచనా. ఈసారి సదస్సులో ప్రాజెక్ట్ కనీస విలువ రూ.3 కోట్లుగా తీసుకున్నారు. గతంలో రూ.10 లక్షలు దాటిన వాటిని స్వీకరించి ఒప్పందాలు చేసుకున్నారు. కొందరు కేవలం పబ్లిసిటీ కోసం ఎంఒయూలు చేసుకున్నారు. అటువంటి వారిలో 306 మంది ఇప్పటివరకు కనీసం వారి ప్రాజెక్టు సమగ్ర నివేదికల(డిపిఆర్‌లు)ను కూడా సమర్పించలేదు. వారిని కలిసి ఆ ప్రాజెక్టు విషయం ఏమైందో తెలుసుకుందామని ప్రభుత్వం ఏర్పాటుచేసిన లైజనింగ్ అధికారులు ప్రయత్నిస్తే... వారి అడ్రస్ కూడా లేకుండా పోయింది. ఈసారి అటువంటి లోపాలు లేకుండా రాష్ట్ర పరిశ్రమల శాఖ జాగ్రత్తలు చేపట్టింది. రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటుచేయడానికి ముందుకువచ్చిన ప్రతి ఔత్సాహిక పారిశ్రామికవేత్త నుంచి ముందుగానే డిపిఆర్‌లు సేకరించారు. వాటి వయబులిటి, నిధులు, భూమి, ఇతర సాంకేతిక అంశాలను సంబంధిత శాఖలన్నీ పరిశీలించిన తరువాతే పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు వివిధ సదస్సుల ద్వారా 1,946 ప్రాజెక్టులకు ఒప్పందాలు చేసుకుంది. వీటి ద్వారా రూ.13.54 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, 31,97,232 మందికి ఉపాధి లభించాల్సి ఉంది.

2016 సదస్సు ద్వారా 290 ఒప్పందాలు జరగ్గా, రూ.3.44 లక్షల కోట్లు పెట్టుబడులుగా వస్తాయని, 3.03 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. 2017 సదస్సులో 586 ఒప్పందాలు చేసుకోగా, వాటి ద్వారా రూ.6.09 లక్షల కోట్ల పెట్టుబడులు, 13.87 లక్షల ఉద్యోగాలు వస్తాయని లెక్కలు వేశారు. మొత్తం ఒప్పందాల్లో 408 పరిశ్రమలు ఏర్పాటుకు కావలసి ఉండగా, వాటిలో 163 సంస్థలు రూ.36,780 కోట్లతో గ్రౌండింగ్ అయ్యాయి. అందులో 92,784 మందికి ఉపాధి లభించింది. ఇంకా మరో 33 పరిశ్రమలు రూ.1.42 లక్షల కోట్లతో ప్రారంభానికి సిద్ధంగా వుండగా, వాటి ద్వారా 1,30,819 మందికి ఉపాధి లభించనుంది.

తొలిరోజే కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

సదస్సు ప్రారంభం రోజునే ఆసియాలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి విశాఖలో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. లులూ గ్రూపు 13 ఎకరాల విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్‌తో పాటు షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, ఎగ్జిబిషన్ సెంటర్ వంటివి నిర్మిస్తుంది. సుమారుగా రూ.1,500 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ నిర్మాణం విశాఖకు మరిన్ని పెట్టుబడులు రావడానికి దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది.



సీఎం మీటింగ్ హాలు

ఒకరోజు ముందుగానే ఉప రాష్ట్రపతి

భాగస్వామ్య సదస్సులో పాల్గొనడానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఒక రోజు ముందుగానే (శుక్రవారం) విశాఖపట్నం వస్తున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్‌ప్రభు సదస్సు జరిగే మూడు రోజులు ఇక్కడే ఉంటారు.

పదేళ్లలో లైఫ్‌సైన్సెస్ పరిశ్రమ రూ.6.5 లక్షల కోట్లు

బయోఏషియా సదస్సులో కెటిఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలోని లైఫ్‌సైన్సెస్ ఏకోసిస్టమ్‌ను వచ్చే పదేళ్ల కాలంలో 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.6.5 లక్షల కోట్లు)కు పెంచాలన్న లక్ష్యంతో ఉన్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ 5,000 కోట్ల డాలర్లుగా ఉందని, 800కు పైగా కంపెనీలు ఈ రంగంలో పని చేస్తున్నాయని చెప్పారు. లైఫ్‌సైన్సెస్ ఇన్నోవేషన్, మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలపరంగా తెలంగాణ నాయకత్వ స్థాయి మరింత బలపడుతోందని, ఈ స్థాయిని మరింత పటిష్ఠ పరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. దేశ ఫార్మాసుటికల్ ఉత్పత్తిలో రాష్ట్ర వాటా 35 శాతం దాటిందని, దేశ వ్యాక్సిన్ కేంద్రంగా రాష్ట్రానికి గుర్తింపు లభించిందని చెప్పారు. ఇందులో హైదరాబాద్ శివారులోని జినోమ్ వ్యాలీ పాత్ర కీలకంగా ఉందన్నారు. ఆసియాలోని అతిపెద్ద లైఫ్‌సైన్సెస్ క్లస్టర్లలో జినోమ్ వ్యాలీ ఒకటని, దీన్ని నాయకత్వ స్థాయిని మరింతగా బలోపేతం చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జినోమ్ వ్యాలీని విస్తరించనున్నామని (జినోమ్ వ్యాలీ 2.0), ఈ క్లస్టర్‌కు సంబంధించిన సమీకృత మాస్టర్ ప్లాన్‌ను రూపకల్పనను తక్షణమే ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో మూడు రోజుల పాటు జరిగే 15వ విడత బయోఏషియా సదస్సు గురువారం ప్రారంభమైంది. ఇందులో పాల్గొన్న సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు ఉండటం, క్లస్టర్ విధానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత కారణంగా దేశ, విదేశాల్లోని లైఫ్‌సైన్సెస్ కంపెనీలను రాష్ట్రం ఆకర్షిస్తోందన్నారు. జినోమ్ వ్యాలీతోపాటు ప్రతిపాదిత ఫార్మా సిటీ, మెడికల్ డివైజెస్ పార్క్‌ల ద్వారా ప్రపంచ లైఫ్‌సైన్సెస్ కంపెనీలకు పూర్తి స్థాయి ఏకోసిస్టమ్ కలిగిన గమ్యస్థానంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. హైదరాబాద్ ఈ స్థాయిలో నిలిచేందుకు బయోఏషియా ఎంతగానో దోహదపడిందన్నారు.

రాష్ట్రంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే చర్యల్లో భాగంగా జినోమ్ వ్యాలీకి ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) హోదాను కట్టబెట్టామని, ఫలితంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు వేగవంతంగా లభించే అవకాశం ఏర్పడుతోందని చెప్పారు. జినోమ్ వ్యాలీలో ఇప్పటికే రెండు వందలకు పైగా కంపెనీలున్నాయని, వీటిలో పది వేల వరకు శాస్త్ర సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారని తెలిపారు. నోవార్టీస్, జిఎస్‌కె, సనోఫీ, డ్యూపాంట్ వంటి విదేశీ కంపెనీలతో పాటు అనేక దేశీయ కంపెనీలు కూడా ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. జినోమ్ వ్యాలీలో దేశంలోనే అతిపెద్ద యానిమల్ రీసోర్సెస్ కేంద్రాన్ని త్వరగా ఏర్పాటు చేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామన్నారు. దీని వల్ల లైఫ్ సైన్సెస్ కంపెనీలకు అత్యధిక ప్రయోజనం ఉంటుందని, నూతన ఔషధాలను వేగవంతంగా మార్కెట్ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు.



2018 సంవత్సరానికి గాను జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డును ప్రొఫెసర్ మైఖేల్‌కు అందజేస్తున్న కెటిఆర్

నోయిడాలో పల్సస్ గ్రూప్ సెంటర్

హైదరాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో 1000 సీట్ల సామర్థ్యం కలిగిన గ్లోబల్ సైంటిఫిక్ లిటరేచర్ లాంగ్వేజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన పల్సస్ గ్రూప్ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో హిందీలో ఉన్న గ్లోబల్ సైంటిఫిక్, ఆరోగ్య సమాచారాన్ని ఇతర ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేయటంతో పాటు నైపుణ్యాల శిక్షణపై ఈ సెంటర్ దృష్టి సారించనుందని పల్సస్ గ్రూప్ తెలిపింది. ప్రస్తుతం సైంటిఫిక్, హెల్త్‌కేర్ సమాచారాన్ని ఇంగ్లీష్ నుంచి హిందీ, తెలుగు, మళయాళం, తమిళ్, గుజరాతీ, బెంగాలీ భాషల్లోకి తర్జుమా చేయటంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపింది.

యూరప్‌కు ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ హవా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : భారత్‌లో తయారైన రిటైల్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను యూరప్‌కు ఎగుమతి చేయటంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయని సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫ్రైట్ ఫార్వార్డింగ్ సర్వీసెస్ సంస్థ డామ్కో వెల్లడించింది. 2017 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుంచి యూరప్‌కు ప్రధానంగా ఫుట్‌వేర్ ఎగుమతులు జరిగాయని తెలిపింది. కాగా గుజరాత్ నుంచి హోమ్ బెడ్డింగ్, బాత్ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ నుంచి జర్మనీకి తమిళనాడు నుంచి నెదర్లాండ్స్‌కు అధికంగా ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయని తెలిపింది.

ఎంతిస్తావ్.. ఎలా ఇస్తావ్?

నీరవ్ మోదీకి పిఎన్‌బి లేఖ



న్యూఢిల్లీ : సొమ్ము రికవరీకి అవకాశాలు లేకుండా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) తానే అన్ని మార్గాలను మూసేస్తోందంటూ 11, 400 కోట్ల రూపాయల భారీ స్కామ్ సూత్రధారి, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ చేసిన ఆరోపణలపై బ్యాంకు స్పందించింది. బకాయిపడిన మొత్తాన్ని బ్యాంకుకు తిరిగి ఎలా చెల్లిస్తారో స్పష్టమైన ప్రణాళికను వెల్లడించాలని నీరవ్ మోదీకి సూచించింది. కొంతమంది బ్యాంకు అధికారుల సహాయంతో మీరు అనధికారికంగా, మోసపూరితంగా ఎల్ఒయులను పొందారు. ఏ దశలోనూ మా బ్యాంకు మీకు చెందిన మూడు భాగస్వామ్య సంస్థలకు ఎల్ఒయులను తీసుకునే వెసులుబాటు అధికారికంగా కల్పించలేదు. బ్యాంకుకు జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తాననీ, సొమ్ము చెల్లిస్తానని లేఖ రాశారు. అయితే సొమ్ము ఏ విధంగా చెల్లిస్తారో స్పష్టమైన ప్రణాళికను మాత్రం వెల్లడించలేదు. మీ దగ్గర అటువంటి ప్రణాళిక ఉంటే వెంటనే తెలియజేయండి అని నీరవ్‌కు పంపిన ఒక ఇ-మెయిల్‌లో బ్యాంకు పేర్కొంది. పిఎన్‌బి ఇంటర్నల్ బ్యాంకిం గ్ డివిజన్ జిఎం అశ్వనీ వత్స్ ఈ లేఖను పంపారు. రెండు రోజుల క్రితం నీరవ్ మోదీ ఈ స్కామ్ విషయంలో సొమ్ము చెల్లించేందుకు తాను సిద్ధమేనని అయితే బ్యాంకు చేసిన రచ్చ వల్ల తన వ్యాపారం, బ్రాండ్ ఇమేజ్ సర్వనాశనం అయ్యాయని పేర్కొంటూ ఒక ఇ-మెయిల్ పంపారు. బ్యాంకు అత్యుత్సాహంతో వందల కోట్ల రూపాయల విలువైన తన ఆస్తులను సిబిఐ, ఇడి జప్తు చేసిందని పేర్కొన్నారు. తాను బకాయిలను చెల్లించలేని స్థితి బ్యాంకు కల్పించిందని ఆరోపించారు. ఈ లేఖకు స్పందనగా ఇప్పుడు బ్యాంకు ఇ-మెయిల్ పంపింది.

బ్యాంకు లేఖకు అర్థం ఏమిటో...

పిఎన్‌బి అత్యుత్సాహం, మీడియా రెచ్చిపోయి రాసిన రాతలతో తన వ్యాపారం కుప్పకూలిందనీ, బకాయిలు చెల్లించేందుకు ముందుకు వచ్చినా బ్యాంకు తన ఆఫర్‌ను పట్టించుకోకుండా రచ్చరచ్చ చేసిందని నీరవ్ మోదీ ఆరోపణ. తాజా పరిణామాల తర్వాత తాను చేతులెత్తేసినట్టేనని నీరవ్ మోదీ బ్యాంకుకు తేల్చిచెప్పారు కూడా. అయినప్పటికీ సొమ్ము ఎలా తెస్తారో స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలని సూచిస్తూ పిఎన్‌బి నీరవ్‌కు లేఖ రాయడం విస్మయం కలిగిస్తోందని పరిశీలకులు అంటున్నారు.

దిద్దుబాటు చర్యల్లో పిఎన్‌బి

నీరవ్ మోదీ స్కామ్ తర్వాత గ్లోబల్ పేమెంట్స్ నెట్‌వర్క్ స్విఫ్ట్ నిర్వహణకు సంబంధించిన విధానాల్లో పిఎన్‌బి మార్పులు చేపట్టింది. కోర్ బ్యాంకింగ్‌తో నిమిత్తం లేకుండా ఇద్దరు జూనియర్ స్థాయి అధికారులు యథేచ్ఛగా ఎల్ఒయులు జారీ చేసి బ్యాంకుకు 11,400 కోట్ల రూపాయల నష్టం తెచ్చిన విషయం తెలిసిందే. ఇకపై స్విఫ్ట్ మెసెజ్‌లను కనీసం ముగ్గురు అధికారులు ధృవీకరించాల్సి ఉంటుంది. ఈ మేరకు పిఎన్‌బి యాజమాన్యం అన్ని ప్రాంతీయ కార్యాలయాలకు నోటీసులు పంపినట్టు తెలిసింది.

దుకాణాలకు తాళం.. వీధిన పడిన ఉద్యోగులు

దేశవ్యాప్తంగా ఉన్న గీతాంజలి జెమ్స్, నీరవ్ మోదీ స్టోర్స్ మూతబడ్డాయి. రెండు సంస్థల ఉద్యోగులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు. అత్యంత సంపన్నులు మాత్రమే సందర్శించే నీరవ్ మోదీ స్టోర్స్ గత వారం రోజులుగా వెలవెలబోతున్నాయి. ముంబైలోని నీరవ్ మోదీ ప్రధాన ఔట్‌లెట్ కాలాఘోడాలో ఉంది. అక్కడ ఇద్దరు ముగ్గురు చౌకిదార్లు తప్ప మరో వ్యక్తి కనిపించడం లేదు. బెంగళూరులోని లావెలె రోడ్‌లో ఉన్న స్టోర్ పరిస్థితి కూడా అంతే. గీతాంజలి స్టోర్స్ విషయంలో అయితే ఫ్రాంఛైజీ సంస్థల యజమానులు లబోదిబోమంటున్నారు. ఈ స్కామ్ బయటకు రాక ముందు నుంచే గీతాంజలి అధినేత చోక్సీతో ఫ్రాంఛైజీ సంస్థలకు గొడవలు మొదలయ్యాయి. డబ్బులు మింగి సరుకు సప్లయ్ చేయకుండా తమతో చెలగాటమాడుతున్నారని చోక్సీపై వారు ఆరోపణలు చేస్తున్నారు. ఈ గొడవలకు తోడుగా ఇప్పుడు ఇడి దాడులను, సిబిఐ దర్యాప్తును కూడా వారు ఎదుర్కోవాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 100 గీతాంజలి ఫ్రాంఛైజీలు ఉండగా వారంతా రెండు మూడేళ్లుగా చోక్సీతో గొడవల కారణంగా వ్యాపారాన్ని నిలిపివేశారు. దాదాపు 10-12 మంది కేసులు కూడా పెట్టారు. నిజానికి గత కొన్నేళ్లలో కంపెనీ తన సొంత ఔట్‌లెట్లను చాలామటుకు మూసేసినట్టుగా చెబుతున్నారు. పిఎన్‌బి స్కామ్‌తో గీతాంజలి, నీరవ్ మోదీ సంస్థల ఉద్యోగులు రోడ్డునపడ్డారు. హైదరాబాద్‌లోని గీతాంజలి జెమ్స్ సెజ్‌లో పనిచేస్తున్న దాదాపు 550 మంది కూడా ఉపాధి కోల్పోయారు.

ఈక్విరస్ క్యాపిటల్‌లో ఫెడరల్ బ్యాంక్‌కు 26 శాతం వాటా

ముంబై : ప్రైవేట్ రంగంలోని ఫెడరల్ బ్యాంక్.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లోకి అడుగుపెట్టింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ అయిన ఈక్విరస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇసిపిఎల్)లో 26 శాతం వాటాలను చేజిక్కించుకోవటం ద్వారా ఫెడరల్ బ్యాంక్ ఈ విభాగంలోకి ప్రవేశించింది. ఈక్విరస్‌లో వాటా కొనుగోలుతో డెట్, ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్, స్ట్రక్చర్డ్ ఫైనాన్స్, క్యాపిటల్ మార్కెట్ ప్రొడక్ట్స్, అడ్వైజరీకి సంబంధించి సమగ్రమైన ఫైనాన్షియల్ సొల్యూషన్స్‌ను అందించే అవకాశం లభించనుందని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. దీంతోపాటు హెచ్ఎన్ఐ, ఎన్ఆర్ఐల కోసం వెల్త్ మేనేజ్‌మెంట్ సేవలతో పాటు ఈక్విరస్ భాగస్వామ్యంతో పలు ఉత్పత్తులను ఆఫర్ చేయవచ్చని పేర్కొంది. హోల్‌సేల్, రిటైల్ కస్టమర్ల కోసం సర్వీసులను విస్తరించాలన్న లక్ష్యంతో ఈక్విరస్‌లో వాటాను కొనుగోలు చేసినట్లు ఫెడరల్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేష్ శంకరన్ తెలిపారు. ఫెడరల్ బ్యాంక్ భాగస్వామ్యంతో మరింత మంది క్లయింట్లకు సేవలను అందించటంతో పాటు వ్యాపారాన్ని మరింత వృద్ధిపథంలోకి తీసుకువెళ్లే అవకాశం లభించనుందని ఈక్విరస్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ గార్గ్ అన్నారు.

ఆర్ఇన్‌ఫ్రాకు రూ.3,647 కోట్ల కాంట్రాక్టు

న్యూఢిల్లీ : తమిళనాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (టాన్‌జెడ్‌కో) నుంచి 3,647 కోట్ల రూపాయల కాంట్రాక్టును గెలుచుకున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్ఇన్‌ఫ్రా) వెల్లడించింది. ఉప్పూర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఈ ఇపిసి ఆర్డర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిపింది. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఉప్పూర్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు సూపర్ క్రిటికల్ బొగ్గు ఆధారిత ప్లాంట్‌కు సంబంధించి బ్యాలెన్స్ ఆఫ్ ప్యాకేజ్, సంబంధిత సివిల్ పనులను చేపట్టాల్సి ఉంటుందని ఆర్ఇన్‌ఫ్రా తెలిపింది.

భారత ఐటికి స్టార్టప్స్ దన్ను

కొత్త టెక్నాలజీతో మరిన్ని అవకాశాలు

ఎన్ఐఐటి చైర్మన్ రాజేంద్ర ఎస్ పవార్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగం రూపు రేఖలు మారిపోతున్నాయి. కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ వంటి కొత్త టెక్నాలజీలు ఈ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఐటి సదస్సులో ఈ మార్పులపైనే ప్రధానంగా చర్చలు జరిగాయి. భారత ఐటి రంగంపై ఈ మార్పుల ప్రభావంపై ఈ సదస్సుకు హాజరైన ఐటి కోర్సుల శిక్షణా సంస్థ ఎన్ఐఐటి చైర్మన్ రాజేంద్ర ఎస్ పవార్ 'ఆంధ్రజ్యోతి' బిజినెస్‌'తో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆ వివరాలు...

భారత ఐటి రంగ భవిష్యత్ ?

భారత ఐటి రంగం అభివృద్ధికి ఎలాంటి ఢోకా లేదు. ప్రస్తుతం వృద్ధి రేటు తగ్గినా అది తాత్కాలికమే. కొత్త టెక్నాలజీల ప్రవేశంతో ఈ రంగంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్పులను సానుకూలంగానే చూడాలి. దీంతో మన ఐటి కంపెనీలకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. ఇదివరకు దీర్ఘకాలిక ప్రాతిపదికన పెద్ద పెద్ద ప్రాజెక్టులు లభించేవి. ముందుముందు దీర్ఘకాలిక ప్రాజెక్టులకు బదులు స్వల్పకాలిక ప్రాజెక్టులే ఎక్కువగా లభిస్తాయి. మన ఐటి కంపెనీలు ఈ మార్పులకు తగ్గట్టు సన్నద్ధం కావాలి. ముఖ్యంగా క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేలా సిద్ధం కావాలి.

ఎలాంటి మార్పులు రావాలి?

ముఖ్యంగా మూడు విషయాల్లో మార్పులు రావాలి. కొత్త టెక్నాలజీలపై ఉద్యోగుల నైపుణ్యాలు పెంచేందుకు కంపెనీలు చర్యలు తీసుకోవాలి. గతంలోలా దీర్ఘకాలిక ప్రాజెక్టులకు బదులు క్లయింట్ల అవసరాలకు అనుగుణంగా స్వల్పకాలంలోనే అనేక ప్రాజెక్టులు పూర్తి చేసేలా వ్యూహాలు సిద్ధం చేసుకోవాలి. కీలక స్థానాల్లో వ్యూహాత్మకంగా ఆలోచించే నిపుణులను నియమించుకోవాలి.



ఐటి ఉద్యోగాలపై కొత్త టెక్నాలజీల ప్రభావం ?

అందరూ అనుకుంటున్నట్టు ఈ టెక్నాలజీలతో ఉద్యోగాలు పోతాయనేది వట్టిమాట. కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులకు కొత్త టెక్నాలజీలపై పెద్దఎత్తున శిక్షణ ఇస్తున్నాయి. అయినా తాత్కాలికంగా కొన్ని ఆటుపోట్లు చోటు చేసుకుంటాయి. అవన్నీ త్వరలోనే సర్దుకుంటాయి. కాకపోతే ఉద్యోగాల కల్పన వృద్ధి రేటు గతంలో ఉన్నంత వేగంగా ఉండదు.

స్టార్టప్స్ పాత్ర ?

స్పష్టంగా చెప్పాలంటే స్టార్టప్స్ భారత ఐటి రంగానికి దన్నుగా నిలుస్తాయి. ఈ సంస్థలు అందించే వినూత్న టెక్నాలజీలు, సొల్యూషన్స్ భారత ఐటి కంపెనీల సత్తాను మరింత పెంచుతాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో మన ఐటి కంపెనీలకు మరిన్ని అవకాశాలు ఏర్పడతాయి.

కొత్త టెక్నాలజీలపై సరైన శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నాయా?

పూర్తిస్థాయిలో శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు ప్రధాన నగరాలన్నిటిలోనూ అనేక సంస్థలు ఈ టెక్నాలజీలపై శిక్షణా కోర్సులు నిర్వహిస్తున్నాయి. కాకపోతే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో మాత్రం ఇంకా ఈ సదుపాయాలు అంతగా అందుబాటులోకి రాలేదు. ఆ నగరాలు, పట్టణాల్లోని విద్యార్థులు కూడా ఆన్‌లైన్ ద్వారా కొత్త టెక్నాలజీలపై శిక్షణ పొందవచ్చు.

7 నెలల్లో రూ.42 కోట్ల పన్ను రికవరీ

అమరావతి (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు బిల్లులు ఇవ్వకుండా పన్ను ఎగవేతలకు పాల్పడుతున్న వ్యాపారులను పట్టుకునేందుకు వాణిజ్యపన్నుల శాఖ ప్రారంభించిన డెకాయ్ ఆపరేషన్స్ సత్ఫలితాలిస్తున్నాయి. ఈ ఆపరేషన్స్ ప్రారంభించిన మొదట్లో ఇబ్బడిముబ్బడిగా నమోదైన కేసులు నెలలు గడిచే కొద్ది తగ్గుముఖం పట్టాయని అధికారులు పేర్కొన్నారు. డెకాయ్ ఆపరేషన్స్ పట్ల వ్యాపారుల్లో భయం నెలకొందని తెలిపారు. గడచిన 7 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6,689 కేసులు డెకాయ్ ఆపరేషన్స్ ద్వారా నమోదు చేశామని చెప్పారు. ఈ కేసుల ద్వారా దాదాపు రూ. 8.61 కోట్లు పన్ను రికవరీ అయినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డెకాయ్ బృందాలు కస్టమర్లకు బిల్లులు ఇవ్వకపోవడం, ఇచ్చిన బిల్లులు పన్నుల వివరాలు లేకపోవడం, ఇన్‌వాయిస్‌లు లేకపోవడం, వాటిలో తప్పుడు వివరాలు పొందుపరచడం, వే బిల్లులు, ఇన్‌వాయిస్‌లు లేకుండా తరలిస్తున్న గూడ్స్‌ను పట్టుకుని పన్ను రికవరీ చేస్తుంది. రూ.200 దాటిన ప్రతి కొనుగోలుకు వ్యాపారులు బిల్లులు ఇవ్వాలి. వాటిపై పన్ను వివరాలతో పాటు జిఎస్‌టిఎన్ నెంబర్‌ను కూడా పొందుపరచాలి. చాలా మంది వ్యాపారులు ఇవేవీ పాటించడం లేదని డెకాయ్ ఆపరేషన్స్‌లో వెల్లడైంది. సరైన బిల్లులు లేకుండా గూడ్స్‌ను తరలిస్తున్న వాహనాల నుంచి రూ. 33.19 కోట్లు పన్ను వసూలు చేసినట్లు అధికారులు చెప్పారు. ఒక్కో జిల్లాలో పన్ను ఎగవేత కేసులు సగటున 500 పైగా నమోదైనట్లు పేర్కొన్నారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చినప్పటి నుంచి వ్యాపారుల తమ రిటర్న్లను జిఎస్‌టి మండలికి సమర్పిస్తున్నారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన జూలై నెల నుంచి నవంబర్ వరకు డేటాను కేంద్రం ఇటీవలే రాష్ట్రాలకు ఇచ్చింది. ఆ డేటాను వాణిజ్య శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు.

సర్కారు టెలికాం కంపెనీల విలీనం ఉండదు

న్యూఢిల్లీ : ప్రభుత్వం రంగంలోని టెలికాం సంస్థలు బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌ను విలీనం చేసే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతానికి లేదని టెలికమ్యూనికేషన్స్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా స్పష్టం చేశారు. అయితే ఈ రెండు సంస్థల కార్యకలాపాల మధ్య మేళవింపును సాధించి ఉభయతారకంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదన మాత్రం ఉందని ఆయన చెప్పారు. టెలికామ్ శాఖ ఆధ్వర్యంలోని వివిధ సంస్థల మధ్య సమన్వయం, కార్యకలాపాల్లో మేళవింపు కోసం వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ నియంత్రణలోని సంస్థల మధ్య సమన్వయాన్ని సాధిస్తే భూములు, భవనాలు, సిబ్బందిని గరిష్ఠ స్థాయిలో ఉపయోగించుకునే వీలుంటుందని ఆయన చెప్పారు. టెలికామ్ రెగ్యులేటరీ సంస్థ ట్రాయ్ చర్యలపై ప్రైవేట్ టెలికామ్ సంస్థ నుంచి ఎదురవుతున్న నిరసన గురించి ప్రస్తావిస్తూ, ట్రాయ్ వ్యవహారాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కారు ధర రూ. 9.50 కోట్లు



మార్కెట్‌లో రోల్స్‌రాయిస్ ఎనిమిదో తరం ఫాంటమ్

చెన్నై: లగ్జరీ కార్ల తయారీ సంస్థ రోల్స్ రాయిస్ ఎనిమిదో తరం ఫాంటమ్ కారును మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు ధర 9.50 కోట్ల రూపాయలు. దీనికి 6.75 లీటర్ ట్విన్ టర్బోచార్జ్‌డ్ వి12 ఇంజన్ అమర్చారు. ఈ ఇంజన్ 563 హార్స్‌పవర్ శక్తిని, 900 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది. 5.4 సెకండ్లలోనే జీరో నుంచి వంద కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఈ కొత్త సిరీస్ కారు ఇప్పటివరకు మార్కెట్లో ఉన్న ఫాంటమ్‌లతో పోల్చితే 30 శాతం తక్కువ బరువు కలిగి ఉంది. రాత్రివేళల్లో కారు హెడ్‌లైట్లు 600 మీటర్ల వరకు కాంతిని విస్తరించడం వల్ల భద్రతాపరంగా మరింత సమర్థవంతంగా ఉంటుంది. స్టాండర్డ్ వీల్‌బేస్ ఉన్న కారు ధరను 9.50 కోట్ల రూపాయలుగాను, పెద్ద వీల్‌బేస్ ఉన్న కారు ధర 11.35 కోట్ల రూపాయలుగాను ప్రకటించింది. నాలుగు సంవత్సరాల సర్వీసు ప్యాకేజీ, రీజినల్ వారెంటీ కూడా ఈ ధరలో ఇమిడి ఉన్నాయి.

ఈ ఏడాది మరో ఐదు మోడల్స్

భారత్‌లో తమ ఉత్పత్తుల శ్రేణిని విస్తరించే ప్రణాళికల్లో భాగంగా ఈ కారును విడుదల చేసినట్టు రోల్స్ రాయిస్ ఆసియా పసిఫిక్ రీజినల్ డైరెక్టర్ పాల్ హారిస్ ప్రకటించారు. మరో లగ్జరీ కారు కలినన్ ఈ ఏడాది ద్వితీయార్థంలో మార్కెట్‌లోకి తీసుకువస్తామని, బ్లాక్‌బాడ్జ్‌తో పాటు ఏడాదిలో మరో ఐదు మోడళ్లు మార్కెట్లోకి వస్తాయని ఆయన చెప్పారు. వాటిలో ఫాంట్, ఘోస్ట్ పెద్ద వీల్ బేస్ కార్లు, రెత్, డాన్ ఉన్నాయని ఆయన చెప్పారు.

దక్షిణాదిలో పెరుగుతున్న ఆదరణ

చెన్నై, హైదరాబాద్‌లలో తమ అధీకృత డీలర్‌గా కున్ ఎక్స్‌క్లూజివ్‌ను నియమించినట్టు ఆయన చెప్పారు. దక్షిణాదిలో విలాసవంతమైన కార్లకు ఆదరణ పెరుగుతున్నదని, భారత ఆటోమొబైల్ మార్కెట్ పరంగా చూసినా చెన్నై ప్రధానమైన ఆటోమొబైల్ హబ్ అని చెబుతూ అందుకే ఈ కారును చెన్నైలో విడుదల చేశామని ఆయన అన్నారు. దక్షిణాదిలో ప్రస్తుతం తమకు ఐదు ఔట్‌లెట్లున్నాయని ఆయన చెప్పారు. 214 శాతం దిగుమతి సుంకం, జీఎస్‌టి కారణంగా కారు ధర అధికంగా ఉన్నదని పాల్ అన్నారు. తక్కువ సమయంలోనే ఎక్కువ మార్పులు చేశారని ఇది ఏ మాత్రం మంచిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆటోమోటివ్ పరిశ్రమ గత ఏడాది ఎలాంటి నిలకడ లేకుండా ఎగుడుదిగుడులుగా పయనించిందని, డీమానిటైజేషన్, జీఎస్‌టి ప్రభావం అధికంగా పడిందని ఆయన చెప్పారు.

బిడిఎల్, ఇరెడా ఇష్యూలకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ : మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ప్రభుత్వ రంగంలోని భారత్ డైనమిక్స్, ఇరెడా పబ్లిక్ ఇష్యూలకు అనుమతి మంజూరు చేసింది. ఈ రెండు కంపెనీలు డిసెంబరు, జనవరి నెలల్లో ఇష్యూలకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేశాయి. ఇష్యూలో భాగంగా భారత్ డైనమిక్స్ సంస్థలో ఈక్విటీ వాటాలను ప్రభుత్వం విక్రయిస్తుంది. దాని వల్ల స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయ్యే అవకాశం కంపెనీకి కలుగుతుంది. 1970లో ఏర్పాటైన ఈ సంస్థ రక్షణ రంగానికి అవసరమైన గైడెడ్ క్షిపణులు, అనుబంధ ఉత్పత్తులను బిడిఎల్ తయారుచేస్తుంది. 2017 చివరి నాటికి కంపెనీ నికర విలువ 2,212.46 కోట్ల రూపాయలుంది. ఎస్‌బిఐ క్యాపిటల్ మార్కెట్స్, ఐడిబిఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, యస్ సెక్యూరిటీస్ ఇష్యూను నిర్వహిస్తాయి.

పునర్ వినియోగ ఇంధన వనరుల రంగంలోని ఇరెడా ఇష్యూలో భాగంగా 13.90 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తుంది. వాటిలో 6.95 లక్షల ఈక్విటీ షేర్లను అర్హులైన ఉద్యోగుల కోసం కేటాయించారు. కంపెనీ మూలధనం పెంపునకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు ఇష్యూ ద్వారా సేకరించే నిధులు ఉపయోగించుకోనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ లిస్టింగ్‌తో కంపెనీ పెయిడప్ షేర్ క్యాపిటల్ 784 కోట్ల రూపాయల నుంచి 923 కోట్ల రూపాయలకు పెరుగుతుంది.

వెన్నాడిన ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్ల భయాలు

▸▸ మళ్లీ నష్టాల్లోకి జారుకున్న మార్కెట్

ముంబై : ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలహీనపడి మూడు నెలల కనిష్ఠ స్థాయికి దిగజారడం, ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం తీర్మానాల ద్వారా వెలువడిన ద్రవ్యోల్బణం ముప్పు సంకేతాలతో పాటు అమెరికాలో వడ్డీ రేట్లు పెరగవచ్చునన్న భయాలు, విదేశీ మార్కెట్ల బలహీనత గురువారం దేశీయ మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి. ఫిబ్రవరి కాంట్రాక్టుల్లో సెన్సెక్స్ 2230.94 పాయింట్లు, నిఫ్టీ 686.95 పాయింట్లు దిగజారాయి. స్వల్ప సమయం పాటు ఇండెక్స్‌లు కాస్తంత పాజిటివ్‌గా మారినట్టు కనిపించినా ఆ లాభం నిలబడలేదు. సెన్సెక్స్ 25.36 పాయింట్లు నష్టంతో 33819.50 పాయింట్లు, నిఫ్టీ 14.75 పాయింట్ల నష్టంతో 10382.70 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి.

- 2.19 శాతం దిగజారి నష్టపోయిన షేర్లలో డాక్టర్ రెడ్డీస్ అగ్రస్థానంలో నిలిచింది. ఓఎన్‌జిసి, పవర్‌గ్రిడ్, టాటా మోటార్స్, మారుతి సుజుకీ, ఎస్‌బిఐ, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, బజాజ్ ఆటో, ఎన్‌టిపిసి ఏషియన్ పెయింట్స్, భారతి ఎయిర్‌టెల్, ఆర్ఐఎల్, టిసిఎస్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి.
- సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్, కోటక్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా, యస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టి, కోల్ ఇండియా లాభపడ్డాయి.
- ఎక్స్ఛేంజీల వద్ద గణాంకాల ప్రకారం బుధవారం నాడు ఎఫ్‌పిఐలు 1,214.18 కోట్ల రూపాయల విలువ గల షేర్లు విక్రయించగా దేశీయ సంస్థలు 1,375.48 కోట్ల రూపాయల విలువ గల షేర్లు కొనుగోలు చేశాయి.

28 పైసలు నష్టపోయిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరో పెద్ద క్షీణతను నమోదు చేసింది. డాలర్ మారకంలో 28 పైసలు దిగజారి 65.04 వద్ద ముగిసింది. నవంబరు 20 తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. ఇంట్రాడేలో రూపాయి 34 పైసల వరకు నష్టపోయి 65.11 వరకు కూడా దిగజారింది.



ఏడు రోజుల్లో గీతాంజలి 58 శాతం డౌన్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెలువడిన నాటి నుంచి ఆ బ్యాంకుతో పాటు గీతాంజలి జెమ్స్ రెండు షేర్లలోనూ పతనం కొనసాగుతూనే ఉంది. గీతాంజలి షేరు వరుసగా ఏడో రోజు కూడా ఒత్తిడిని ఎదుర్కొని 4.92 శాతం నష్టపోయి 26.10 రూపాయల వద్ద ముగిసింది. ఈ షేరు వరుసగా ఏడు సెషన్లలో 58.5 శాతం నష్టపోయింది. భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా పిఎన్‌బి షేరు మరో రెండు శాతం దిగజారింది. బిఎస్‌ఇలో 2.09 శాతం క్షీణతతో 114.65 రూపాయల వద్ద, ఎన్‌ఎస్‌ఇలో 2.30 శాతం నష్టంతో 114.60 రూపాయల వద్ద క్లోజయింది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,450	---	31,470	31,300	30,540
క్రితం ముగింపు	31,480	---	31,470	30,250	30,580
22 క్యారెట్లు	29,120	---	28,750	28,980	29,090
క్రితం ముగింపు	29,150	---	28,950	28,980	29,120
వెండి (కిలో)	39,600	---	39,600	39,500	41,400
క్రితం ముగింపు	39,400	---	39,400	39,400	41,300

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	75.00	విజయవాడ	79.00
కరీంనగర్	76.00	గుంటూరు	79.00
వరంగల్	77.00	ఒంగోలు	81.00
మహబూబ్‌నగర్	75.00	చిత్తూరు	72.00
కర్నూలు	75.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	80.00	అనంతపురం	75.00
గోదావరి	78.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	363.00	నమక్కల్	380.00
గోదావరి	363.00	బెంగళూరు	395.00
విశాఖపట్నం	365.00	ముంబై	400.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.20	68.64
పౌండ్	82.32	95.47
యూరో	72.67	84.29
ఆస్ట్రేలియా డాలర్	46.14	53.40
బహ్రెయిన్ దినార్	160.31	183.71
కువైట్ దినార్	179.54	223.51
ఒమని రియాల్	156.99	179.60
సౌదీ రియాల్	15.74	18.66
సింగపూర్ డాలర్	44.68	52.92
యుఏఇ దిరమ్	16.11	18.83

10430 పైన మైనర్ అప్‌ట్రెండ్

టెక్ వ్యూ

నిఫ్టీ మరింత బలహీనతలో ప్రారంభమై 10350 వద్ద రికవరీ సాధించింది. తదుపరి నిలకడగా కదులుతూ చివరికి 15 పాయింట్ల నష్టంతో ముగిసినా డే గరిష్ఠ స్థాయిలో ముగియడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత కొద్ది రోజులుగా 10350 వద్ద బాటమ్ ఏర్పడింది. ఇక్కడ మద్దతు కనిపిస్తున్నా బలమైన కదలిక లేదు. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఆ కదలిక అవసరం. స్వల్పకాలిక ఓవర్ సోల్డ్ స్థితి కూడా కనిపిస్తున్నందు వల్ల రికవరీకి ఆస్కారం ఉంది.

శుక్రవారం స్థాయిలివే...

నిరోధం : 10430 **మద్దతు :** 10300

- మరింత అప్‌ట్రెండ్ కోసం 10430 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు, టార్గెట్లు 10500, 10700.
- 10300 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ మరోసారి కీలక స్థాయి 25000 కన్నా దిగువన ముగిసింది. ఆ పైన మాత్రమే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది.

■ వి.సుందర్ రాజా

ప్రారంభ సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ శుద్ధ అష్టమి **నక్షత్రం :** కృత్తిక, రోహిణి

ఆర్ద్ర, స్వాతి, శతభిషం, పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, మిథున, తుల రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10382.70 (-14.75)

ట్రెండ్ మార్పు వేళలు : 12.41; 1.40

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 9.30 నుంచి 12.45 వరకు మెరుగ్గా ట్రేడవుతూ తదుపరి 3.15 వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్ లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.30 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10425, 10460

మద్దతు స్థాయిలు : 10340, 10305

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in

మహారాష్ట్రలో ఐకియా రూ.3,000 కోట్ల పెట్టుబడులు

▸▸ రెండు నెలల్లో హైదరాబాద్ స్టోర్ ప్రారంభం



ముంబై: స్వీడిష్ ఫర్నీచర్ దిగ్గజం ఐకియా.. మహారాష్ట్రలో 3,000 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. మల్టీ ఫార్మాట్ స్టోర్లతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల కోసం దీర్ఘకాలం పాటు ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు ఐకియా డిప్యూటీ కంట్రీ మేనేజర్ పాట్రిక్ ఆంటోనీ వెల్లడించారు. ఐకియాకు మహారాష్ట్ర కీలకంగా ఉండనుందని, ఇక్కడ వ్యాపారాభివృద్ధి కోసం పూర్తి స్థాయిలో నిధులను కేటాయించనున్నట్లు ఆయన చెప్పారు. త్వరలోనే ముంబైలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా 2025 నాటికి 10,500 కోట్ల రూపాయల పెట్టుబడితో దేశవ్యాప్తంగా 25 స్టోర్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆంటోనీ పేర్కొన్నారు. కాగా పుణెలో తొలి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కోసం వచ్చే రెండు మూడేళ్లలో 750 కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌లో తొలి స్టోర్‌ను హైదరాబాద్‌లో త్వరలో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ స్టోర్‌ను ప్రారంభించాలని భావించామని, అయితే కార్మికుల రక్షణ, నిర్మాణంలో నాణ్యత వంటి అంశాల కారణంగా జాప్యం ఏర్పడిందని, ఏదిఏమైనా రానున్న కొద్ది నెలల్లో ఈ స్టోర్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ప్రోయుగ నుంచి వర్చువల్ రియాల్టీ క్రికెట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రోయుగ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన వర్చువల్ రియాల్టీ క్రికెట్ స్పోర్ట్ (విస్పోర్ట్).. ఐబి క్రికెట్‌ను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ లాంఛనంగా విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రపంచవ్యాప్తంగా ఐబి క్రికెట్ అందుబాటులోకి రానుందని సంస్థ సిఇఒ త్రివిక్రమ్ రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా 25 వేల ఫ్రాంఛైజీలను ప్రారంభించటం ద్వారా లక్ష మంది సభ్యులకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మేకిన్ ఇండియా, స్టాండప్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా ప్రోయుగ ను అభివృద్ధి చేసినట్లు ఆయన చెప్పారు.

బజాజ్ ఆటో అవెంజర్ స్ట్రీట్ 180

ధర రూ.83,171

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : బజాజ్ ఆటో మార్కెట్లోకి 180 సిసి అవెంజర్ స్ట్రీట్‌ను విడుదల చేసింది. అవెంజర్ స్ట్రీట్ 150 స్థానంలో సరికొత్త 180 సిసి సామర్థ్యంతో దీన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది. ఈ బైక్ ధర 83,171 రూపాయలు (తెలంగాణ ఎక్స్‌షోరూమ్), 84,755 రూపాయలు (ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌షోరూమ్). క్లాసిక్ బైక్ విభాగంలో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునే ఉద్దేశంతో మరింత పవర్‌ఫుల్ ఇంజన్, సరికొత్త ఫీచర్లతో అవెంజర్ స్ట్రీట్ 180ని రూపొందించినట్లు తెలిపింది. ఎబోనీ బ్లాక్, స్పైసీ రెడ్ రంగుల్లో ఈ బైక్‌ను తీసుకువచ్చినట్లు బజాజ్ ఆటో వెల్లడించింది.



వోల్వో నుంచి వి60 వెర్సటైల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : వోల్వో కార్స్.. మార్కెట్లోకి వి60 వెర్సటైల్ ఫ్యామిలీ ఎస్టేట్‌ను తీసుకువచ్చింది. ఫైవ్ డోర్, మిడ్ సైజ్ ప్రీమియం ఎస్టేట్, సరికొత్త డిజైన్ వి60 ప్రత్యేకతలని వోల్వో తెలిపింది. టు ప్లగ్ ఇన్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ ఆప్షన్లతో వి60ని తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఇందులో టి6 ట్విన్ ఇంజన్ ఎడబ్ల్యుడి పెట్రోల్ ప్లగ్ ఇన్ హైబ్రిడ్ కారు 340 హెచ్‌పి సామర్థ్యాన్ని కలిగి ఉండగా టి8 ట్విన్ ఇంజన్ ఎడబ్ల్యుడి పెట్రోల్ ప్లగ్ఇన్ హైబ్రిడ్ కారు 390 హెచ్‌పి సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపింది. డి3, డి4 ఇంజన్లతో డీజిల్ వేరియంట్‌ను కూడా తీసుకువచ్చినట్లు వోల్వో వెల్లడించింది.



ఆధార్‌తో మొబైల్ నెంబర్ అనుసంధానం మార్చి 31 వరకే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : వినియోగదారులు తమ మొబైల్ నెంబర్లను మార్చి 31 నాటికి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) తెలిపింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఇప్పటికే మొబైల్ నెంబర్ అనుసంధాన ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొంది. వినియోగదారులు సమీపంలోని సిఎస్‌సి, ఫ్రాంఛైజీ, రిటైలర్ వద్ద ఈ ఆధార్ అనుసంధాన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. అలాగే ఐవిఆర్‌ఎస్ నంబరు 14546కు డయల్ చేసి కూడా వినియోగదారులు తమ మొబైల్ నెంబరును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవచ్చని బిఎస్ఎన్ఎల్ వెల్లడించింది.

ఆఫ్రికా దేశాల పారామెడికల్ సిబ్బందికి అపోలో శిక్షణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆఫ్రికాలోని తొమ్మిది దేశాలకు చెందిన పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వెల్లడించింది. అపోలో హాస్పిటల్స్ ఇప్పటికే ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్‌ల్లోని హాస్పిటల్స్‌లో 24 ఆఫ్రికా దేశాలకు చెందిన 100 మంది డాక్టర్లకు శిక్షణనిచ్చింది. ఆఫ్రికా మానవ వనరులను మరింత పటిష్ఠం చేసే ఉద్దేశంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆఫ్రికన్ ప్రభుత్వాలు, అపోలో హాస్పిటల్స్ ఈ కార్యక్రమాలను చేపడుతున్నాయి. తొలి విడతలో ఆఫ్రికా దేశాలైన కెన్యా, మలావి, నైజీరియా, సావో టోమ్, సీషెల్స్, సూడాన్, దక్షిణ సూడాన్ దేశాలకు చెందిన 25 మంది పారామెడికల్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ప్రెసిడెంట్ కె హరిప్రసాద్ తెలిపారు.

భారత మహిళా పారిశ్రామికవేత్తలకు అంతర్జాతీయ అవార్డులు

▸▸ ఒక్కొక్కరికి రూ.19.5 లక్షల నగదు పురస్కారం



లండన్ : అవసరాలే వ్యాపార ఆలోచనలకు పునాది. అనేక మందిని వేదిస్తున్న మధుమేహం, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న సాధారణ శానిటరీ నాప్‌కిన్స్‌కు సరైన ప్రత్యామ్నాయ ఉత్పత్తులు తయారు చేస్తూ ఇద్దరు భారత ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్నారు. స్టీవియా అనే మొక్క ద్వారా పంచదారకు ప్రత్యామ్నాయంగా సహజ సిద్ధమైన తీపి పదార్థాలు తయారు చేస్తున్న అర్బోరియల్ ఆగ్రో ఇన్నోవేషన్స్ అధినేత స్వాతి పాండే, అరటి నారతో శానిటరీ నాప్‌కిన్స్ తయారు చేస్తున్న సాతి ఇంక్ అధినేత క్రిస్టిన్ కాజెస్టుకు కార్టియర్ ఉమెన్ ఇనిషియేటివ్ అవార్డులు లభించాయి. ఈ అవార్డుల కింద వీరిరువురికి ఒక్కొక్కరికి 30,000 డాలర్లు (సుమారు రూ.19.5 లక్షలు) లభిస్తాయి. 130 దేశాల నుంచి వచ్చిన 2,800 అప్లికేషన్లను పరిశీలించి వీరితో పాటు మొత్తం 18 మందికి ఈ అవార్డులకు ఎంపిక చేశారు. వీరందరికీ ఈ సంవత్సరం ఏప్రిల్‌లో సింగపూర్‌లో వారం రోజుల పాటు వ్యాపార మెలుకువలపై ప్రత్యేక వర్క్‌షాపులు, శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఏప్రిల్ 26న అక్కడ జరిగే ఒక కార్యక్రమంలో విజేతగా నిలిచిన ఒకరికి లక్ష డాలర్లు (సుమారు రూ.65 లక్షలు) లభిస్తాయి.

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ADITYA SPIN. 8(8.2)80
AGRO TECH FO 631.35(617.65)1230
AISHWARYA TE 6.36(6.37)831
ALPHAGEO (I) 808.4(816.2)1320
ALU FLUORIDE 108.35(108.3)5198
AMAR RAJA BA 797.05(797.2)24167
ANDHRA BANK 45.55(45.8)170565
ANDHRA CEMEN 10.92(10.97)18271
ANDHRA PETRO 56.95(57.8)26007
ANJANI PORTL 191.8(190.05)197
ASTRA MICRO 90.45(89.9)421518
AUROB.PHARMA 587.15(570.8)642154
AVANTEL LTD 523.35(537.35)3908
AVANTI FEEDS 2310.25(2336)14404
B.N.RATHI SE 40.5(40.05)926
BALAJI AMINE 651.45(653.4)3145
BAMBINO AGRO 235.75(242.95)1888
BARTRONICSIN 12.93(12.87)3330
BHAGIRA.CHEM 293(293.15)15
BHAGYA INL 41.8(42.75)6905
BHARATFIN 977.65(972.2)19950
BNR UDYOG 32(32.4)807
CAMBRIDGE 72.4(73.85)2569
CCHHL 13.75(14.15)9728
CCL PRODUCTS 278.45(281.25)1253
CELESTIAL 17.55(17.9)4411
CIL SECURITS 29.55(29.85)1689
COROM INTER 519(508.2)2447
CUBEX TUBING 24.5(23.35)1330
CYBERMATE 3.28(3.25)6042
CYIENT 623.95(630.15)59535
DANLAW TECH. 68.25(65.35)31149
DECAN CEMENT 567.55(564.35)40
DECCAN POLYP 3(3)20
DHAN ROTO SP 55.9(53.55)13434
DIAMONPOWER 13.65(13.65)28873
DIVI'S LAB. 1018.25(1008.5)19696
DIVYA.GRANIT 105(100.4)64
DQ ENT 14.8(14.7)4440
DR.REDDY'S 2121.3(2168.8)47331
EMPEE SUGARS 4.01(4.13)1092
EVEREST ORG. 136(140.65)221
FACOR ALLOYS 3.21(3.17)102728
FIRSTOBJ 13.75(13.85)3612
GATI LTD. 112(113.3)42477
GAYATRI BIO 9(9)1271
GAYATRI PROJ 213.3(214.6)5877
GENNEX LAB 4.47(4.26)147706
GMR INFRASTR 17.6(17.35)2123750
GODAVARI DRU 35.05(36.75)517
GOLDST INFRA 194.8(198.55)8973
GOLDSTONE EN 13.65(13.85)925
GRANULES (I) 113.15(114.7)101997
GVK POWERINF 16.75(16.75)2078663
HBL P SYS 55.25(55.65)28088
HERITGFOOD 678.6(679.25)506
HIND.FLUROCA 14(14)500
I.C.S.A. IND 3.34(3.51)26069
IKF TECHNO .69(.72)163170
INCAP LTD. 88.05(92)1582
IPAPPM 311.05(312.25)4773
IVRCL LTD 4.51(4.59)80306
KAKATIYA CEM 290.35(290.1)1192
KAKATIYA TEX 2.5(2.63)200
KALLAM SPG. 30.35(30.8)86664
KAVERI SEED 460.25(468.35)19403
KCP LTD 128.1(127.3)9679
KERNEX MICRO 43.5(42.1)4377
KNR CONST 294.25(297.75)155256
KREBS BIOCHM 155(153.65)655
LANCO INFRA 1.26(1.2)952244
LOKESH MACH 68.1(65.05)19485
LOTUS CHOC 50.1(50.95)4130
MADHUCON PRJ 27.6(27.6)8919
MOLD-TEK TEC 59.5(61.65)821
MOSCHIP SEMI 33.6(33.15)25247
MSR INDIA 46(45.7)14366
N C L IND. 230.2(232.15)6857
NACLIND 42.7(43.1)12714
NATCO PHARM 766.85(776.9)24803
NCC 122.7(123.4)169330
NEHA INTER. 7.45(7.7)13240
NETTLINX LTD 84.5(82.8)14708
NEULAND LAB. 698(703.25)567
NIHAR INFO 15.35(14.8)574
NILE LTD. 828.05(822.95)1418
NTL 3.91(3.99)24805
OIL COUNTRY 42.7(43.35)562
PADMALAYA TE 4.98(4.95)11920
PALRED 92.95(95.05)1885
PANYAM CEMEN 48(48.15)13465
PENNAR STEEL 58.5(59.25)61986
PFL INFOTECH 9.24(9.72)1696
PHYTOCHEM I. 63.7(65.6)1505
PITTI LAMIN. 90.5(91.1)13367
POKARNA LTD 208.95(210.7)1482
PRAJAY ENGS. 13.5(12.9)59530
PREMIER EXPL 390.8(390.55)1561
PRISM CEMENT 124.9(124.65)62628
RAIN 372.1(383.6)409253
RAJ PACKAGIN 37.75(38.2)10512
RAJVIR IND 48.5(45)500
REG.CERAMIC 5.96(5.92)3478
RESTILE CER. 7(7)4469
SAGAR CEM. 957.45(961.15)318
SAMKRG PIST. 293.1(300)5285
SAMPRE NUTRI 51.4(53.3)2917
SANGHI IND. 111.95(112.4)42704
SATVAH.ISPAT 22.1(21.15)23167
SAVEN TECHNO 19.75(19.9)52
SMPL 1.38(1.37)11350
SMS PHARMACE 89.3(89.75)5444
SREE RAYALA 162.8(170.65)2614
STEEL EXCH 28.15(29.6)56088
SUJANA INDUS .9(.94)87942
SURANATP 5.15(5.17)10005
SURYACHAKRA 1.14(1.2)142403
SURYAVA SPIN 6.01(6.1)161
SURYLAK.COTT 80.2(80.5)3510
SUVEN LIFE S 189.4(190.45)59877
TAJ GVK HOTL 165(164)7106
TANLA 30.4(30.6)37707
TRANSCORP IN 34.25(34.7)1795
TRANSGENE BI 2.36(2.28)11301
TRANSPORT CO 286.3(286.55)53479
USHER AGRO 6.67(6.42)5340
VICEROY HOTE 15.6(15.6)16224
VIJAY TEXTIL 55.65(53)8026
VIMTA LABS 207(205.9)3628
VIRAT CRANE 51.65(50)5835
VIRINCHI 116.25(117.45)45787
VISAKA IND. 679(677.15)7269
VISTA PHARMA 42.6(41.5)7330
VIVIMED LABS 76(78.05)83510
VST INDUS. 3300.15(3199.6)121
WATERBASE 308.4(310.5)174064
XLENERGY 2.94(3)3663
YBRANTDIGI 5.35(5.43)147791
ZEN TECH 117.35(118.05)12026
ZENOTECH 45(44.3)5559



వీఆర్ఏలకు డీఏ రూ.100 నుంచి రూ.300కు పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుని, ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ఏపీ వీఆర్ఏల సంఘం నేతలు కె. గోపాలరావు, సుధాకర్ చౌదరి తదితరులు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం.

ఐవైఆర్ నియామక జీవో రద్దు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):అర్చకులు, ఇతర ధార్మిక ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్టు ఛైర్మన్ నియామక ఉత్తర్వును ప్రభుత్వం రద్దుచేసింది. ఈ ట్రస్టుకు ఛైర్మన్‌గా ఐవైఆర్ కృష్ణారావును నియమిస్తూ 2016 జనవరిలో జీవో 39 జారీచేసింది. మూడేళ్లపాటు ఆయన ఛైర్మన్‌గా కొనసాగుతారని అందులో పేర్కొంది. అయితే గతేడాది వివాదాల నేపథ్యంలో ఐవైఆర్‌ను బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్‌తో పాటు ట్రస్టు ఛైర్మన్ పదవి నుంచి కూడా తొలగించింది. కాగా సాంకేతిక కారణాలతో ఆయన నియామక ఉత్తర్వునే రద్దు చేస్తూ గురువారం ఆదేశాలు జారీచేసింది.

ఎన్జీటీలో ఇసుక కేసు 14కు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి రేలా స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను జాతీయ హరిత ధర్మాసనం(ఎన్జీటీ)మార్చి14కు వాయిదా వేసింది. జస్టిస్ రఘువేంద్ర ఎస్ రాథోడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం దీనిపై విచారణ చేపట్టింది. పూడికతీత పేరుతో చేపడుతున్న ఇసుక తవ్వకాలు అమ్మకానికి వాడుతున్నారా?లేక ప్రభుత్వ పనులకు వినియోగిస్తున్నారా తెలియజేస్తూ అఫిడవిట్ సమర్పించాలని ఎన్జీటీ గతంలో ఆదేశాలిచ్చిందనీ, అయితే ఏపీ గనుల శాఖ ఇచ్చిన అఫిడవిట్ సమగ్రంగా లేదని పిటిషనర్ తరపు న్యాయవాది శ్రావణ్‌కుమార్ ధర్మాసనానికి తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై సీఎస్‌లకు నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను జాతీయ మానవ హక్కుల సంఘం ఆదేశించింది. ఆత్మహత్యలను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నారో నాలుగు వారాల్లో చెప్పాలని ఎన్‌హెచ్ఆర్సీ పదిరోజుల క్రితం నోటీసులు జారీ చేసింది. యాజమాన్య ఒత్తిళ్లతోనే చాలావరకు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గత ఏడాది డిసెంబరు 29న ఢిల్లీకి చెందిన న్యాయవాది శ్రావణ్‌కుమార్ జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు.

వైభవంగా కోటి తలంబ్రాల కలశ పూజ



కలశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 22: తూర్పు గోదావరిజిల్లా కోరుకొండలోని శ్రీ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో కోటి తలంబ్రాలకు కలశ పూజను గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కోరుకొండలోని దుర్గాదేవి ఆలయంలో తలంబ్రాల బియ్యానికి శ్రీ సీతారామ అష్టోత్తర శతనామార్చన పూజ నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించినట్లు శ్రీ కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షులు కల్యాణం అప్పారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి వితరణ



తిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు మలేషియాకు చెందిన ప్రవాస భారతీయుడు కేవిన్ సుగుమారన్ రూ.కోటి వితరణ చేశారు. విరాళానికి సంబంధించిన చెక్కును గురువారం టీటీడీ జేఈవో శ్రీనివాసరాజుకు అందజేశారు.

బరువు తగ్గేందుకు మందు తాగి..

రాజాంరూరల్,(శ్రీకాకుళం) ఫిబ్రవరి 22: శరీరం బరువు తగ్గించుకునేందుకు సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మందు వాడితే ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక సారధి రోడ్డులో ఉంటున్న బీన రాంబాబు (42) యూట్యూబ్‌లో బరువు తగ్గించే వైద్య ప్రకటన చూసి వారంరోజుల నుంచి 75 మిల్లీలీటర్ల చొప్పున రోజూ మూడు పూటలా కొబ్బరి నూనె తాగేవాడు. అది వికటించి గురువారం కన్నుమూసినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు.



కియ ప్రధాన భవన నిర్మాణానికి ఉపయోగించనున్న బీమ్‌పై సంతకాలు చేసి దాని ముందు నిలుచున్న సీఎం చంద్రబాబు, కియ ప్రెసిడెంట్ పార్క్, మంత్రులు

ప్రపంచంతోనే మాకు పోటీ!

ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా దూసుకెళుతున్న నవ్యాంధ్ర

- సులభతర వ్యాపారంలో ఏపీ టాప్
- 'ఉద్యోగిత' అర్హతలో మనమే ముందు
- రాటుదేలిన 10 లక్షల యువత చేతిలో..
- కియ వరసలో మరిన్ని దిగ్గజ కంపెనీలు
- రూ.వెయ్యికోట్లతో అనంతకు 'మౌలిక' రూపు
- కియ ఫ్రేమింగ్ కార్యక్రమంలో చంద్రబాబు

(అనంతపురం కియ ప్లాంటు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

"వ్యవసాయాధారిత ఆంధ్ర ప్రదేశ్‌ను పారిశ్రామికంగా ప్రపంచంతో పోటీపడేలా చేయడమే నా లక్ష్యం. 2022 నాటికి దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీ ఎదగాలి. అతి త్వరలోనే ప్రపంచదేశాల్లో మన రాష్ట్రం మేటిగా నిలవాలి. దానికోసం ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమలు, ఉద్యానవనాలు, ఎలక్ట్రానిక్స్, ఎక్స్‌పోర్ట్స్ రంగాల్లో ముందంజలో ఉంచుతాం. ఏ రంగంలోనైనా ఏపీ హబ్‌గా నిలిచేలా చేస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని చెప్పారు. అనంతపురం జిల్లాలో కియ కార్ల ఉత్పత్తి సంస్థ చేపట్టిన ఫ్రేమింగ్ కార్యక్రమాన్ని ఆ సంస్థ ఛైర్మన్ పార్క్‌తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కియ కార్ల తయారీ పరిశ్రమకు తమ స్థలాలను ఇచ్చిన యాజమాన్యాలకు, రాష్ట్రాభివృద్ధి కోసం భూములిచ్చిన రైతులకు ఈ సందర్భంగా చంద్రబాబు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "అనంతపురం ఎడారి అవుతుందేమోనని ఆందోళన ఉండేది. పరిశ్రమలు రావని భయాలు ఉండేవి. ఈ నాలుగేళ్లలో దాన్ని గత చరిత్రగా మార్చేశాం. హంద్రీ నీవా జలాలు బొల్లాపల్లి దగ్గరకు వచ్చాయి. ఇప్పుడు అనంతపురానికి ఎంతో భవిష్యత్తు ఉంది. దక్షిణ కొరియాలోని అతిపురాతన కార్ల కంపెనీ అనంతపురానికి వచ్చింది. దక్షిణ కొరియా టౌన్‌షిప్ వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కియకు 14 ప్లాంట్లు .. 5 దేశాల్లో అసెంబ్లింగ్ యూనిట్లు ఉన్నాయి. అనంతపురం ప్లాంటులో ఏటా 3 లక్షల కార్లు తయారు చేస్తాం. త్వరలోనే ఇదే ప్రపంచంలోని అతి పెద్ద కియ ప్లాంట్ అవుతుంది. స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి దొరుకుతుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్లాంటుకు ఎన్నో ప్రత్యేకతలున్నాయన్నారు. "కియ ప్లాంటును ఆనుకునే బెంగళూరు .. హైదరాబాద్ జాతీయ రహదారి ఉంది. బెంగళూరు - చెన్నై, విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ వస్తున్నాయి. అత్యంత ప్రఖ్యాత కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేసే వీలుంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతి, కృష్ణపట్నంతో అనుసంధానం అయితే దేశంలో కియ మార్కెట్‌కు తిరుగే ఉండదు." అని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను రప్పించడంలో కియ ఛైర్మన్ పార్క్ బ్రాండ్ ప్రమోటర్‌గా మారారని అభినందించారు. " బూసాన్‌లో మా మొదటి సమావేశంలోనే రాష్ట్రంలో ప్లాంటు పెట్టాలని ఆయనను కోరాను. రాష్ట్రం సహకరిస్తే ప్లాంటు పెట్టడమేకాదు, తాను బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతానని పార్క్ హామీ ఇచ్చారు. ఆ విధంగానే మాట నిలబెట్టుకుంటున్నారు. దక్షిణకొరియా పారిశ్రామిక దిగ్గజ సంస్థలను రాష్ట్రానికి రప్పించేలా కృషి చేస్తున్నారు" అని వివరించారు. తాను కియ ప్లాంటుకు వచ్చినప్పుడు, కొరియన్ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుందా, ఆంధ్ర ప్రదేశ్ సర్కారు బాగా పనిచేస్తుందా అని పార్క్‌ను ప్రశ్నించగా, కొరియన్ ప్రభుత్వం కంటే మీరే చాలా సమర్థవంతంగా పనిచేస్తున్నారని పార్క్ చెప్పారని చంద్రబాబు తెలిపారు.

కియ ప్లాంటు ఏపీలో ఏర్పాటు చేయించడంలో రాష్ట్ర అధికారుల పాత్ర అత్యంత కీలకమైనదని, ప్రధానంగా పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్ వల్లే ఈ పరిశ్రమ వచ్చిందని అభినందించారు. ప్లాంటు పెడతానని హామీ ఇచ్చాక గాని పార్క్‌ను సాల్మన్ వదల్లేదని, అదీ రాష్ట్ర అధికారుల చిత్తశుద్ధి అని వివరించారు.

భూములు సిద్ధంగా ఉన్నాయి

"కొరియా టౌన్ షిప్‌ను అనంతపురంలో ఏర్పాటుచేయండి. దీనికోసం అమ్మవారిపల్లి, గుడిపల్లిలలో 382 ఎకరాలు కేటాయించాం. ఫైబర్‌నెట్ కనెక్షన్‌తో కూడిన సదుపాయాలు కల్పించాం. పవర్ టు సర్‌ప్రైజ్ మీ బ్రాండ్ .మాది ఇన్నోవేషన్ వ్యాలీ. మాది వ్యవసాయాధారిత రాష్ట్రం. పారిశ్రామికంగా ముందుకెళ్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో త్వరలోనే మేం ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలుస్తాం" అని పార్క్‌ని ఉద్దేశించి చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి కియతో పాటు హీరో, ఇసుజు, వీర వాహన, అశోక్ లేలాండ్ తదితర కంపెనీలు .. 3.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో వస్తున్నాయని, త్వరలోనే రాష్ట్రం ఆటోమొబైల్ హబ్‌గా మారిపోనున్నదని చంద్రబాబు తెలిపారు. "అనంతపురం జిల్లా కియ ప్లాంటు సమీపంలో 18 ఆటోమొబైల్ అనుబంధ సంస్థలు 5,062 కోట్లు పెట్టుబడిని పెడతాయి. దానివల్ల 6800 ఉద్యోగాలు కొత్తగా రానున్నాయి. త్వరలోనే మరో 60-70 కంపెనీలు రానున్నాయి." అని సీఎం వివరించారు.

రూ.13 లక్షల కోట్లు..13 లక్షల మందికి కొలువు

ఇప్పటిదాకా 13 లక్షల కోట్ల రూపాయల విలువైన 1,946 ఎంవోయూలు కుదిరాయని, దానివల్ల 13 లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయని చంద్రబాబు వెల్లడించారు. "అనంతపురంలో 905 కోట్ల రూపాయలను మౌలిక సదుపాయాల కోసం వ్యయంచేశాం. కియ కోసం 665 కోట్లు వ్యయం చేశాం. అనంతపురానికి అత్యుత్తమ భవిష్యత్తు ఉంది. సోలార్, పవన విద్యుత్‌లో 3,500 మెగావాట్ల ఉత్పత్తి చేస్తాం. చెర్లోపల్లి .. హిందూపురం, మడకశిర, పేరూరుకు జలాలు తీసుకెళ్తాం." అని హామీ ఇచ్చారు.

కియ రాక ఏపీకీ .. అనంతపురానికి హ్యాపీ..

"10 రాష్ట్రాల్లో అధ్యయనం జరిపిన ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనే సంస్థ.. ఏపీలో 10 లక్షల మంది యువత ఉద్యోగాలకు అర్హులుగా ఉన్నారని తెలిపింది. ఈ కేటగిరీలో ఏపీ నంబర్ వన్‌గా నిలిచింది" అని చంద్రబాబు వివరించారు. నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్రంలో ఏర్పాటు చేశామని, సీమెన్స్ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్, గూగుల్ తో నైపుణ్యాభివృద్ధిలో యువతకు శిక్షణను ఇస్తున్నామని.. కియ ఛైర్మన్‌కు వివరించారు. "మీరూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థను ఏర్పాటు చేయండి. డబ్బు సమస్య కానేకాదు. నేను ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రానికి వోక్స్‌వ్యాగన్ రావాల్సింది. ఇప్పుడు అది ఇతర రాష్ట్రానికి వెళ్లిపోయింది. భవిష్యత్‌లో ఎవరైనా పరిశ్రమలు స్థాపించాలంటే ఏపీకే రావాలి. అందుకనే అన్ని వనరులూ ఇస్తున్నాం" అని పార్క్‌తో అన్నారు. అనంతపురం, ఏపీ అదృష్టవంతులన్న ఆయన, ఒక కాల్‌తోనే సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

భాగస్వామ్య సదస్సులతో నా విశ్వాసం పెరిగింది

"విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌లో మౌలిక సదుపాయాలు లేవు. అలాంటి రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సంకల్పించాం. దానికోసం 2016లో తొలిసారిగా పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును విశాఖలో నిర్వహించాం. రూ.4,65,000 కోట్ల భాగస్వామ్య ఒప్పందాలను చేసుకున్నాం. రెండో ఏట ఏకంగా 10,00,000 కోట్ల మేర భాగస్వామ్య ఒప్పందాలను చేసుకున్నాం. శనివారం నుంచి విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులు వస్తాయనే కాన్ఫిడెన్స్ వచ్చింద"ని సీఎం చంద్రబాబు అన్నారు. వాణిజ్య పరంగా ఏ రాష్ట్రంతో పోటీ ఉందనే అంశాన్ని తాను వెల్లడించలేనని .. దానివల్ల ఆయా రాష్ట్రాలతో సత్సంబంధాలు దెబ్బతింటాయని కియ పనుల ప్రారంభం సందర్భంగా మీడియాతో అన్నారు. "పారిశ్రామిక సంస్థలకు భూములు కేటాయించే సమయంలో న్యాయపరమైన వివాదాలు ఎదురవుతున్నాయి. ఈ వివాదాల కారణంగా పరిశ్రమల ప్రగతి ఆగిపోకూడదు. దానికోసం న్యాయస్థానాల్లో ఆ వివాద భూములకు సంబంధించిన పరిహారం మొత్తాన్ని ముందస్తుగా డిపాజిట్ చేస్తున్నాం. ఫలితంగా .. పరిశ్రమలు స్థాపించేందుకు సంస్థలు ముందుకు వచ్చే అవకాశం ఉంది" అని వివరించారు.



చంద్రబాబు పాలన అద్భుతం

- ఆయన చొరవతోనే దేశంలోకి..
- రోల్ మోడల్‌లా మా భాగస్వామ్యం
- సీఎంపై 'కియ' ఛైర్మన్ పార్క్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ సామాజిక, ఆర్థికాభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తామని కియ మోటార్స్ ఛైర్మన్ పార్క్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అద్భుతంగా ఉన్నదని ప్రశంసించారు. దూరదృష్టితో పాలనను అందిస్తున్నారని కొనియాడారు. "ఆసియాలోనే మాది అతి పెద్ద ఆటోమొబైల్ పరిశ్రమ. 180 దేశాల్లో మా కంపెనీ కార్ల విక్రయాలు జరుగుతున్నాయి. గత రెండేళ్ల కిందట సీఎం చంద్రబాబుతో సంప్రదింపులు జరిపాక .. అనంతపురంలో కియ కార్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఆయన చొరవ కారణంగానే దేశంలో మొట్ట మొదటిసారిగా మా కార్ల తయారీ ప్లాంటును స్థాపించగలిగాం. 2019 ద్వితీయార్థంలో కియ కార్లు మార్కెట్లోకి వస్తాయి. ఈ ప్లాంటులో తయారయ్యే కార్లను దేశీయ మార్కెట్లోనే విక్రయిస్తాం. చంద్రబాబుతో మా భాగస్వామ్యం విదేశీ వాణిజ్య ఒప్పందాలకు ఒక రోల్ మోడల్‌గా మారనుంది.



2018 ఆటో ఎక్స్‌పో ప్రదర్శనకు ఉంచిన కొత్త ఎస్.వి.యును అనంతపురం ప్లాంట్‌లోనే తయారు చేయనున్నాం. ఈ ప్లాంటులో 15,000 ఉద్యోగాలను స్థానికంగా ఇస్తాం" అని పార్క్ వివరించారు.


'శవాల దందా కథ'..

గుంటూరులో కలత

సెల్వరాజే సుబ్బారావు

- 6నెలల క్రితం ఇల్లు విడిచి..
- ఇప్పుడు చెన్నైలో ముప్పులో..
- 'కాంచీపురం' దుర్మార్గానికి ఏకైక సాక్షి
- ఆంధ్రజ్యోతి కథనంలోని ఫొటో చూసి చెన్నైకి కుటుంబసభ్యులు

గుంటూరు, చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమం ముసుగులో తమిళనాడులోని కాంచీపురంలో సాగుతున్న శవదందాకు ఏకైన ప్రత్యక్ష సాక్షి ఆయన! తనను బలి తీసుకోవడానికి కొందరు ప్రయత్నించగా, స్థానికుల సాయంతో మరో మహిళతో కలిసి తప్పించుకొని.. సంచలనం రేపాడు. 'వృద్ధాశ్రమంలో శవ దందా' పేరిట గురువారం ఆంధ్రజ్యోతి సంచికలో వార్తతోపాటు ప్రచురించిన ఫొటోలో కనిపించిన ఆ వృద్ధుడు సెల్వరాజ్ అని అంతా భావించారు. అయితే, ఆ ఫొటోలోని వ్యక్తి తమ కుటుంబసభ్యుడు అని, అతని పేరు సెల్వరాజ్ కాదు, సుబ్బారావు అంటూ గురువారం గుంటూరులోని ఓ కుటుంబం ముందుకొచ్చింది. మతిస్థిమితం లేక సుబ్బారావు ఆరునెలల క్రితం ఇల్లు వదిలిపెట్టి పోయాడని.. ఇన్నాళ్లకు అతని గురించి వింటున్నామని వారు వాపోయారు. దీంతో.. కాంచీపురం జిల్లా పాలేశ్వరం వృద్ధాశ్రమంలో నిర్వాహకుల కబంధహస్తాల్లో చిక్కుకున్న వృద్ధుడు ఎవరో కాదు, సుబ్బారావేననేది నిర్ధారణ అయింది. 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ఫొటో ఆధారంగా, సుబ్బారావును కలుసుకోవడానికి ఆయన భార్య, కుమార్తె చెన్నైకు బయలుదేరివెళ్లారు. వృద్ధాశ్రమంలో అనుమానాస్పద స్థితిలో వృద్ధులు చనిపోతూ,, వారి మృతదేహాలను కుళ్లబెట్టి, బాగా ఎండిన తరువాత ఎముకలను విదేశాలకు అమ్ముకొంటున్న వైనం సంచలనం రేపుతున్న విషయం తెలిసిందే. పాలేశ్వరం సహా తమిళనాడు అంతటా వృద్ధాశ్రమాలను నిర్వహిస్తున్న సెయింట్ జోసెఫ్ హాస్పీస్ అనే సంస్థపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఓ మృతదేహంతో పాటు సుబ్బారావును, మరో మహిళను కూరగాయల వ్యాన్‌లో తరలిస్తుండగా, స్థానికులు గుర్తించి కాపాడారు.





సుబ్బారావు భార్య, కూతురు (ఇన్‌సెట్‌లో)సుబ్బారావు

ఆరు నెలలుగా అదే లుంగీతో..

కాంచీపురం వృద్ధాశ్రమంలో స్థానికులను చేర్చుకోరు. బయట ప్రాంతాలు, రాష్ట్రాలకు చెందిన వృద్ధులకు మాత్రమే ఆశ్రయం ఇవ్వడం గమనార్హం. దీని కారణంగానే గుంటూరుకు చెందిన రెడ్డి సుబ్బారావుకు బహుశా ఇక్కడ ఆశ్రమం దొరికి ఉంటుందని భావిస్తున్నారు. గుంటూరు నగరంలోని పిచ్చికులగుంటలో నివశించే రెడ్డి సుబ్బారావు(70)కి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రిక్షా తొక్కి, కుటుంబాన్ని సుబ్బారావు పోషించేవాడు. కొద్దికాలం క్రితం ఆయనకు మతి స్థిమితం తప్పింది. అప్పటినుంచి చిన్న కుమార్తె మహాలక్ష్మి దగ్గర ఉంటున్నాడు. ఆరునెలల క్రితం ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. దీనిపై చిన్న కుమార్తె మహాలక్ష్మి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం ఆయన కుటుంబానికి ఆనందాన్ని, అంతే ఆందోళనను కలిగించింది. ఇంట్లో నుంచే వెళ్లేటప్పుడు ఏ లుంగీ ఉందో అదే లుంగీ అతని వంటిపై ఉండటంతో సులువుగా గుర్తించామని వారు తెలిపారు.

అలాగే ఖననం చేస్తాం: నిర్వాహకుల వాదన

వృద్ధాశ్రమం ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న 'సెయింట్ జోసఫ్ కరుణై ఇల్లం' నిర్వాహకుడు ఫాదర్ థామస్ అడ్డగోలు వాదనలకు దిగారు. అసలు గుట్టు రట్టవ్వడంతో ఏం చేయాలో పాలుపోక పొంతన లేకుండా మాట్లాడారు. తాము మృతదేహాలకు కొత్త పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నామంటూ బుకాయించేందుకు ప్రయత్నించారు. "మేం ప్రభుత్వ అనుమతితోనే ఆశ్రమం నడుపుతున్నాం. ఆశ్రమంలో అనారోగ్యం కారణంగా మృతి చెందేవారిని ఖననం, దహనం చేయకుండా కొత్తపద్ధతిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం. మా ఆశ్రమంపై ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొన్నారు. అయితే, మృతదేహాల విషయంలో అనుసరిస్తున్న ఆ కొత్త పద్ధతి ఏంటో చెప్పమని మీడియా ప్రతినిధులు అడగ్గా.. ఆయన మౌనం దాల్చారు. కాగా, వరుసగా రెండోరోజు కూడా ఆశ్రమంలో అధికారులు తనిఖీలు సాగించారు. ఈ ఆశ్రమంలో అనుమానాస్పదంగా ఓ భవనం వారికి కనిపించింది. అందులో 20 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతున నిర్మించిన తొట్టె ఉండటాన్ని గమనించారు. ఆ తొట్టె ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నదానిపై ఆశ్రమ నిర్వాహకులు పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. కాగా ఆశ్రమంలోని ఓ గోడలో శవాలను ఉంచారన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. దీనిపైనా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే, గత యేడాది సెప్టెంబర్‌లోనే ఈ వృద్ధాశ్రమం లైసెన్సు గడువు ముగిసిందన్న విషయమూ బయటపడింది. కాగా, శనివారం కాంచీపురం కలెక్టర్ పొన్నయ్యకు తమ నివేదికను అందిస్తామని అధికారులు వెల్లడించారు.

ల్యాప్‌టాప్ 'టెండర్ల' గోల్‌మాల్?

- ట్రిపుల్ ఐటీల్లో మళ్లీ వివాదం
- 7 వేల ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లలో... సంతకం లేకుండానే ఆథరైజేషన్
- 'మైక్రోకేర్'కు అనుకూలంగా చర్యలు!
- చక్రం తిప్పిన ఆర్‌జీయూకేటీ సిస్టమ్స్ మేనేజర్?



అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):ట్రిపుల్ ఐటీల్లో ల్యాప్‌టాప్ కొనుగోళ్లకు సంబంధించిన టెండర్ ప్రక్రియలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ) నిర్వహిస్తోన్న శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల్లోని విద్యార్థుల కోసం 7 వేల ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియలో మూడు సంస్థలు పాల్గొన్నాయి. ఇక్కడే గోల్‌మాల్ జరిగినట్లు అనుమానిస్తున్నారు. 'హెచ్‌పీ'కి సంబంధించిన 'మైక్రోకేర్' అనే సంస్థకు రూ.20 కోట్ల విలువైన టెండర్ దక్కేలా ప్రాసెసింగ్ స్పెసిఫికేషన్లు రూపొందించడంలో ఆర్‌జీయూకేటీలో పనిచేస్తున్న సిస్టమ్స్ మేనేజర్ ఒకరు తెరవెనుక చక్రం తిప్పినట్లు సమాచారం. ఏఎండీ ప్రాసెసర్ స్పెసిఫికేషన్‌తో టెండర్ దక్కేలా చేసినందుకుగాను ఆ వ్యక్తికి భారీగానే ముట్టజెప్పేలా ఒప్పందం కుదిరినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కంపెనీ తమ సంస్థకు ఎలాగైనా సరే టెండర్ దక్కించుకునే స్కెచ్‌లో భాగంగా సంతకం లేకుండానే రెండు సంస్థలకు ఆథరైజేషన్ ఇవ్వడం గమనార్హం. ఆర్‌జీయూకేటీ కూడా ఆయా పరికరాలకు నాణ్యతా ప్రమాణాల పరీక్షలు నిర్వహించలేదన్న ఆరోపణలున్నాయి.

ముందే స్కెచ్ రెడీ!

హెచ్‌పీ కంపెనీ కాకుండా వాటికి సంబంధించిన సంస్థలు టెండర్‌లో పాల్గొనాలంటే కంపెనీ వాళ్లు సంతకం చేసిన ఆథరైజేషన్ ఫారం ఇవ్వాలి. అది కూడా ఒక్క సంస్థకే ఇవ్వాల్సి ఉండగా..ఇందులో రెండు సంస్థలు సమర్పించిన ఆథరైజేషన్ ఫారంలో సంతకాలు లేవని తెలుస్తోంది. వాస్తవానికి అలాంటి సంస్థలను డిస్క్వాలిఫై చేయాలి. అలా జరగలేదు. ఇందులో ఒక సంస్థ అయితే టెండర్ పరికరం ల్యాప్‌టాప్‌ను సమర్పించలేదు. అయినా దాన్ని కూడా పట్టించుకోలేదు. ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు పరిశీలించే కమిటీపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం మీద నాసిరకం ల్యాప్‌టాప్‌లను ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అంటగట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు రద్దయిన ల్యాప్‌టాప్ కొనుగోళ్ల టెండర్లను ఈసారి ముందస్తు స్కెచ్‌తో ఖరారు చేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై విచారణ జరిపించాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ధరలో రూ.5 వేలు తేడా!

'హెచ్‌పీ'కి సంబంధించి మైక్రోకేర్, కె-కంప్యూటర్ సంస్థలు, 'డెల్' కంపెనీకి చెందిన అక్షర సంస్థలు టెండర్‌లో పాల్గొన్నాయి. మైక్రోకేర్, కె-కంప్యూటర్ సంస్థలు ఏఎండీ ప్రాసెసర్స్‌తో స్పెసిఫికేషన్స్ ఇవ్వగా, అక్షర సంస్థ మాత్రం ఇంటెల్ ప్రాసెసర్‌తో స్పెసిఫికేషన్ ఇచ్చింది. ఆయా సంస్థల ప్రాసెసర్స్ ఎలా ఉన్నాయో ముందుగా బెంచ్ మార్క్ టెస్ట్‌లు చేయాలి. కానీ వాటి జోలికి పోకుండానే మైక్రోకేర్ సంస్థకు టెండర్ దక్కేలా ఆర్‌జీయూకేటీ సిస్టమ్స్ మేనేజర్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు సంస్థలూ ఒకేరకమైన ప్రాసెసర్ల విలువలో రూ.5 వేలు తేడా చూపించినా పట్టించుకోలేదు. టెండర్ రద్దు కాకుండా ఉండేందుకే డమ్మీ టెండర్ వేయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ప్రపంచీకరణ నేపథ్యంలో మేనేజ్‌మెంట్ కెరీర్ స్వభావం మారుతోంది. వ్యాపార, వాణిజ్య రంగాల్లో వస్తున్న మార్పులు, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. సబ్జెక్టు పరిజ్ఞానం, ఆచరణకుతోడు మానవీయ కోణం మేనేజ్‌మెంట్‌లో చేరింది. విలువలు, బాధ్యతలు, కుటుంబం, గౌరవం, విధేయత... ఇలా కొత్త పరిభాషకు మేనేజ్‌మెంట్ కోర్సు, ప్రొఫెషన్‌లో ప్రాధాన్యం పెరుగుతోంది. కంపెనీలు కూడా ఈ కోణంలో నైపుణ్యాలు ఉన్నవారికి నియామకాల్లో పెద్దపీట వేస్తున్నాయి.

జాబ్ ట్రెండ్స్

మేనేజ్‌మెంట్‌లో... మానవీయం

మేనేజ్‌మెంట్ విద్యార్థుల నుంచి భారతీయ సంస్థలు ఆశిస్తున్న ముఖ్య నైపుణ్యాలు.. నాలెడ్జ్ కాంపోనెంట్ (సంబంధిత రంగంపై అవగాహన), ప్రాక్టీస్ కాంపోనెంట్ (పని చేయడం, చేయించడంలో సమర్థత), బీయింగ్ హ్యూమన్ కాంపోనెంట్ (నైతిక విలువలు, దృక్పథం, కెరీర్, బాధ్యతల మధ్య సమన్వయం సాధించడం వంటివి). ఈ మూడు లక్షణాలు ఉంటే చాలు మేనేజ్‌మెంట్ విద్యార్థులకు కంపెనీలు రెడ్ కార్పెట్‌తో స్వాగతం చెబుతున్నాయి.

సబ్జెక్టు తెలివితేటలు

సబ్జెక్టు తెలివితేటలు (నాలెడ్జ్ కాంపోనెంట్) అంటే కేవలం సంబంధిత రంగంపై పరిజ్ఞానం ఉంటే చాలు అనుకుంటే పొరపాటే. ఎంబీఏ విద్యార్థులు ప్రతి విషయాన్ని ఆచరణాత్మక, వాస్తవిక దృక్పథంతో చూడగలగాలి. ఈ రెండూ కలిస్తే.. మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్‌గా మంచి కెరీర్ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

- దీనికి తరగతి గది పాఠాలు, పుస్తకాలు సరిపోవు. ప్రాపంచిక దృక్పథం.. వాస్తవ పరిస్థితులపై అవగాహన.. కంపెనీల కొత్త పోకడలు.. ఇలా ఎన్నో అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తద్వారా ఎంబీఏ పట్టాతో పాటు.. భవిష్యత్తు మేనేజ్‌మెంట్ నాయకులుగా ఎదిగేందుకు ఆస్కారం ఉంటుంది. అత్యంత ప్రాధాన్యం ఉన్న, ప్రాథమిక ఆవశ్యకత ఇది. ప్రతి విషయాన్ని పరిస్థితులకు అన్వయించే దృక్పథంతో వ్యవహరించగల నేర్పు ముఖ్యం.

ఆచరణాత్మక దృక్పథం

ఆచరణాత్మక దృక్పథం (ప్రాక్టీస్ కాంపోనెంట్)తో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సమర్థంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకు టీమ్ వర్క్, పీపుల్ మేనేజ్‌మెంట్ వంటి నైపుణ్యాలు అవసరమవుతాయి. ఇవి క్యాంపస్‌లో కాకుండా ఇంటర్న్‌షిప్ వంటి క్షేత్ర స్థాయి అధ్యయనాల ద్వారా అలవడుతాయి. కొద్ది రోజుల పాటు వాస్తవ పని వాతావరణం, పరిస్థితుల గురించి అనుభవపూర్వకంగా తెలుసుకోవడం, అవసరమైన నైపుణ్యాలపై అవగాహన పొందడం ఇంటర్న్‌షిప్ ద్వారా సాధ్యమవుతుంది. కోర్సు పూర్తయ్యే నాటికి ఇండస్ట్రీ రెడీగా తీర్చిదిద్దుకునేందుకు ఇంటర్న్‌షిప్ మంచి వేదిక. కాబట్టి మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను నిర్లక్ష్యం చేయకూడదు. ఏఐసీటీఈ కూడా మేనేజ్‌మెంట్ పాఠ్యప్రణాళికలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది.

మానవ కోణం (బీయింగ్ హ్యూమన్)

బిజినెస్ స్కూల్స్ విద్యార్థులకు అనలిటికల్ స్కిల్స్ పెంపొందించడంలో ముందంజలో ఉంటున్నాయి. అంటే సంబంధిత రంగంపై అవగాహన కల్పించడం, ఆ రంగానికి అవసరమైన సిద్ధాంతాలను పరిచయం చేయడం, విశ్లేషించడం వంటి అంశాలను నేర్పిస్తున్నాయి. కానీ ప్రాక్టికల్ మేనేజ్‌మెంట్‌కు ఎంతో కీలకమైన 'బీయింగ్ హ్యూమన్' అంశాన్ని పట్టించుకోవడం లేదు.

- మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించేటప్పుడు కేవలం వ్యాపార సూత్రాలు, సిద్ధాంతాలే కాదు, వాటిని పాటించే క్రమంలో ఎన్నో నైతిక విలువలు, కెరీర్, కుటుంబం, బాధ్యతల విషయంలో సమన్వయం సాధించడం, పని చేస్తున్న సంస్థ పట్ల విధేయతతో ఉండటం, సహోద్యోగులను గౌరవించడం వంటి ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి. వీటిని సరిగా ఆచరించినప్పుడే మంచి ప్రొఫెషనల్‌గా ఎదిగే అవకాశం ఉంటుంది. విభిన్నంగా ఆలోచించడం, పని చేసేందుకు సంసిద్ధత, పాజిటివ్ ఆటిట్యూడ్ వంటివీ 'బీయింగ్ హ్యూమన్'లో ఇమిడి ఉంటాయి.

గుర్తించిన బి - స్కూల్స్

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు భవిష్యత్ కోణంలో నైపుణ్యాల అవసరాన్ని గుర్తించిన కొన్ని బిజినెస్ స్కూల్స్ ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాయి. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ విద్యార్థులకు భవిష్యత్తులో విధుల నిర్వహణ పరంగా అత్యంత ఆవశ్యకమైన సహజ నైపుణ్యం 'నలుగురితో కలిసి పనిచేయడం', 'భిన్న నేపథ్యాలున్న క్లయింట్లతో సంప్రదించడం'. దీన్ని గుర్తించిన బి-స్కూల్స్.. ఇటీవల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌ను కూడా సమర్థంగా నిర్వహిస్తున్నాయి.

- క్యాంపస్ ఫెస్టివల్స్, సంబంధిత అంశాల్లో ఒక్కోదానికి ఒక్కో విద్యార్థి బృందాన్ని నియమిస్తున్నాయి. తద్వారా విద్యార్థులకు వారికి కేటాయించిన అంశాన్ని / ఈవెంట్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించే నైపుణ్యం లభిస్తుంది. వీటిని కూడా విద్యార్థులు సమర్థంగా వినియోగించుకోవాలి.
- ప్రముఖ బిజినెస్ స్కూల్స్.. విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలు, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంచేందుకు ఇటీవల చేపడుతున్న వినూత్న విధానం గ్రూప్ టాస్క్. విద్యార్థులను బృందాలుగా విభజించి.. ఒక్కో బృందానికి ఒక వాస్తవిక సమస్యను కేటాయించి.. పరిష్కార మార్గాలు కనుగొనాలని నిర్దేశిస్తున్నాయి. ఈ క్రమంలో బృందానికి ఒక ప్రొఫెసర్‌ను ప్రేరకుడిగా నియమిస్తున్నాయి. ఫలితంగా సమస్యను విశ్లేషించి పరిష్కారం దిశగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం లభిస్తుంది. బృందాన్ని నడిపించే లక్షణాలతో పాటు అందరితో కలిసి పనిచేసే సంస్కృతి సైతం అలవడుతుంది.

ఎందుకు కీలకం అంటే..

బీయింగ్ హ్యూమన్ అనే కాన్సెప్ట్‌ను కంపెనీలు ఎందుకు కీలకంగా భావిస్తున్నాయి అంటే.. సాధారణంగా ఉద్యోగంలో చేరిన 5 - 6 ఏళ్ల తరవాత మేనేజ్‌మెంట్ నిపుణులు సీనియర్ / లీడర్స్ స్థాయికి చేరుకుంటారు. అంటే సంస్థను నడిపించే నాయకుడిగా ఎదుగుతారు. అప్పుడు సమర్థంగా విధులు నిర్వహించాలంటే మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తోపాటు బీయింగ్ హ్యూమన్ కాన్సెప్ట్ కూడా అవసరం. అందరం సమాజంలో భాగం. ఏ రంగమైనా సమాజాన్ని కాదని మనుగడ సాధించలేదు. ఈ నేపథ్యంలో వ్యాపార రంగంలో సామాజిక కోణాన్ని అన్వయించడానికి 'బీయింగ్ హ్యూమన్' చాలా అవసరం. బాధ్యతలను నిర్వహించేటప్పుడు నైతిక విలువలను పాటిస్తూ, సహోద్యోగుల్లో స్ఫూర్తి నింపుతూ, జట్టుగా పని చేసే విధంగా చూడటం, మంచి పని సంస్కృతిని నెలకొల్పేందుకు కృషి చేయటం.. ఇవన్నీ అవసరం. ప్రస్తుతం భారతీయ కార్పొరేట్ కంపెనీలు ఈ విషయంలో నిబద్ధతతో ఉంటున్నాయి. అందుకే నియామకాల్లో బీయింగ్ హ్యూమన్ భావనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి.

"నిజ జీవిత అనుభవాలే అతనికి స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితోనే కార్పొరేట్ కంపెనీల నుంచి ఆఫర్లు వచ్చినా కాదనుకొని సివిల్స్ దిశగా ప్రయత్నం ప్రారంభించాడు. తన పట్టుదలకు నిపుణుల ప్రోత్సాహం తోడవ్వడంతో ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 438.4 మార్కులు సాధించి ఎస్సీ కేటగిరీలో టాప్ స్థానంలో నిలిచాడు... **ఎద్దుల ఓబులేసు.** ఈ విజయ ప్రస్థానం అతని మాటల్లోనే.."

టాపర్స్ వాయిస్

సివిల్స్ స్ఫూర్తితో...

గ్రూప్-1లో నెగ్గాను

ప్రస్తుత ఫలితాల్లో 438.4 మార్కులు వచ్చాయి. ఎస్సీ విభాగంలో టాపర్‌ని, ఓవరాల్‌గా చూస్తే నాది 15వ ర్యాంక్. ఈ మార్కులతో మున్సిపల్ కమిషనర్ లేదా డీఎస్పీ పోస్ట్ రావచ్చు. మున్సిపల్ కమిషనర్ పోస్టు మాత్రం పక్కాగా వస్తుందని భావిస్తున్నాను.



సన్నద్ధత ఇలా

సివిల్స్ కోసం గత ఐదేళ్లుగా ప్రిపరేషన్ సాగిస్తున్నాను. అదే క్రమంలోనే 2011లో గ్రూప్-1 పరీక్ష రాశాను. 2013లో ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అయితే ఆ నోటిఫికేషన్ రద్దయింది. గ్రూప్స్ కోసం ప్రత్యేకంగా ఎటువంటి కోచింగ్ తీసుకోలేదు. సివిల్స్‌కు మాత్రం ఏపీ స్టడీ సర్కిల్ నుంచి కోచింగ్‌కు తీసుకున్నా. అది గ్రూప్స్ కోసం చాలా ఉపయోగపడింది. ప్రిపరేషన్‌లో భాగంగా ప్రాథమిక అంశాలపై పట్టు కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదివాను. అదేవిధంగా ఆయా సబ్జెక్టుల కోసం ప్రత్యేకంగా ఉండే స్టాండర్డ్ పుస్తకాలను ఫాలో అయ్యాను. మరికొన్ని సబ్జెక్టుల కోసం సొంతంగా నోట్స్ రూపొందించుకున్నాను. ఇవన్నీ గ్రూప్-1 విజయంలో చాలా తోడ్పాటును అందించాయి. ప్రస్తుత గ్రూప్-1 మెయిన్స్‌లో జనరల్ ఎస్సేలో ఎక్కువ మార్కులు, సైన్స్ అండ్ టెక్నాలజీలో తక్కువ మార్కులు వచ్చాయి.

నేపథ్యం

మా స్వస్థలం ప్రకాశం జిల్లా పామూరు మండలం ఎనిమర్ల గ్రామం. నాన్న ఎద్దుల నమ్మయ్య, అమ్మ నాంచారమ్మ. మేము ఐదుగురం. అందులో నేను చిన్నవాణ్ని. ఇద్దరు అన్నయ్యలు, ఇద్దరు అక్కలు. వారు వ్యవసాయం చేస్తారు. నేను ఎనిమర్లలోనే ఒకటి నుంచి మూడో తరగతి వరకు చదువుకున్నా. నాలుగు నుంచి ఎనిమిది వరకు పామర్రులో 9, 10 తరగతులను కనిగిరిలో పూర్తి చేశాను. 10వ తరగతిలో 507 మార్కులు వచ్చాయి. ఆ సమయంలో స్కూల్ టాపర్‌ని. మార్టూరులో ఇంటర్మీడియెట్ చదివాను. తరవాత విజయవాడలోని పీవీపీ సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్‌లో చేరాను. 2009లో బీటెక్ పూర్తి చేశాను.

లక్ష్యం కోసం

బీటెక్ చేస్తున్నప్పుడే క్యాంపస్ ఆఫర్లు వచ్చాయి. అయినా నా లక్ష్యం సివిల్స్ కోసం వాటిని వదులుకున్నా. హైదరాబాద్ వచ్చి పార్ట్‌టైమ్ జాబ్స్ చేస్తూ సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. ఇప్పటికి ఐదు సార్లు సివిల్స్ రాశాను. మరో ఐదు అవకాశాలు ఉన్నాయి. వాటిని కూడా ఉపయోగించుకుంటా. సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నప్పుడే 2013లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికయ్యాను. అందులో భాగంగా 2014 నుంచి రెండున్నర సంవత్సరాల పాటు ఉత్తరప్రదేశ్‌లో పని చేశాను. ఆ సమయంలో ప్రిపరేషన్‌పై దృష్టి కేంద్రీకరించడం కోసం సబ్జెక్ట్ మెటీరియల్‌ను రివిజన్ చేసేవాణ్ని. అది గ్రూప్-1 రాయడానికి చాలా ఉపయోగపడింది.

మొదటి ప్రభుత్వోద్యోగిని

మా ఊరి నుంచి మొదటి గ్రాడ్యుయేట్‌ను, మొదటి ప్రభుత్వోద్యోగిని కూడా నేనే. మాది వ్యవసాయదారుల కుటుంబం. అయినప్పటికీ నాన్నకున్న అవగాహన మేరకు కలెక్టర్ లేదా గ్రూప్-1 ఆఫీసర్ అయితే బాగుంటుందనేవారు. అది కూడా నాకు స్ఫూర్తినిచ్చేది. 2009 నుంచి చూస్తే ఈ విజయం సాధించేవరకు చాలా సమయం పట్టింది. ఈ సమయంలో కుటుంబం నుంచి ఎలాంటి ఒత్తిడి రాలేదు. నా ప్రయత్నాలకు మద్దతుగా నిలిచేవారు.

నిజ జీవిత అనుభవాలే

నిజ జీవిత అనుభవాలే నన్ను సివిల్స్ దిశగా నడిపించాయి. నేను చిన్నప్పటి నుంచి, అంటే మూడో తరగతి నుంచి బీటెక్ వరకు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్‌లో ఉండి చదువుకున్నాను. ఆ సమయంలో ఎదురయ్యే సమస్యలపై విద్యార్థి సంఘాలు కలెక్టర్ల దగ్గర ప్రస్తావించినప్పుడు వారు స్పందించే గుణం బాగా ఆకట్టుకుంది. వారు తమ అధికారాలతో చేసే పనులు నన్ను అమితంగా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఇక్కడ ఒక సంఘటనను ప్రస్తావించాలి. విజయవాడలో బీటెక్ చదువుతున్నప్పుడు నేను ఉన్న హాస్టల్ చాలా అసౌకర్యంగా ఉండేది. చాలా పాత భవనం. లోతులో ఉండేది. వర్షం వస్తే నీటితో నిండిపోయేది. కూర్చోవడానికి, నిలబడటానికి ఇబ్బందిగా ఉండేది. దీంతో ఆ సమస్యను అప్పటి కలెక్టర్ ప్రభాకర్ రెడ్డితో ప్రస్తావించాను. దాంతో ఆయన 24 గంటల్లో నూతన భవనంలోకి హాస్టల్‌ను మార్చారు. ఒక కలెక్టర్‌కు ఇంత అధికారం ఉంటుందా అనిపించింది. ఇవన్నీ నాలో స్ఫూర్తిని నింపాయి. సివిల్స్ సంకల్పాన్ని బలంగా నాటాయి.

కీలకం.. ప్రాథమిక అంశాలపై పట్టు

విజయం ఒక్కోసారి ఆలస్యం కావచ్చు కానీ దక్కకుండా పోదు. కాబట్టి ఓపికతో ఉండాలి. పట్టుదలతో ప్రయత్నించాలి. నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా ప్రిపరేషన్ ప్రారంభించాలి. నిరంతరంగా కృషి చేస్తూనే ఉండాలి. ముందుగా ఆయా సబ్జెక్టులలోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించేందుకు ప్రయత్నించాలి. తద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. దాంతో ఎప్పటికైనా పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చు.

ఇంటర్వ్యూ కోసం...

గ్రూప్-1 ఇంటర్వ్యూకు ఎంపికైన తరవాత... డాక్టర్ పి.వి. లక్ష్మయ్య సార్ దగ్గర గైడెన్స్ తీసుకున్నాను. అది నాకు చాలా ఉపయోగపడింది. అదేవిధంగా మోహన్ కందా సార్ ఇచ్చిన సూచనలు కూడా ఇంటర్వ్యూలో బాగా చేయడానికి ఉపకరించాయి. ఇంటర్వ్యూ 15 నిమిషాలపాటు జరిగింది. గతంతో పోల్చితే ఇంటర్వ్యూలో నాణ్యత పెరిగింది. గతంలో ఇంటర్వ్యూ బోర్డులో 11 మంది సభ్యులు ఉంటే ప్రస్తుతం బోర్డులో నలుగురు సభ్యులు మాత్రమే ఉన్నారు. మంచి వాతావరణంలో ఇంటర్వ్యూ జరిగింది. కేంద్ర ప్రభుత్వ అధికారిగా ఉత్తరప్రదేశ్‌లో విధులు నిర్వహించడంతో దానిపై ఎక్కువ ప్రశ్నలు వేశారు. అక్కడి రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌తో పోల్చితే తూర్పు ఉత్తర ప్రదేశ్ వెనుకబడి ఉండటానికి కారణాలు, అదేవిధంగా హాబీస్, బయోడేటా ఆధారంగా కూడా ప్రశ్నలు వేశారు.

జాబ్ కార్నర్

కేంద్రీయ విద్యాలయ

హైదరాబాద్ శివరాంపల్లిలోని కేంద్రీయ విద్యాలయ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- విభాగాలు: ఇన్‌స్ట్రక్టర్స్, కంప్యూటర్, మ్యూజిక్, డ్యాన్స్, స్పోర్ట్స్, ఆర్ట్, డిఇక
- అర్హత: ఒకటి నుంచి అయిదో తరగతి టీచర్లకు డిఇడీ, ఆరు నుంచి పన్నెండో తరగతి టీచర్లకు బిఇడి అర్హత ఉండాలి. పీఆర్‌టీలకు 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సీటెట్ అర్హత పొంది ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్ పరిజ్ఞానంతోపాటు హిందీ & ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధనా సామర్థ్యం ఉండాలి. టీజీటీలకు సంబంధిత సబ్జెక్టుల్లో సెకండ్ క్లాస్ మార్కులతో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కోర్సు / జనరల్ డిగ్రీ చేసి ఉండాలి. పీజీటీలకు రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎమ్మెస్సీ కోర్స్ / సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసి ఉండాలి. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు బీఈ / బీటెక్ / బిఎస్సీ (కంప్యూటర్ సైన్స్) / బీసీఏ / ఎంసీఏ/ ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్/ఐటీ/ ఎలక్ట్రానిక్స్ - కంప్యూటర్ సైన్స్) / (డిగ్రీ/ పీజీ) (మేథమెటిక్స్ / సైన్స్ సబ్జెక్టులు) పూర్తిచేసి ఉండాలి. ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌కు స్పోర్ట్స్ / గేమ్స్ / అథ్లెటిక్స్ విభాగాల్లో అనుభవం ఉండాలి. యోగా టీచర్‌కు డిగ్రీతోపాటు యోగా తరగతులకు సంబంధించి ఏడాది ట్రైనింగ్ పొంది ఉండాలి.
- ఎంపిక: ఇంటర్వ్యూ / రాత పరీక్ష ద్వారా
- ఇంటర్వ్యూ: ఫిబ్రవరి 27న
- వేదిక: Kendriya Vidyalaya, NPA, Shivarampally, NPA Campus, Zoo Park Road, Hyderabad.
- వెబ్‌సైట్: kvsvpnpaap.org

పోలీస్ అకాడమీలో డ్రైవర్లు

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ పోలీస్ అకాడమీ (ఎస్వీపీఎన్‌పీఏ) - డ్రైవర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

- వయసు: 26 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. హిందీ, తెలుగు భాషలు మాట్లాడడం తెలిసి ఉండాలి. బ్యాడ్జ్ నెం. సహా వ్యాలిడ్ హెచ్‌ఎంవి / ఎల్‌ఎంవి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.
- వేతనం: రోజుకి రూ.523
- ఇంటర్వ్యూ: మార్చి 6న
- వేదిక: Academy MT Garrage Site A, Shivarampally, Hyderabad - 500052
- వెబ్‌సైట్: www.svpnpa.gov.in

సీఆర్ఐడీఏలో యంగ్ ప్రొఫెషనల్స్

ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్ (సీఆర్ఐడీఏ)- తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.



- ప్రాజెక్టు పేరు: నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ క్లయిమేట్ రెజిలెంట్ అగ్రికల్చర్.
- మొత్తం ఖాళీలు: 28
- విభాగాలవారీ ఖాళీలు: అగ్రికల్చరల్ ఎకనామిక్స్ 2, బయో ఇన్ఫర్మాటిక్స్ 2, సాయిల్ సైన్స్ / ఆగ్రోనమీ / ఆగ్రో ఫారెస్ట్రీ 8, మెటరాలజీ 1, సాయిల్ & వాటర్ కన్జర్వేషన్ 1, రిమోట్ సెన్సింగ్ అండ్ జిఐఎస్ 1, అగ్రికల్చర్ 1, ప్లాంట్ బయో కెమిస్ట్రీ 1, అగ్రికల్చర్ మైక్రో బయాలజీ 2, అగ్రికల్చర్ బయో టెక్నాలజీ 2, కంప్యూటర్ సైన్స్ 3, ఈఆర్‌పీ 2, ఐపీఆర్ 1, ఆఫీస్ అసిస్టెంట్ (ట్యాక్సేషన్ / ఇన్స్యూరెన్స్) 1
- అర్హత: పీజీ (అగ్రికల్చరల్ ఎకనామిక్స్ / ఎకనామిక్స్/ అప్లయిడ్ ఎకనామిక్స్ / బయో ఇన్ఫర్మాటిక్స్ / ప్లాంట్ పాథాలజీ / సాయిల్ సైన్స్ / ఆగ్రోనమీ / ఆగ్రో ఫారెస్ట్రీ / ఫారెస్ట్రీ / మెటరాలజీ / అగ్రికల్చరల్ మెటరాలజీ/ అట్మాస్ఫియరిక్ సైన్సెస్ /అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ - (సాయిల్ & వాటర్ కన్జర్వేషన్ / లాండ్ వాటర్ మేనేజ్‌మెంట్/ వాటర్ రిసోర్సెస్)/ రిమోట్ సెన్సింగ్/ జియోమాటిక్స్/ప్లాంట్ బయో కెమిస్ట్రీ/అగ్రికల్చర్ బయో కెమిస్ట్రీ/ ప్లాంట్ సైకాలజీ/ బయో కెమిస్ట్రీ / అగ్రికల్చర్ మైక్రో బయాలజీ/ మైక్రోబయాలజీ / ప్లాంట్ & పాథాలజీ/ అగ్రికల్చరల్ బయో టెక్నాలజీ / మాలిక్యులర్ బయాలజీ/ బయో టెక్నాలజీ / జెనెటిక్ ఇంజనీరింగ్) / (బిఇ / బిటెక్) (కంప్యూటర్ సైన్స్/ ఐటి) / బిఎస్సీ (అగ్రికల్చర్/ కంప్యూటర్) పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఇంటర్వ్యూ నాటికి 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
- కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది.
- వేతనం: గ్రేడ్‌ను అనుసరించి యంగ్ ప్రొఫెషనల్స్‌కు నెలకు రూ.15,000 / రూ.25,000; ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.15,000 ఇస్తారు.
- పోస్టింగ్: హైదరాబాద్
- ఇంటర్వ్యూ: మార్చి 12 నుంచి 14 వరకు
- వేదిక: ICAR - CRIDA, Santoshnagar, Saidabad PO, Hyderabad - 500059
- వెబ్‌సైట్: www.crida.in

మంగళూరు రిఫైనరీ

ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలోని మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పిఎల్) మేనేజ్‌మెంట్ కేడర్‌లో కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు : లేబరేటరీ సూపర్‌వైజర్ 7, ఇంజనీర్ (ఫైర్) 1, ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్ 8, ఇంటర్నల్ ఆడిట్ 1), సీనియర్ మేనేజర్ (మెడికల్ సర్వీసెస్) 1, అసిస్టెంట్ మేనేజర్ (సేఫ్టీ 2, మెడికల్ సర్వీసెస్ 2)
- అర్హత: సూపర్‌వైజర్లకు ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ - అనలిటికల్ కెమిస్ట్రీ / ఫిజికల్ కెమిస్ట్రీ / ఆర్గానిక్ కెమిస్ట్రీ / ఇనార్గానిక్ కెమిస్ట్రీ / అప్లయిడ్ కెమిస్ట్రీ/ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ / పాలిమార్ కెమిస్ట్రీ / పెట్రోలియం కెమిస్ట్రీ / ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ / ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ / అప్లయిడ్ ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ / జనరల్ కెమిస్ట్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంజనీర్ పోస్టుకు బిఇ/ బిటెక్ (ఫైర్ & సేఫ్టీ); ఎగ్జిక్యూటివ్ పోస్టులకు సీఏ / ఐసీడబ్ల్యుఏ / ఎంబిఏ (ఫైనాన్స్) పూర్తిచేసి ఉండాలి. సీనియర్ మేనేజర్‌కు ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు స్టేట్ మెడికల్ కౌన్సిల్ / మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉండాలి. మూడు నెలల ఇండస్ట్రియల్ హెల్త్ ట్రైనింగ్ సర్టిఫికెట్‌తోపాటు కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. అసిస్టెంట్ మేనేజర్లకు సంబంధించి సేఫ్టీ విభాగానికి బిఇ / బిటెక్‌తోపాటు పీజీ డిప్లొమా (ఇండస్ట్రియల్ సేఫ్టీ) ఉండాలి. కనీసం నాలుగేళ్ల అనుభవం తప్పనిసరి. అదే మెడికల్ సర్వీసెస్ విభాగానికి ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: పోస్టు నిబంధనల ప్రకారం 28 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ / గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో తదుపరి ప్రక్రియలకు అనుమతిస్తారు. రాత పరీక్ష స్కోరుకు 85 శాతం, జీడీ / జీటీ & ఇంటర్వ్యూలకు 15 శాతం వెయిటేజీ ఇస్తారు.
- రాత పరీక్ష వివరాలు: ఇందులో 150 ఆబ్జెక్టివ్ టైప్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. 3 గంటల పరీక్ష సమయంలో వీటికి ఓఎంఆర్ షీట్ మీద బ్లాక్ / బ్లూ బాల్ పాయింట్ పెన్‌తో సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 1 మార్కు కేటాయించారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు(30 మార్కులు), సంబంధిత విభాగం / సబ్జెక్టు నుంచి 100 ప్రశ్నలు (100 మార్కులు), ఆప్టిట్యూడ్ టెస్ట్ (రీడింగ్ & కాంప్రహెన్షన్, వెర్బల్ & నాన్ వెర్బల్ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ / క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్) నుంచి 20 ప్రశ్నలు (20 మార్కులు) ఇస్తారు. ప్రశ్నాపత్రం హిందీ & ఇంగ్లీషు మాధ్యమాల్లో ఉంటుంది.
- రాత పరీక్ష కేంద్రాలు: మంగళూరు, బెంగళూరు, ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 24
- దరఖాస్తు ఫీజు: రూ.750
- వెబ్‌సైట్: http://mrpl.co.in/careers

ఐఐఆర్‌ఆర్‌లో రీసెర్చ్ ఫెలోలు

ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్‌ఆర్) - తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- మొత్తం ఖాళీలు: 22
- పోస్టులు: సీనియర్ రీసెర్చ్ ఫెలో 3, జూనియర్ రీసెర్చ్ ఫెలో 1, గ్రేడ్ 2 యంగ్ ప్రొఫెషనల్స్ 5, గ్రేడ్ 1 యంగ్ ప్రొఫెషనల్స్ 2, ఫీల్డ్/ ల్యాబ్ అసిస్టెంట్ 1, ఆఫీస్ అసిస్టెంట్ 1, టెక్నికల్ అసిస్టెంట్ 4, ప్రాజెక్ట్ అసిస్టెంట్ 2, టెక్నికల్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ 1, ఫీల్డ్ వర్కర్/ హెల్పర్ 2
- వయసు: యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి. మిగిలిన పోస్టులకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో పీజీ / డిగ్రీ / పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- ఇంటర్వ్యూ: టెక్నికల్ అసిస్టెంట్‌కు మార్చి 12న, ఎస్ఆర్ఎఫ్‌లకు 13న, గ్రేడ్ 1 యంగ్ ప్రొఫెషనల్స్ & ఫీల్డ్ /ల్యాబ్ అసిస్టెంట్లకు 14న, ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు 15న, జెఆర్ఎఫ్ & ఫీల్డ్ వర్కర్/ హెల్పర్లకు 16న, గ్రేడ్ 2 యంగ్ ప్రొఫెషనల్స్‌కు మార్చి 17, 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- వేదిక: Indian Institute of Rice Research, Rajendranagar, Hyderabad
- వెబ్‌సైట్: www.icar-iirr.org

ఆంధ్రజ్యోతి
15 krushi@andhrajyothy.com
కృషి అగ్రి బిజినెస్
విజయవాడ • శుక్రవారం 23 ఫిబ్రవరి 2018



మర్రిచెట్టు ఒకప్పుడు మహావృక్షం. ఇప్పుడది చిన్న ట్రేలో ఒదిగిపోయింది. రెండడుగుల మామిడి, దానిమ్మ, నిమ్మ, సపోటా చెట్లు విరగకాస్తూ మనకు సవాలు విసురుతూ వుంటాయి. ఆ మొక్కలను నాటి ఏళ్లు గడిచినా ఒకటి రెండు అడుగుల ఎత్తుకు మించకుండా ఇంటి అందాలను పదింతలు చేస్తూ వుంటాయి. ఆ మరుగుజ్జు మొక్కల విశేషాలు చూద్దాం రండి.

మరుగుజ్జు మహావృక్షాలు!

500 రకాల బోన్సాయ్‌లు

నగరాలు, పట్టణాల్లో పెద్ద చెట్లు పెంచుకునే అవకాశం తక్కువ. అందుకే బోన్సాయ్ వృక్షాల పెంపకం పట్ల ఆసక్తి పెరుగుతోంది. మూడు దశాబ్దాలుగా బోన్సాయ్ నర్సరీ నిర్వహిస్తున్నా. మా దగ్గర 500 రకాల బోన్సాయ్‌లు వున్నాయి. మా శ్రీ బోన్సాయ్‌కు జాతీయ స్థాయిలో బెస్ట్ బోన్సాయ్ అవార్డు కూడా దక్కింది. వరల్డ్ బోన్సాయ్ కాంటెస్ట్‌లో మా బోన్సాయ్ నర్సరీలోని 20 సంవత్సరాల బోన్సాయ్ చింతచెట్టుకు ప్రథమ బహుమతి లభించింది. ఆ మొక్కను రూ. 13 లక్షలకు విక్రయించా. బోన్సాయ్‌పై విద్యార్థులు, మొక్కల ప్రేమికుల్లో అవగాహన పెంపొందిస్తున్నాను. - గుత్తా లలితశ్రీ



చిటికెన వేలంత వుండే మర్రిచెట్టు, అడుగు ఎత్తులో వుండి రంగుల పూలను పరిచే మొక్కలు, రెండు అడుగుల ఎత్తులో వుండే నోరూరించే పండ్లు అందించే మామిడి, సపోటా, బొప్పాయి చెట్లు చూస్తే ఆశ్చర్యం కలుగకమానదు. ఈ మరుగుజ్జు మొక్కలు.. బోన్సాయ్ మొక్కలకు ఈ కాలంలో ఎంతో క్రేజ్ వుంది. బోన్సాయ్ మొక్కలు లేని ఎగువ మధ్యతరగతి, సంపన్నుల గృహాలు, కార్యాలయాలు వుండవంటే ఆశ్చర్యం లేదు. ఏళ్లతరబడి ఒకే ఆకారంలో వుంటూ పూలు, పండ్లు కాసే మొక్కలు చూస్తే మనసు మురిసిపోవడం ఖాయం. అందుకే బోన్సాయ్ మొక్కలకు అంతటి ఆదరణ. కుండీల్లో పెరిగే మహావృక్షాలే బోన్సాయ్ చెట్లు. బోన్సాయ్ అనేది 2500 ఏళ్ల నాటి జపాన్ కళ. క్రమంగా అది ప్రపంచం అంతటా విస్తరించింది.

గృహ శోభ

చిట్టి పూలచెట్టు

బోన్సాయ్‌లో ఎన్నో రకాలు

బోన్సాయ్ మొక్కలు ప్రధానంగా ఆరు రకాలు. కాండం నిటారుగా వుండే ఫార్మల్ అప్‌రైట్, కాండం కొంచెం ఒరిగి పెరిగే ఇన్ ఫార్మల్ అప్‌రైట్, కాండం గుబురుగా పెరిగే బ్రూమ్ స్టయిల్, కాండం 45 డిగ్రీల్లో పెరిగే స్లాంటింగ్ స్టయిల్, ఒకే కాండానికి నాలుగైదు మొదళ్లు వచ్చే మల్టీ ట్రంక్ స్టయల్, కాండం వాలిపోయినట్లు వుండే క్యాసికెట్ స్టయిల్ బోన్సాయ్ రకాలు ప్రధానమైనవి. బోన్సాయ్ మొక్కలు వేరువేరు సైజుల్లో వుంటాయి. కొన్ని మొక్కలు 6 నుంచి 12 అంగుళాల ఎత్తు మాత్రమే పెరుగుతాయి. మరికొన్ని బోన్సాయ్‌లు 12 నుంచి 24 అంగుళాల ఎత్తు పెరుగుతాయి. లార్డ్ బోన్సాయ్‌లు రెండడుగుల ఎత్తు పెరుగుతాయి. థంబ్ బోన్సాయ్ లేదా మ్యామీ బోన్సాయ్ కేవలం 2 నుంచి 4 అంగుళాల ఎత్తులో మాత్రమే పెరుగుతుంది.

వేళ్లను బట్టి వయసు..

బోన్సాయ్ మొక్కల్ని కుండీల్లో 60 శాతం సేంద్రియ ఎరువు, 20 శాతం ఎర్ర మట్టి, 20 శాతం ఇసుక వేసి పెంచుతారు. బోన్సాయ్ మొక్కల్ని ఒక సిరమిక్ కుండీలలో మనకు కావల్సిన పలు రకాల ఆకారాల్లో పెంచుకోవచ్చు. బోన్సాయ్ మొక్కల వేళ్లని బట్టి వాటి వయస్సును నిర్ధారించవచ్చు. బోన్సాయ్ మొక్కలు 500 నుంచి లక్ష రూపాయలకు పైగా ధర పలుకుతాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, హైదరాబాద్ సిటీ





13 ఏళ్ల చింతచెట్టు







పూల సాగు... అది కూడా ఖర్చుతో కూడుకున్న పాలీహౌస్‌లో తెల్ల చేమంతుల సాగు చేపట్టారు తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం జె.కొత్తూరుకు చెందిన బి. మీనాక్షి. భర్త శ్రీనివాస్ సహకారంతో ఉద్యానవన శాఖ సబ్సిడీని ఉపయోగించుకుంటూ, సోలార్ పంపుసెట్ల ద్వారా నిరంతరం నీటి యాజమాన్యం చేపడుతూ వసతి పొందుతూ తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం దిశగా పయనిస్తున్నారు.

పాలీహౌస్‌లో సుమరాగం!

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం దిశగా మహిళారైతు

ఇతర ప్రాంతాల్లో రైతులు పాలీహౌస్ సేద్యం చేయడాన్ని గమనించి, ఆ తరహా సేద్యం గురించి ఆరా తీశారు జగ్గంపేట మండలం జె. కొత్తూరుకు చెందిన రైతు దంపతులు మీనాక్షి, శ్రీనివాస్. పాలీహౌస్‌లో తెల్ల చేమంతి పూల సాగు చేపడితే ఎలా వుంటుందని ఆలోచించారు. శుభకార్యాల సమయంలో స్టేజీ డెకరేషన్‌కు ఉపయోగించే తెల్ల చేమంతుల సాగు లాభదాయకంగా భావించారు. ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించారు. వారి సహకారంతో రెండు వేల చదరపు గజాల భూమిలో పాలీహౌస్ నిర్మించుకున్నారు. రెండు నెలల క్రితం పూణె నుంచి మొక్కలు తీసుకువచ్చి సాగు ప్రారంభించారు. పూల సాగుకు ఎటువంటి ఆటంకం కలగకుండా నీటి యాజమాన్యం కోసం సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకున్నారు. తద్వారా నిరంతరం పూల మొక్కలకు నీరందించగలుగుతున్నారు. జగ్గంపేటకు చెందిన హార్టికల్చర్ అధికారుల సూచనల మేరకు సాగు మెళకువలు తెలుసుకుంటూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. బెంగళూరు తదితర ప్రాంతాల్లో మాత్రమే పండించే చామంతి పూలను మెట్టలో విజయవంతంగా సాగు చేయడం ఈ రైతుల ప్రత్యేకత.

15 టన్నుల దాకా దిగుబడి

ఎకరంలో పాలీహౌస్ నిర్మాణానికి రూ.36 లక్షల ఖర్చవుతుంది. నారు, మందులు, నీటి వసతి ఏర్పాటుకు మరో రూ.8లక్షలు ఖర్చవుతుంది. మొత్తం ఖర్చులో 50 శాతం ఉద్యానవన శాఖ సబ్సిడీగా అందిస్తుంది. ఎప్పటికప్పుడు ఉద్యానవన శాఖ అధికారులు సాగును పరిశీలించి తగిన సూచనలు ఇస్తున్నారు. ఏడాదిలో పది నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం వుంది. రెండు నెలల క్రితం నారు వేయగా ఇప్పటికే పంట చేతికి వచ్చింది. మొదటి కోతలో టన్ను పూలు వచ్చాయని, ఈ దశలో మరో రెండు మూడు టన్నుల పూలు వస్తాయని వారు చెప్పారు. నాలుగు దఫాలుగా పంట చేతికి వస్తుంది. మొత్తం 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందని ఆ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో పూలు 120 నుంచి 150 రూపాయల వరకు ధర పలుకుతున్నది. పెళ్లిళ్ల సీజన్ రానున్నది కాబట్టి పూలకు మరింత ధర వస్తుందని మహిళా రైతు మీనాక్షి తెలిపారు. మొదటి పంటను కాకినాడ, కడియం పూలమార్కెట్‌లో విక్రయించామని ఆ రైతులు చెప్పారు.

విజయగాథ



పాలీహౌస్‌లో వీరు చేపట్టిన సాగు విధానాలను చుట్టుపక్కల రైతులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. వీరి బాటలో నడిచేందుకు పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. రక్షిత వాతావరణంలో సాగుచేయడంతో చీడపీడల బెడద తక్కువగా వుంటున్నది. సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల నీటి వసతికి ఢోకాలేదు. దిగుబడి ఖర్చులు తగ్గడం వల్ల లాభాలు అధికంగా వచ్చే అవకాశం వుండటం రైతుల్లో ఆసక్తిరేపుతున్నది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధులు, జగ్గంపేట, జగ్గంపేట రూరల్

మరిన్ని వినూత్న పంటలు



గత నవంబర్‌లో చేమంతి నారు పోశాం. జనవరి నెలలో మొదటి కోత కోశాం. మూడు టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం పూలకు గిరాకీ తక్కువగా వుంది. పెళ్లిళ్ల సీజన్ వస్తుంది కాబట్టి ధరలు తప్పక పెరుగుతాయి. లాభాలూ వస్తాయి. పూలసాగుతో పాటు మరిన్ని వినూత్న పంటలు సాగు చేయాలనుకుంటున్నాం. - మీనాక్షి, మహిళా రైతు

పాలీహౌస్‌తో లాభాలు



పాలీహౌస్ నిర్మాణానికి రూ.35 లక్షలు ఖర్చవుతుంది. అందులో 50 శాతం ఉద్యానవనశాఖ సబ్సిడీ ఇస్తుంది. అంటే రైతు రూ.18లక్షలు పెట్టుబడి పెడితే సరిపోతుంది. పాలీహౌస్ విధానంలో సాగు చేస్తే రైతులు లాభాలు ఆర్జించవచ్చు.

- శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి, జగ్గంపేట

సంప్రదాయం + ఆధునికం = అద్భుతం

నత్తలు, మిత్ర పురుగులు, వానపాముల వంటివి పంటకు ప్రాణాధారం. వాటిని వదిలేసి నేలతల్లికి, పర్యావరణానికి హాని చేసే ఎరువులు, పురుగుల మందులు రాజ్యమేలుతున్న కాలంలో ప్రకృతి వ్యవసాయాన్ని నమ్ముకుని రాణిస్తున్నారు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లికి చెందిన పిచ్చికల సాయి.

తనకున్న 18 ఎకరాల సాగు భూమిలో 4 ఎకరాల్లో వరి పండిస్తున్నాడు సాయి. మిగిలిన 14 ఎకరాల్లో ప్రకృతి సిద్ధమైన ఎరువులనే ఉపయోగిస్తూ పామాయిల్, ఖోఖో, ఫైనాపిల్ పంటలు సాగు చేస్తున్నాడు. ప్రకృతి సహజమైన ఎరువులు, రసాయనాలు వాడుతున్నప్పటికీ ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడం ఆ రైతు ప్రత్యేకత. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని ఉపయోగించుకుని 12 లక్షలతో ఆధునిక పరికరాలు కొనుగోలు చేశారు. వాటి సాయంతో సంప్రదాయ, అధునాతన పద్ధతుల మేళవింపుతో సాగుచేసి, సాటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు రైతు సాయి.

సొంతగా సేంద్రియ ఎరువులు

మిగిలిన రైతులంతా నడిచే దారిలో కాకుండా భిన్నమైన మార్గం ఎంచుకున్నారు ఈ రైతు. రెండేళ్లుగా సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. అయిదేళ్లుగా పామాయిల్, ఖోఖో తోటల్లో ఇదే పద్ధతిలో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. తనకున్న మూడు ఆవులు, ఆరు గేదెల నుంచి వచ్చే పేడ, మూత్రం, ఇవికాకుండా సహజసిద్ధంగా లభించే వేప, తదితరాలను ఎరువులుగా మలుచుకుంటున్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు సేంద్రియ ఎరువులను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. తన కోసమే కాకుండా ఆసక్తి వున్న రైతులకు సేంద్రియ ఎరువులు అందించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు ఈ రైతు.

సేంద్రియ పంటకు భలే ధర

గత సార్వాలో మిగిలిన రైతులు 30 బస్తాల ధాన్యం దిగుబడి సాధించారు. సాయి మాత్రం 18 బస్తాలనే పండించారు. మిగిలిన రైతులకు బస్తాకు వెయ్యి రూపాయలు వస్తే సేంద్రియ పద్ధతుల్లో పండించిన ధాన్యానికి బస్తాకు 2500 రూపాయల వరకు వచ్చింది. దీంతో మిగిలిన రైతుల కంటే అధిక ఆదాయం పొందానన్నారు సాయి. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం కొంత శ్రమతో కూడుకున్నదే. అయితే పొలానికి, పర్యావరణానికి మేలు చేసే సాగు పద్ధతులు పాటిస్తున్నాననే సంతృప్తి ముందు ఆ శ్రమ దిగదుడుపే. మిగిలిన పొలాల్లో ఎక్కడా కనిపించని నత్తలు, వానపాములు, మిత్ర పురుగులు, పిచ్చుకలు నా పొలంలో కనిపించడం ఆనందంగా వుందన్నారు ఆ రైతు. సొంతంగా తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులు చల్లేందుకు ప్రత్యకంగా ఒక వాహనాన్ని కూడా సిద్ధం చేసుకున్నారాయన. సుదీర్ఘకాలంగా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న ఈ రైతు 2013, 2015లో రెండుసార్లు జిల్లా ఉత్తమ రైతు అవార్డులు అందుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, తాడేపల్లిగూడెం అగ్రికల్చర్



వైవిధ్యం



ఈ ఆరింటితో అరుదైన ఫలితాలు

బ్రహ్మాస్త్రం, పంచగవ్య, అగ్నిఅస్త్రం, నీమాస్త్రం, పంచపత్ర కషాయం, మారేడుపత్ర కషాయాలతో పంటలను, నేలను పదిలంగా కాపాడుకోవచ్చు. బ్రహ్మాస్త్రంతో పురుగుల నివారణ జరుగుతుంది. పంచగవ్య మొక్క పెరుగుదలే కాకుండా చీడపీడలను నివారిస్తుంది. నారుమడులకు శ్రేయస్కరం. అగ్ని అస్త్రంతో అన్ని రకాల కాయతొలుచు పురుగులు, కాండం, తొలుచు పురుగులను నివారించవచ్చు. నీమాస్త్రం అన్ని రకాల పురుగుల గుడ్లను చంపుతుంది. రసం పీల్చే పురుగులను చిన్న గొంగళి పురుగులను నివారిస్తుంది. తెగుళ్లకు ఉపయోగపడుతుంది. పంచపత్ర కషాయం రసం పీల్చే పురుగులు, చిన్న లార్వాలు, లద్దె పురుగులు, శనగపచ్చ పురుగు, కాయ తొలుచు పురుగు, ఆకుముడత, ఆకులు తినే మిడతలను సమర్థవంతంగా నిరోధిస్తుంది. మారేడు పత్ర కషాయంతో వరిలో అగ్గితెగులు, మెడవిరుపు తెగులు నివారించవచ్చు.

- సాయి, సేంద్రియ రైతు, చినతాడేపల్లి

పంట విక్రయాల వేదిక


మైఫార్మర్ యాప్

టెక్నాలజీ

ఆయన 17 ఏళ్లుగా ఐర్లాండ్‌లో ఐటి ఉద్యోగం చేసుకుంటున్నారు. తండ్రి స్వగ్రామంలో సేద్యం చేసుకుంటున్నారు. పంట పండించేందుకు, పండించిన పంటను అమ్ముకునేందుకు తండ్రితో పాటు రైతులు పడుతున్న అవస్థలను గమనించి ఒక యాప్ రూపొందించారు చిత్తూరు జిల్లా శ్రీ బొమ్మరాజుపురానికి చెందిన కుమార్‌వర్మ.

రైతన్నలు స్వేదం చిందించి సేద్యం చేస్తే వారికి దక్కుతున్న ప్రతిఫలం నామమాత్రం. విత్తన సేకరణ నుంచి పండించిన పంటను అమ్ముకునేంత వరకు రైతు అడుగడుగునా మోసపోతున్నాడు. ఈ పరిస్థితి గురించి తెలుసుకుని చలించిపోయాడు ఐర్లాండ్‌లో ఐటి ఉద్యోగం చేసుకుంటున్న కుమార్ వర్మ. రైతులు ఎందుకు నష్టపోతున్నారు? ఎలా మోసపోతున్నారని అధ్యయనం చేశారు. రైతులు పండించిన పంటలు వినియోగదారులకు చేరేలోగా దళారులు చేతివాటం చూపడాన్ని గ్రహించారు. ప్రభుత్వ పథకాల గురించి తెలియక రైతులు నష్టపోతున్నారని అర్థం చేసుకున్నారు. విత్తనాల సేకరణ మొదలుకుని పండించిన పంటలను విక్రయించేంత వరకు అన్ని సందర్భాల్లో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు వీలుగా ఎంతో శ్రమించి 'మైఫార్మర్' అనే యాప్‌ను సిద్ధం చేశారు కుమార్ వర్మ. పోస్టింగ్‌లు.. మెసేజ్‌లు ఆండ్రాయిడ్ ఫోన్ వున్నవారు ఈ యాప్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారులు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. రైతులు తాము పండించిన పంట, ధర వివరాలు ఈ యాప్‌లో పోస్ట్ చేస్తే ఆసక్తి వున్న వినియోగదారులు, వ్యాపారులు ఆ రైతుని నేరుగా సంప్రదించి పంటను కొనుగోలు చేసే వీలుంటుంది. దీనివల్ల రైతుకు అధిక ధర లభిస్తుంది. దళారీల ప్రమేయం తగ్గడంతో వినియోగదారుడికి కూడా లాభం చేకూరుతుంది. అదేవిధంగా ప్రభుత్వ పథకాల వివరాలన్నీ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రైతులకు మేలు చేసే ప్రభుత్వ సంస్థల సమాచారాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. రైతులకు ఎంతో మేలు చేసే ఈ యాప్‌ను ఈ యూఆర్‌ఎల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. https://play.google.com/store/apps/ details?id=com.puramtech.myfarmer ఈ యాప్‌ను యూట్యూబ్‌లో కూడా అప్‌లోడ్ చేశారు. ఈ యాప్‌ను సంక్రాంతికి స్వగ్రామం వచ్చిన సందర్భంగా రైతుల సమక్షంలో ఆవిష్కరించామన్నారు కుమార్ వర్మ. రైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకుని, ఆదాయాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే గ్రామసీమలు కళకళలాడతాయన్నారు కుమార్ వర్మ. -కృషి డెస్క్





ధాన్యాల నిల్వ.. తస్మాత్ జాగ్రత్త!

ఆహార ధాన్యాలు పండించడం ఒక ఎత్తైతే వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేయడం మరో ఎత్తు. క్రిమికీటకాలు, రసాయనాల నుంచి వాటిని కాపాడటంతో పాటు రుచి, నాణ్యత కోల్పోకుండా ఎక్కువ కాలం నిల్వ చేయడం రైతుకు సవాలుగా మారుతోంది. శాస్త్రీయ పద్ధతుల్లో నిల్వ చేసినప్పుడే రైతుల కష్టానికి ఫలితం వుంటుందంటున్నారు నిపుణులు.

సమాచారం



సాధారణంగా ఆహార ధాన్యాలను శిలీంధ్రాలు, క్రిమికీటకాలు, ఎలుకలు, పక్షులు ఆశించడం వల్ల కలిగే ప్రత్యక్ష నష్టాలే కాకుండా వాటి విసర్జకాలు, అవయవ భాగాలు, అఫ్లోటాక్సిన్స్ వల్ల ఉత్పత్తులు తినేందుకు వీలు లేకుండా తయారౌతున్నాయి. దేశంలో ఏటా 10శాతం పైగా అంటే 12-16 మిలియన్ టన్నుల ఆహారధాన్యాలు నష్టపోతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటి విలువ రూ.50వేల కోట్ల పైమాటే. నిల్వ సామర్థ్యాలు సరిలేక ఆంధ్రప్రదేశ్‌లో 30 శాతం ఉత్పత్తి వృధా అవుతున్నట్లు మార్కెటింగ్ అధికారులు ఇటీవల అంచనా వేశారు.

ధాన్యాన్ని ఆశించే కీటకాలు రెండు రకాలు - గింజల లోపలి నుంచి తినేవి, బయటి నుంచి తినేవి. వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలను ఆశించే ముక్కపురుగు, నుసిపురుగు, అపరాలను ఆశించే పుచ్చుపురుగు, వేరుశనగ పుచ్చుపురుగు వంటివి మొదటి కోవకు చెందుతాయి. వీటిని పొగాకు పెంకు పురుగుగా పరిగణిస్తారు. బియ్యానికి తుట్టు పురుగు, పసుపు, ఇతర పిండి పదార్థాలను కొన్ని పురుగులు బయటి నుంచి ఆశిస్తాయి. నార గోతాల ద్వారా ఇవి వ్యాప్తిచెందుతాయి. 1-2 శాతం ఉండే క్షేత్రస్థాయి పురుగు 6-8 నెలల్లో అపరాలను 80 శాతం పూర్తి స్థాయిలో నష్టపరుస్తాయి.

పంట కోసిన తర్వాత ధాన్యాన్ని ఎండలో బాగా ఆరబెట్టి నిల్వ ఉంచితే పురుగు పట్టకుండా 6-12 నెలల దాకా కాపాడవచ్చని బాపట్ల పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఉదాహరణకు వరిలో 11-12 శాతం, అపరాల్లో 10 శాతం, నూనెగింజల్లో 7-8 శాతం తేమ ఉండేటట్లు చూడాలి. ఆహార పదార్థాలపై రసాయన కీటక నాశనులను వాడలేని పరిస్థితి వల్ల వాటిని ఆశించే కీటకాలను నియంత్రించటానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. వృక్ష సంబంధిత పదార్థాలైన వేపాకు, వేప నూనె, వేప గింజల పొడి, వసకొమ్ముల పొడి(2శాతం) లేదా నూరిన వెల్లుల్లి, ఉసిరికాయల గింజలు, సీతాఫలం గింజల పొడి(1-2 శాతం) ధాన్యంలో కలిపి 6 నుంచి 8నెలల వరకు పురుగుల ద్వారా నష్టం జరగకుండా కాపాడవచ్చు. ఇవేకాకుండా కసవింద, ఉత్తరేణి, కుక్కమిరప, నేల ఉమ్మెత్త, కీసర చెట్టు ఆకులు(4 శాతం) వాడితే ధాన్యాన్ని మూడు నెలల వరకు పురుగు పట్టకుండా చేసుకోవచ్చు. నిల్వ ధాన్యంలో బంక మన్ను, సముద్రపు నాచు పొడి, ఇసుక, వరి పొట్టు నుంచి వచ్చిన బూడిద వంటివి కలుపుకుని, పురుగు పట్టకుండా కాపాడుకోవచ్చు. అయితే అతి సూక్ష్మ కణాలైన ఈ పదార్థాలు ఊపిరితిత్తుల్లోకి చేరకుండా జాగ్రత్త పడాలి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, అమరావతి



విన్నపం

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ నెల ప్రారంభంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఒక ప్రతిపాదన చేశారు. వ్యవసాయానికి అయిన ఖర్చుకి 150% కనీస మద్దతు ధరగా నిర్ణయించాలన్నారు. ఆయా రాష్ట్రాలు, ఆయా ప్రాంతాలలోని వివిధ నిర్ధారిత పంటల సాగుబడికి అయ్యే ఖర్చుని వివిధ గణాంక పద్ధతుల ద్వారా మదింపు చేయించి భారత ప్రభుత్వంలోని కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్ (CACP) సంస్థకు పంపుతాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన డేటా ఆధారంగా CACP సంస్థ కనీస మద్దతు ధరను నిర్దేశించిన 30 వ్యవసాయ పంటలకు స్థిరపరుస్తుంది. 30 రకాల పంటలకు ఈ సంస్థ కనీస మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వ్యవసాయ శాఖ, చెరకు బోర్డు ఇత్యాది వ్యవస్థలు సహకరిస్తాయి. అయితే ప్రభుత్వం వారు ఇచ్చే మద్దతు ధర రైతులకు ఏ మాత్రం అక్కరకు రావడం లేదు. ఏ వస్తువుల ఉత్పత్తికి ఎంత ఖర్చువుతుందని సాధికారికంగా చెప్పగలిగే సంస్థ ఒకటి మనకి ఉన్నది. అది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా. పార్లమెంట్ ఆమోదించిన చట్టం ద్వారా 1959లో ఏర్పాటైన ఈ సంస్థ 70 ఏళ్లుగా దేశంలోని అనేక వ్యాపార సంస్థలకు వారి వారి ఉత్పత్తులకు, సేవలకు అయ్యే ఖర్చుని మదింపు చేయటంలో, కంట్రోల్ చేయటంలోను తగిన సూచనలు ఇచ్చే సత్తా వున్న నిపుణులను మన దేశానికి అందిస్తున్నది. దేశానికి వెన్నెముక అయిన రైతును సంతోషంగా వుంచడంతో పాటు, వ్యవసాయ రంగం కళకళలాడేందుకు తోడ్పడే మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ సహకారం ఎందుకు తీసుకోకూడదు? వివిధ పంటలకు శాస్త్రీయంగా మద్దతు ధర నిర్ణయించే విషయంలో నైపుణ్యం వున్న సంస్థల సహకారం తీసుకున్నప్పుడే రైతులకు ప్రభుత్వం నుంచి నిజమైన మద్దతు లభిస్తుంది.

మద్దతు ధర మిధ్యేనా?

- డి. జితేందర్‌రావు, దక్షిణ భారత ప్రాంతీయ మండలి సభ్యుడు, ఐసిఎఐ



హైదరాబాద్‌లో పవన్‌తో సీపీఐ రామకృష్ణ భేటీ

గుంటూరు రౌండ్‌టేబుల్‌కు రండి

» పవన్‌కల్యాణ్‌కు సీపీఐ ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ భేటీ అయ్యారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. గుంటూరులో మార్చి 1న నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి రావాలని పవన్‌ను రామకృష్ణ ఆహ్వానించారు.

న్యాయవాదుల గృహ నిర్బంధం, అరెస్టులు



పోలీసులతో న్యాయవాదుల వాగ్వాదం

కర్నూలు(లీగల్)/అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో హైకోర్టును ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్న న్యాయవాదులను కర్నూలు పోలీసులు గృహనిర్బంధం చేశారు. మరికొందరిని ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం అనంతపురం జిల్లా పెనుకొండలో ముఖ్యమంత్రిని కలిసి రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వాలని న్యాయవాదులు నిర్ణయించారు. అయితే వారి ప్రయత్నాన్ని అడ్డుకునే వ్యూహంలో భాగంగా పోలీసులు ముందుగానే గృహనిర్బంధాలు, అరెస్టులు చేపట్టారు. పోలీసుల చర్యపై రాయలసీమ హైకోర్టు సాధన సమితి కో-కన్వీనర్ నాగలక్ష్మీదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా.. న్యాయవాదుల అరెస్టులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండించారు.

నేడు బీజేపీ సీమ డిక్లరేషన్

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):రాయలసీమ అభివృద్ధిపై బీజేపీ డిక్లరేషన్‌ను శుక్రవారం కర్నూలులో ప్రకటిస్తామని ఆ పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి చెప్పారు. గురువారమిక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కర్నూలు సమావేశంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని, సీమ అభివృద్ధికి ఏం చేయాలో మేధోమధనం చేశాక డిక్లరేషన్ విడుదల చేస్తారని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా డిక్లరేషన్ ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విపక్షాల ట్రాప్‌లో పడకుండా ఉంటే మంచిదని వ్యాఖ్యానించారు.

తెర వెనుక

ఏం జరుగుతోంది?



» కేంద్రంపై బీజేపీ నేతల ఆశలు

» పెదవి విరుపుల్లో టీడీపీ నేతలు

» హోదాతోపాటు 19 అంశాల పరిష్కారానికి పట్టు

» హోదా డిమాండ్‌తో ఇరకాటంలో కమలనాథులు

» వ్యక్తిగత విమర్శలు వద్దని అధిష్ఠానం ఆదేశం

» టీడీపీకి తాము తప్ప గత్యంతరం లేదన్న... అభిప్రాయంలో కాషాయదళం

» ఎక్కువ ఎంపీ సీట్లు తెచ్చుకుంటే...మన మాటే చెల్లుతుందనే వ్యూహంలో తెలుగుదేశం

» ముందస్తు ఎన్నికలు వస్తాయని వైసీపీ అంచనా

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ..బీజేపీ పరస్పర విసుర్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం తెరముందు వేడెక్కినా...తెరవెనుక ఏం జరుగుతోందన్నది ఆసక్తికరంగా మారింది. సమస్య పరిష్కారానికి ఇంకా అవకాశం ఉందని రాష్ట్ర బీజేపీ వర్గాలు విశ్వసిస్తుండగా టీడీపీ వర్గాలు మాత్రం కేంద్రంలో సానుకూలత లేదన్నట్లుగా పెదవి విరుస్తున్నాయి. మార్చి ఐదో తేదీన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభం కానుండటంతో అప్పటివరకూ వేచి చూడాలన్న యోచనలో ఉన్నాయి. ఈలోపు కేంద్రం కొన్ని సానుకూల నిర్ణయాలతో ముందుకు వస్తుందని కమలనాథులు ఆశిస్తున్నారు. రాష్ట్ర బీజేపీ వర్గాల కథనం ప్రకారం తాజా పరిణామాలతో పార్టీ కేంద్ర నాయకత్వం ఇబ్బందికి గురైనా రాష్ట్రానికి సంబంధించి కొన్ని అంశాలనైనా పరిష్కరించాలన్న యోచనలో ఉంది. 'ప్రత్యేకహోదాకు బదులుగా ప్రత్యేక ఆర్థిక సాయం కింద లెక్కగట్టిన మొత్తాన్ని ఏదో ఒక సంస్థ ద్వారా రాష్ట్రానికి ఇప్పించాలని కేంద్రం అనుకొంటోంది. ఈ మొత్తాన్ని వినియోగించుకొనే సమయం 2020 మార్చితో ముగుస్తుంది. రాష్ట్రం కావాలనుకొంటే ఆ గడువును మరికొంత పొడిగించాలని కూడా అనుకొంటున్నారు. లోటు బడ్జెట్ లెక్కను రూ.7 వేల కోట్లకు పరిమితం చేసి, ఆ సమస్యను పరిష్కరించాలని చూస్తున్నారు. ఇలాగైతే రాష్ట్రానికి ఇంకా రూ.3 వేల కోట్లు ఇవ్వాల్సి వస్తుంది. రాష్ట్ర సరిహద్దుల వరకూ ఉన్న రైల్వే ప్రాంతాన్ని కలిపి ఒక జోన్‌గా చేసి రైల్వేజోన్ ప్రకటిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కోరుకొన్నచోట ఓడరేవును ప్రకటిస్తారు. కడప ఉక్కు ఫ్యాక్టరీకి కూడా తాజా నివేదికల్లో ఖనిజం అందుబాటులో ఉందని తేలినందువల్ల దానిని కూడా ప్రకటిస్తారు' అని రాష్ట్ర బీజేపీ ముఖ్యుడొకరు చెప్పారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభంలోపే వీటిని ప్రకటిస్తారని అన్నారు. తమకు పార్టీలో అంతర్గతంగా ఉన్న సమాచారాన్ని బట్టి కేంద్ర జలవనరులు, ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెలాఖరులోపు విశాఖకు వచ్చి కొన్ని సానుకూల ప్రకటనలు చేస్తారని, పోలవరం నిర్మాణానికి అవసరమైన సాయం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతారని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అన్నీ సానుకూలంగా పరిష్కారమైతే ప్రధానమంత్రి మోదీ కూడా రాష్ట్ర పర్యటనకు రావాలని అనుకొంటున్నారని, ఆ అవకాశాన్ని కొట్టివేయలేమని వారంటున్నారు.

స్పష్టమైన వైఖరిలో టీడీపీ

తమకు ఏం కావాలన్నదానిపై టీడీపీ ఇప్పుడు స్పష్టతతో ముందుకు వచ్చింది. ప్రత్యేకహోదా ఒక్కదానినే తాము కోరడం లేదని, విభజన చట్టంలో రాష్ట్రానికి వాగ్దానం చేసిన 19 అంశాలను పరిపూర్ణంగా అమలు చేయాల్సిందేనని టీడీపీ డిమాండ్ చేస్తోంది. ఇందులో రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, ఓడ రేవు, పారిశ్రామిక కారిడార్, పోలవరం తదితర అంశాలు ఉన్నాయి. ఇవన్నీ అమలు జరిగితేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆ పార్టీ వాదించదల్చుకొంది. తమ రాజకీయ వైఖరి విషయంలో కూడా ఒక స్పష్టతకు వచ్చే ప్రయత్నంలో ఆ పార్టీ ఉంది. ఇప్పుడు కేంద్రం సానుకూలంగా స్పందించకపోతే భవిష్యత్తులో తాము ఏం చేయాలన్నదానిపై ఆ పార్టీ అంతర్గతంగా చర్చిస్తోంది. 'రేపు మేం ఎవరితో కలుస్తామన్నది ముఖ్యం కాదు. ప్రజలు మాకు 25 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో ఎవరు ఉన్నా రాష్ట్రానికి రావాల్సినవన్నీ సాధించి తెస్తాం. ఇప్పుడున్నట్లుగా రేపు ఒకే పార్టీకి కేంద్రంలో సొంత ఆధిక్యం ఉండకపోవచ్చు. అప్పుడు ఎక్కువ మంది ఎంపీల బలం ఉన్న పార్టీల మాట అక్కడ చెల్లుతుంది. టీడీపీకి ప్రజలు ఆ బలం ఇచ్చి పంపితే సాధించి తెస్తాం. మిగిలిన పార్టీల మాదిరిగా మాకు కేసుల రాయబారాలు లేవు. మా బలం అంతా రాష్ట్రానికి న్యాయం చేయడానికే పనికి వస్తుంది' అన్నది ఆ పార్టీ నిర్ణయించుకొన్న వైఖరి. కేంద్రం చూపుతున్న వివక్షపై టీడీపీ వేడి పెంచుతుండటాన్ని ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నిశితంగా గమనిస్తోంది. ప్రజల్లో ఈ వేడి ఉన్నప్పుడే ఎన్నికలు జరిగితే లాభపడుతామన్న అభిప్రాయంతో టీడీపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పాదయాత్రలో ఉన్న ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ వైసీపీ నేతలతో ఈ విషయం చెప్పినట్లు సమాచారం. 'సమయం తక్కువ ఉంది. టీడీపీ ముందస్తు ఎన్నికలకు వెళ్లే వాతావరణం కనిపిస్తోంది. ఈ సమయంలో ఇన్‌చార్జులను, అభ్యర్థులను మార్చుకొంటూ వెళ్లలేను. ఉన్నవారితో పనిచేయండి. మీకేదైనా ఇబ్బంది ఉంటే ఆ తర్వాత నేను చూసుకొంటాను' అని ఒక నియోజకవర్గ నేతలతో పేర్కొన్నట్లు సమాచారం.

పెద్దగా ఆశల్లేని 'దేశం'

తెలుగుదేశం పార్టీ వర్గాల్లో కేంద్ర సాయంపై పెద్దగా ఆశాభావం వ్యక్తం కావడం లేదు. కేంద్రంలో సానుకూల స్పందన లేదని వారంటున్నారు. పార్లమెంటు సమావేశాలు జరిగే సమయంలో ఉభయ ప్రభుత్వాల మధ్య అధికారుల స్థాయిలో చర్చలు జరిగి కొంత కదలిక కనిపించినా ఆ తర్వాత మళ్లీ ఆగిపోయాయని, పరస్పర చర్చలు జరగకుండా సమస్యల పరిష్కారం అయిపోతుందని అనుకోవడం ఎలా సాధ్యమని వారంటున్నారు. కేంద్రం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని... దీనివల్ల రాష్ట్రం నష్టపోతుందన్న అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడానికి ప్రస్తుతం టీడీపీ నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో ఈ అంశంపై మిగిలిన పార్టీల వ్యూహాలను అంచనా వేసుకొని తమ వ్యూహాలకు పదును పెట్టుకొంటున్నారు. తాజాగా ప్రత్యేకహోదా అంశాన్ని తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబు మళ్లీ తెరపైకి తెచ్చారు. ఏ రాష్ట్రానికీ ఇకపై దీనిని ఇవ్వడం లేదని కేంద్రం గట్టిగా చెప్పడంవల్ల గతంలో ప్రత్యామ్నాయంతో సరిపెట్టుకొన్నామని, ఇప్పుడు మళ్లీ కొన్ని ఈశాన్య రాష్ట్రాలకు పొడిగిసున్నారని సమాచారం వస్తోందని...అలా ఎవరికైనా ఇస్తే తమకూ ఇవ్వాల్సిందేనని గట్టిగా వాదిస్తున్నారు. హోదా అంశాన్ని టీడీపీ స్వయంగా చేపట్టడంతో బీజేపీ ఇరకాటంలో పడుతోంది. ఏదైనా రాష్ట్రానికి హోదాను పొడిగిస్తే ఏపీకి ఇవ్వాల్సిందేనని, అప్పుడు గత్యంతరం ఉండబోదని బీజేపీ ముఖ్యుడొకరు అంగీకరించారు. కానీ, ఆ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే పొడిగింపు ఇస్తున్నారని అన్నారు.

రాయలసీమలో అమిత్ షా సభ!

రాజకీయంగా తమ వాదనను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి పార్టీపరంగా ఒక వ్యూహాన్ని అమలు చేయాలని రాష్ట్ర బీజేపీ నేతలకు కేంద్ర నాయకత్వం సూచించింది. అన్ని జిల్లాలు, ప్రధాన నగరాలకు వెళ్లి రాష్ట్రానికి ఇప్పటివరకూ ఇచ్చిన నిధులు, పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది. రాయలసీమలో పార్టీపరంగా ఒక సభ పెడితే తాను వచ్చి పాల్గొంటానని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా సూచించారు. రెండు వారాల క్రితం ఇచ్చిన సూచనల్లో టీడీపీపై గట్టిగా దాడి చేయాలన్న జాతీయ నాయకత్వం.. కొద్దిరోజుల క్రితం మాత్రం సంయమనం పాటించాలని సూచించింది. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయవద్దని, రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏం సాయం అందిందో మాత్రమే చెప్పాలని ఆదేశించింది. టీడీపీ ఏం చేసినా బీజేపీ నుంచి దూరం కావడం అసాధ్యమని పార్టీ కేంద్ర నాయకత్వం అనుకొంటున్నట్లు ఆ పార్టీ ముఖ్యుడొకరు వెల్లడించారు. 'జాతీయ స్థాయిలో రెండే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీతో టీడీపీ ఏనాటికీ కలవలేదు. బీజేపీతో కలిసి ఉండటం తప్ప మరో మార్గం లేదు. మనం రాష్ట్రానికి ఇచ్చిన సాయంతో సంతృప్తి పడకపోయినా వేరే మార్గం లేదని కేంద్రంలో మా నాయకులు భావిస్తున్నారు' అని వివరించారు. కేంద్రం ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోందని, జీఎస్టీ అమలు తర్వాత ఆదాయం బాగా తగ్గిపోయిందని, ఈ పరిస్థితుల్లో ఉదారంగా సాయం చేసే స్థితి కనిపించడం లేదని తెలిపారు.



సోలార్ కార్ నడుపుతున్న సీఎం చంద్రబాబు

న్యాయం కావాలి

(మూడో పేజీ తరువాయి)

ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రం ఇప్పుడిప్పుడే నిలదొక్కుకునే పరిస్థితికి వస్తోంది. తలసరి ఆదాయం దక్షిణాది రాష్ట్రాల కంటే తక్కువగా ఉంది. మేం కష్టపడతాం. ఆదుకోవలసిన బాధ్యత కేంద్రంపై ఉంది. న్యాయం చేయండి. అందరితో సమానంగా పైకి వచ్చేవరకు మా హక్కులు మాకు కల్పించండి. ప్రత్యేక హోదా, హామీల అమలు సాధన మా హక్కు. దానిని గౌరవించండి. మన హక్కుల కోసం కేంద్రాన్ని గట్టిగా అడగాలా.. వద్దా? హక్కులు దక్కేదాకా పోరాడాలా.. వద్దా' అని సభాముఖంగా ప్రజల్ని అడిగారు. పోరాడాలంటూ జనం ఈ సందర్భంగా నినదించారు. విభజన హామీలను, ప్రత్యేక ప్యాకేజీని అమలు చేయాలని కోరుతూ తాను ఢిల్లీకి 29 సార్లు వెళ్లి చర్చించానని గుర్తుచేశారు. కేంద్రం హామీ ఇచ్చిన ప్రకారం సహకరించి ఉంటే.. రెవెన్యూలోటు భర్తీ, ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే రాష్ట్రం ఇప్పుడు ఇంకా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. అయినా సరే తన ప్రయత్నాలతో రాష్ట్రానికి కియ లాంటి భారీ పరిశ్రమలను తీసుకొచ్చానని చెప్పారు. 2014 నాటికంటే మన పరిస్థితి మెరుగుపడిందని.. ఇందుకు తాను రేయింబవళ్లు కష్టపడుతుండడం, అధికారులు, ప్రజలు సహకరిస్తుండడమే కారణమన్నారు. కేంద్రం సహకరించకున్నా సంక్షేమ పథకాలను ఆపేది లేదన్నారు. తెలుగుదేశం తెలుగువారి ఆత్మగౌరవం కోసం పెట్టిన పార్టీ అని, ఆత్మగౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. రాష్ట్రానికి నష్టం లేకుండా ప్రతిష్ఠ పెంచేందుకు ఎవరు కృషి చేసినా స్వాగతిస్తామన్నారు.

కేంద్రాన్ని అడగకుండా..

'రాష్ట్రంలో కొన్ని పార్టీలున్నాయి. ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్రాన్ని అడుగరు. నన్ను తిడతారు. ఎక్కడ ఏం మాట్లాడాలో తెలియకుండా.. నన్ను తిడితే వీళ్లకు ఓట్లు పడతాయని.. నిద్ర లేచినప్పటి నుంచి నన్ను తిట్టడమే. ఓ పేపర్ ఉంది. దాని పేరు చెప్పను. అదేంటో మీకే తెలుసు. అసత్యాలు రాసీ రాసీ అలిసిపోతున్నారు. ఏమైనా లాభం ఉంటుందా తమ్ముళ్లూ అని మిమ్మల్ని అడుగుతున్నాను' అని సీఎం వ్యాఖ్యానించారు. 2014 ఎన్నికల క్లిష్ట సమయంలో తానైతే తప్ప మరొకరు కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేరని ప్రజలు తనపై నమ్మకంతో అధికారమిచ్చారన్నారు. 'నేను కూడా ఆర్‌బీఐ సహకరించకపోయినా రూ.24వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేశాను.ఏడాదిలోపు పట్టిసీమను పూర్తి చేశాం. కృష్ణా నీటిని శ్రీశైలంలో నిల్వ చేసి సీమకు 144 టీఎంసీలు మళ్లించాం. కరువుతో అల్లాడే అనంతపురానికి ఇంత తొందరగా నీరొస్తుందని అనుకున్నారా..? బుక్కపట్నం, ధర్మవరం లాంటి పెద్దపెద్ద చెరువులకు నీరిచ్చాం. ప్రస్తుతం పశ్చిమగోదావరి కంటే అనంతపురం భేషుగ్గా ఉంది. 2014 ఎన్నికల్లో 12 స్థానాలు సాధించిన అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించడానికి సిద్ధంగా ఉండాలి' అని పిలుపిచ్చారు.

రాష్ట్ర ప్రతిష్ఠను మంటగలిపారు

» విదేశీ కంపెనీలనూ మోసగించారు

» జగన్, సాయిరెడ్డి నేరచరిత విశ్వవ్యాప్తంగా మార్మోగుతోంది

» వారివి బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు: సోమిరెడ్డి, అచ్చెన్నాయుడు



అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని, దేశంలోని కంపెనీలనే గాక.. విదేశాల్లోని కంపెనీలను సైతం వైఎస్ జగన్-విజయసాయిరెడ్డి గ్యాంగ్ మోసం చేసిందని రాష్ట్ర మంత్రులు విమర్శించారు. వీళ్ల నేరచరిత్ర ప్రపంచం మొత్తం మార్మోగుతోందన్నారు. విదేశీ పెట్టుబడులను రప్పించి ఏవిధంగా కంపెనీలను మోసం చేశారో రోజుకో కథ బయటకు వస్తోందని తెలిపారు. తమ కేసులపై విచారణ వేగవంతం కావడంతో అధికారులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎంవో అధికారులు, పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులపై విజయసాయిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు జగన్ తక్షణం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. తండ్రి అధికారం అండతో ప్రభుత్వం నుంచి మేళ్లు పొందినవారి నుంచి క్విడ్ ప్రో కో ద్వారా జగన్ భారీగా ముడుపులు దండుకున్నారని పేర్కొన్నారు. 'డొల్ల కంపెనీల పేరుతో విచ్చలవిడిగా మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు. వీళ్ల మోసాలపై విదేశాలు అంతర్జాతీయ న్యాయస్థానాలను ఆశ్రయించే పరిస్థితి వచ్చింది. రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచవ్యాప్తంగా మంటగలిపారని ధ్వజమెత్తారు. బినామీ లావాదేవీలు, డొల్ల కంపెనీలు, బోగస్ షేర్ మార్కెటింగ్ మాయాజాలం సృష్టికర్త విజయసాయిరెడ్డి అని ఆరోపించారు. 'వారి కేసులపై విచారణ ముమ్మరమవుతోంది. తమ మోసాలు ఎక్కడ రుజువవుతాయో అనే భయంతో జగన్, విజయసాయిరెడ్డి బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు తెరలేపారు. ఎవరు అధికారంలో ఉన్నా అధికారులు తమ విధులు తాము నిర్వర్తిస్తారు. యంత్రాంగం చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తుంటే తప్పుడు ఆరోపణలతో వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేస్తే చర్యలు తీసుకుంటాం. వారిపై కేసు వేయడానికి కూడా ప్రభుత్వం వెనకాడదు' అని హెచ్చరించారు. గతంలో జగన్ కూడా నాటి కృష్ణా జిల్లా కలెక్టర్ అహ్మద్‌బాబును పట్టుకుని.. నిన్ను కూడా సెంట్రల్ జైలుకు తీసుకుపోయే కార్యక్రమం చేస్తానని, గుర్తుపెట్టుకోండని బెదిరించారని గుర్తుచేశారు. విశాఖపట్నం విమానాశ్రయంలో పోలీస్ కమిషనర్‌ను పట్టుకుని.. 'బుద్ధుందా? ఏం చేస్తున్నారు మీరు? ముఖ్యమంత్రిని టచ్ చేస్తున్నావు. నువ్వు రెండే రెండు సంవత్సరాలు. ఎవరినీ మరచిపోను. గుర్తుంచుకోండి' అని బెదిరించారన్నారు. వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా ఇదేవిధంగా దౌర్జన్యాలకు దిగారని చెప్పారు. ఇలాంటి పెడధోరణులు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

తెలుగుజాతికే తలవంపులు: పయ్యావుల

జగన్ వల్ల మొత్తం తెలుగు జాతికే తలవంపులు వస్తున్నాయని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పయ్యావుల కేశవ్ అన్నారు. పగబట్టిన పాములు వెంటాడినట్లు ఆయన అవినీతి పదేళ్లయినా వదిలిపెట్టడం లేదని.. ఆ అవినీతి తవ్వినకొద్దీ బయటపడుతోందని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. 'జగన్ తప్పుడు పనుల వల్ల మారిషస్ ప్రభుత్వం సాక్షాత్తూ మన ప్రధానికే నోటీసులు పంపింది. ఆయన ఇప్పటివరకూ రాష్ట్రంలో మంత్రులుగా, అధికారులుగా పనిచేసిన వారిని కోర్టుల చుట్టూ తిప్పారు. ఇప్పుడు కేంద్ర మంత్రులను, అధికారులను అంతర్జాతీయ కోర్టుల చుట్టూ తిప్పే పరిస్థితి తీసుకొచ్చారు. తెలుగువారి ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో పెంచేందుకు సీఎం చంద్రబాబు దేశదేశాలూ తిరుగుతుంటే.. జగన్ నిర్వాకాల వల్ల విదేశాల్లో కేసులు వెంటాడడం దురదృష్టకరం' అని పేర్కొన్నారు.

జగన్ కేసు.. ప్రధానికి నోటీసు

(మూడో పేజీ తరువాయి)

సంస్థ (టీఎస్ఐఐసీ)కు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసుల్లో జగన్‌పై దాఖలైన చార్జిషీట్‌ను ప్రస్తావించింది. తమ దేశానికి చెందిన కంపెనీకి నష్టం జరిగిందంటూ మారిషస్ ప్రభుత్వం భారత్‌పై నెదర్లాండ్స్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కారిస్సా ఎల్ఎల్‌సీ రూ.350 కోట్లకుపైగా నష్ట పరిహారం కోరుతోందంటూ అంతర్జాతీయ న్యాయస్థానంలో ఆర్బిట్రేటర్ నియామకానికి భారత ప్రభుత్వానికి నోటీసు పంపింది. ఇందుకు ఐక్యరాజ్య సమితి కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లా మోడల్ లా ఆన్ కమర్షియల్ ఆర్బిట్రేషన్‌ను ఉటంకించింది. ఇరు దేశాల మధ్య పెట్టుబడుల ప్రోత్సాహం, భద్రతకు సంబంధించిన ఒప్పందానికి ఇందూ విషయంలో తూట్లు పడినట్లు ఆరోపిస్తోంది. సీబీఐ, ఈడీ కేసుల కారణంగా ఇందూ టెక్ ప్రాజెక్టు ముందుకు సాగలేదని, దాంతో కారిస్సా ఎల్ఎల్‌సీ నష్టపోయిందని ఆరోపించింది. ఈ విషయాన్ని టీఎస్ఐఐసీ ఉన్నతాధికారి ఒకరు ధ్రువీకరించారు.

ఇందూ టెక్ జోన్‌కు భూముల ధారాదత్తం

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ నడుస్తున్న రోజులవి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరలో ఉండే మామిడిపల్లిలో భూమికి విపరీతమైన డిమాండ్ ఉండేది. ఎకరా కోటి రూపాయలు పలుకుతున్న ఈ భూములను నాటి వైఎస్ ప్రభుత్వం ఎకరా రూ.20 లక్షల చొప్పున 250 ఎకరాలను ఇందూ టెక్ జోన్‌కు కట్టబెట్టింది. ఇందులో 150 ఎకరాలు ఐటీ సెజ్; మరో 100 ఎకరాల్లో హౌజింగ్, ఇతర మౌలిక వసతులకు కేటాయించారు. ఇందూ సంస్థ అక్కడ స్పెషల్ ఐటీ సెజ్ ఏర్పాటు చేసింది. మారిషస్ దేశానికి చెందిన కారిస్సా ఎల్ఎల్‌సీకి ఇందులో 49 శాతం వాటా ఉంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కింద ఈ సంస్థ రూ.100 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసింది. ఒప్పందం ప్రకారం ప్రమోటర్లు దీనిని 2012లోపు డెవలప్ చేయలేదు. పైగా, ఇందులో 100 ఎకరాలను ఇందూ ప్రమోటర్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తమ కుటుంబ సభ్యులకు చెందిన ఎస్‌పీఆర్ ప్రాపర్టీస్‌కు బదిలీ చేసినట్టు ఆరోపణలున్నాయి. మరికొంత స్థలాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రూ.175 కోట్లను రుణాలుగా పొందినట్టు చెబుతున్నారు. ఒప్పందం ప్రకారం, సెజ్‌ను ఇందూ టెక్ డెవలప్ చేయకపోవడంతో 2015లో తెలంగాణ ప్రభుత్వం భూముల కేటాయింపు ఒప్పందాలను రద్దు చేసింది. భూములను మాత్రం టీఎస్ఐఐసీ స్వాధీనం చేసుకోలేకపోయింది. వైఎస్ జగన్‌పై సీబీఐ, ఈడీ నమోదు చేసిన అవినీతి కేసుల్లో ఈ భూమి వ్యవహారం కూడా ఉంది. అత్యంత తక్కువ ధరకు ఏపీఐఐసీ ఈ భూములను కట్టబెట్టడంపై అప్పట్లోనే కాగ్ తప్పుబట్టింది. ఈ టెక్ జోన్ భూముల వ్యవహారంలో ప్రభుత్వానికి రూ.500 కోట్లమేర నష్టం వాటిల్లిందని పేర్కొంది. టెక్ జోన్ ప్రమోటర్‌గా ఉన్న ఇందూ ప్రాజెక్ట్స్ సంస్థకు చెందిన రూ.117.74 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దాంతో, ఈ భూములను టీఎస్ఐఐసీ స్వాధీనం చేసుకోలేకపోయింది. కేటాయింపును రద్దు చేసినందున భూములపై హక్కు తమకు ఉంటుందని టీఎస్ఐఐసీ వాదిస్తోంది. ఈ స్థలాల జప్తు చెల్లదని ఈడీకి లేఖ కూడా రాసింది. అదే సమయంలో భూముల కేటాయింపును టీఎస్ఐఐసీ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ ఇందూ టెక్ జోన్ గత ఏడాది హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే, తాము పెట్టుబడులు పెట్టిన సెజ్ న్యాయ వివాదాల్లో చిక్కుకోవడంతో తాను మోసపోయానని కారిస్సా ఎల్ఎల్‌సీ భావించింది. భారత్-మారిషస్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం.. భారత్‌లో మారిషస్ కంపెనీలు పెట్టే పెట్టుబడులకు రక్షణ కల్పించాలి. పెట్టుబడులు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతున్నా అతీగతీ లేదు. దాంతో కారిస్సా ఎల్ఎల్‌సీ మారిషస్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం ఈ వ్యవహారాన్ని పరిష్కరించాలని కోరింది. దీంతో మారిషస్ ప్రభుత్వం భారత ప్రధానికి లీగల్ నోటీసులు పంపింది. మారిషస్ కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులకు రక్షణ కల్పించేందుకు ఇరు దేశాల మధ్య ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ ప్రొటెక్షన్ అగ్రిమెంట్ ఉంది. ఇందులో భాగంగా మారిషస్ కంపెనీలు నష్టపోయినా, మోసపోయినా ఆ దేశ ప్రభుత్వం వాటి తరఫున బాధ్యత తీసుకుంటుంది. ఆ క్రమంలోనే మారిషస్ ప్రభుత్వం భారత సర్కారుకు ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రధానికి నోటీసులు జారీ చేసింది. కారిస్సా సంస్థ మోసపోయిందని, అది 50 మిలియన్ డాలర్ల పరిహారం కోరుతోందని, మధ్యవర్తిత్వ పరిష్కారం చేయాలని మారిషస్ ప్రభుత్వం అందులో కోరింది. నోటీస్ రావడంతో అప్రమత్తమైన ప్రధాని కార్యాలయం మారిషస్ ప్రభుత్వం కోరిన విధంగా మధ్యవర్తి నియామకానికి సంబంధిత మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేసిందని ప్రసార సాధనాల్లో వార్తలు వచ్చాయి. ఏకంగా ప్రధానమంత్రికే నోటీస్ రావడంతో ఈ కేసు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది.

టీడీపీ వెంటనే జగన్ అవినీతి కేసులపై దాడిని పెంచింది. జగన్ అవినీతి ఏకంగా ప్రధానిని కూడా నోటీసులు అందుకొనే పరిస్థితి తెచ్చిందని ఆ పార్టీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. జగన్ అవినీతి రాష్ట్రం పరువు తీసిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగువారి ప్రతిష్ఠ పెంచుతుంటే జగన్ తుంచుతున్నాడని ఆరోపించారు. ఈ పరిణామం వెలుగు చూసిన సమయంలో వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లాలో పాదయాత్రలో ఉన్నారు. ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టుకు హాజరు కావాల్సి ఉండటంతో గురువారం మధ్యాహ్నం తర్వాత ఆయన పాదయాత్రకు విరామం ఇచ్చి హైదరాబాద్ బయల్దేరారు. మారిషస్ పరిణామంపై స్పందించలేదు.

అనంత సెజ్‌తోనూ లింకు?

వైఎస్ హయాంలో భారీగా లబ్ధి పొందిన వారిలో ఇందూ శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఒకరు. ఇందూ టెక్ జోన్‌కు శంషాబాద్‌లో 250 ఎకరాలతోపాటు అనంతపురం జిల్లాలో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు 8,844 ఎకరాలను నాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిని సుమారు ఎకరా రూ.50 వేల నుంచి లక్ష రూపాయలకే కట్టబెట్టారు. అక్కడ సెజ్ ఏర్పాటుకు ఎలాంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకుండానే.. ప్రభుత్వం తక్కువ ధరకు ఇచ్చిన భూములనే బ్యాంకులో అత్యధిక మొత్తానికి తాకట్టు పెట్టారు. 4,397 ఎకరాలను తాకట్టు పెట్టి రూ.790 కోట్ల రుణం తీసుకున్నారు. ఇది పేరుకు లేపాక్షి నాలెడ్జ్ హబ్ అయినా.. వెనకున్నది ఇందూ ప్రాజెక్ట్స్. లేపాక్షి నాలెడ్జ్ సిటీకి ఇచ్చిన భూమిని తనఖా పెట్టి ఇందూ ప్రాజెక్ట్సు ఆ భారీ రుణాన్ని తీసుకుంది. ఇలా రుణంగా తీసుకున్న సొమ్ముతోపాటు మారిషస్ కంపెనీ నుంచి తెచ్చిన పెట్టుబడులను కూడా పక్కదారి పట్టించారని సీబీఐ కేసుల్లో పేర్కొంది.

విజయసాయి, జగన్‌లపై ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని ఎంపీ రాయపాటి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీశ్‌చంద్ర, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరావులపై విజయసాయి చేసిన అనుచిత వ్యాఖ్యలు సమాజంపై ప్రభావం చూపుతాయని అన్నారు. విజయసాయిరెడ్డిపైన, వైఎస్ జగన్‌పైన ఐపీసీ 504, 505 1(బీ), బెదింపులకు పాల్పడినందుకు 506(2), 124(ఎ), 307 రెడ్ విత్ 511 సెక్షన్ల కింద, ఉద్రిక్తతలు రెచ్చగొట్టటం.. ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేసి పరువునష్టం కలిగించినందుకు ఐపీసీ సెక్షన్ 500 కింద కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు.

సాయిరెడ్డి తీరు సరికాదు: విష్ణుకుమార్‌రాజు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించడం పద్ధతి కాదని, వారు తమ విధులు తాము నిర్వర్తిస్తున్నారని బీజేపీ శాసన సభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు గురువారం పేర్కొన్నారు. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ తరపున ఖండిస్తున్నామన్నారు.

వైసీపీ దాడి వెనుక..!

ప్రధానికి నోటీసుల నుంచి పక్కదారి పట్టించేందుకే!

పరిపాలనను స్తంభింపజేయడమే లక్ష్యం


సాయిరెడ్డి ఆరోపణలపై అధికార వర్గాల్లో చర్చ

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా వైసీపీ ఎమ్మెల్యేలెవరూ తెలుగుదేశం పార్టీలో చేరలేదు. ప్రతిపక్షం నుంచి కొత్తగా అధికార పార్టీలోకి వచ్చిన వారూ లేరు. గత అసెంబ్లీ సమావేశాలప్పుడు వైసీపీ పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి టీడీపీలో చేరిన తర్వాత ఇంకే వైసీపీ ఎమ్మెల్యే అధికార పక్షంవైపు చూడలేదు. అప్పుడేమీ మాట్లాడని వైసీపీ.. ఇప్పుడెందుకు హఠాత్తుగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పోలీసు ఉన్నతాధికారిపై విమర్శలు చేస్తోందన్న చర్చ అధికార వర్గాల్లో నడుస్తోంది. ఇందూ టెక్‌జోన్ కుంభకోణం కేసులో సీబీఐ ఇందూ శ్యాప్రసాదరెడ్డి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై చార్జిషీటు దాఖలుచేసిన సంగతి తెలిసిందే. ఇందూ టెక్ జోన్ పనులు నిలిచిపోవడంతో ఇందులో పెట్టుబడులు పెట్టి తాము మోసపోయామని మారిషస్ కంపెనీ తాజాగా భారత ప్రధానికి, ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వడం, జాతీయ స్థాయిలో అది రచ్చవుతుండడంతో.. దాని నుంచి దృష్టి మళ్లించేందుకే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి హఠాత్తుగా ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని అంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులపైనే దాడి చేయడం ద్వారా ముఖ్యమంత్రిని బలహీనపరచాలి.. ప్రభుత్వ యంత్రాంగాన్ని అయోమయంలో పడేయాలి. చివరకు వ్యవస్థలను స్తంభింపజేయాలన్నది ఆ పార్టీ వ్యూహంగా ఉందని కొందరు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

పలు కేసుల్లో ఉన్న వ్యక్తి, పలువురి మీద కేసులు పడేందుకు కారణమైన వారు.. ఇప్పుడు అధికారులను బెదిరించడం వ్యవస్థను ఇబ్బందిలో పెట్టాలన్న ఎత్తుగడలో భాగమేనని అంటున్నారు. ప్రధానికి సైతం నోటీసులు రావడానికి కారణమైన వ్యక్తులు.. వ్యవస్థలో తమ పని తాము చేసుకునే ఉన్నతాధికారులను విమర్శించడం వెనక పాలనను స్తంభింపజేయాలన్న వ్యూహం ఉండి ఉంటుందని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి మాట వినకుండా సీఎంవో అధికారులను ఆత్మరక్షణలో పడేయడం, అదే సమయంలో కిందిస్థాయి సిబ్బంది సీఎంవో అధికారుల మాట ఖాతరు చేయకుండా చేయడం ఈ వ్యూహంలో భాగమని కొందరు అనుమానిస్తున్నారు. సాధారణంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఏ ప్రభుత్వంలో ఉన్నా.. ప్రభుత్వం చెప్పినట్లుగా నడుచుకుంటారు. అయితే నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే ఆ పనులు చేస్తారు. అంతే తప్ప గీతను పూర్తిగా దాటేసి ఎమ్మెల్యేల బేరసారాల విషయం వరకు వెళ్తారన్న ఆరోపణ అసలు నమ్మశక్యంగానే లేదంటున్నారు. అయినా అలా దాడి చేయడం వెనక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే భారీ గేమ్‌ప్లాన్ ఉందని చెబుతున్నారు.

సీనియర్ లాయర్ల పేర్లు ఇవ్వండి

- వాకపల్లి కేసులో స్పెషల్ పీపీ కోసం రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా వాకపల్లి అత్యాచార బాధితుల కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం కోసం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ముగ్గురు చొప్పున సీనియర్ న్యాయవాదులతో రెండు ప్యానెళ్లు ఇవ్వాలని హైకోర్టు డివిజన్ బెంచ్... రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాదికి సహకరించేందుకు న్యాయవాది పల్లా త్రినాథరావును కొనసాగించడానికి అనుమతించనున్నట్లు స్పష్టం చేసింది. రెండు ప్యానెళ్ల నుంచి బాధితులు ఎంపిక చేసిన ఒకరిని ఈ కేసులో స్పెషల్ పీపీగా నియమిస్తామని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ జి.శ్యాం ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలు జారీ చేసింది. వాకపల్లి కేసులో స్పెషల్ పీపీగా డాక్టర్ పల్లా త్రినాథరావును నియమించాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలపై ఏపీ హోంశాఖ, ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న 13 మంది గ్రేహౌండ్స్ పోలీసులు వేర్వేరుగా అప్పీలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు తొలుత ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. ఈ కేసులో బాధితులు కోరుతున్న పల్లా త్రినాథరావు పాల్గొన్న ఒక కార్యక్రమంలో తానూ కూడా పాల్గొన్నందువల్ల ఈ కేసులు మరో బెంచ్‌కు బదిలీచేయాలని ఏసీజే రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ వ్యాజ్యాలు గురువారం జస్టిస్ నాగార్జునరెడ్డి ధర్మాసనం ముందు విచారణకు రాగా, ప్రభుత్వం తరఫు న్యాయవాది విద్యావతి వాదించారు. బాధిత మహిళలు కోరుతున్న త్రినాథరావుపై క్రిమినల్ కేసు ఉందన్నారు. ఈ దశలో కల్పించుకున్న ధర్మాసనం... పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆయనపై కేసు నమోదు చేసినట్లుందని వ్యాఖ్యానించింది. బాధిత మహిళల తరఫు న్యాయవాది వసుధా నాగరాజ్ వాదిస్తూ... బాధితులు కోరిన న్యాయవాదిని ఈ కేసులో స్పెషల్ పీపీగా నియమించవచ్చన్నారు. గిరిజన సంప్రదాయాలు, వారి భాష తెలిసిన ఆయన్ను నియమిస్తే వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం... స్పెషల్ పీపీని నియమించే అంశం ప్రభుత్వ పరిధిలోనిదని అభిప్రాయపడింది. స్పెషల్ పీపీ నియామకం కోసం సీనియర్ న్యాయవాదుల పేర్లు ఇవ్వాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణ వారం రోజులకు వాయిదా వేసింది.

సెక్రటేరియట్ లైబ్రరీ విభజనకు కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్న సెంట్రల్ సెక్రటేరియట్ లైబ్రరీలోని పుస్తకాలు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని రెండు రాష్ట్రాల మధ్య పంచేందుకు ఒక కమిటీని నియమించారు. ఏపీ, తెలంగాణలకు చెందిన ఇద్దరేసి అధికారులు కమిటీలో ఉన్నారు. ఏపీకి వచ్చిన పుస్తకాలు, ఫర్నిచర్, ఇతర సామాగ్రిని వెలగపూడిలోని సచివాలయం మూడో బ్లాకులో ఏర్పాటుచేసిన లైబ్రరీకి తరలిస్తారు. ఈ మేరకు గురువారమిక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

కరెన్సీ కరువు!

- రాష్ట్రంలో నోట్ల కష్టాలు తీవ్రం
- 80 శాతం ఏటీఎంలు మూత
- బ్యాంకుల్లోనూ ఇవ్వని నగదు
- నిలదీస్తున్న ఖాతాదారులు
- చేతులెత్తేస్తున్న అధికారులు
- గుర్తొస్తున్న నోట్ల రద్దు రోజులు
- జీతాలు, పింఛన్లకు ఎలా?



అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం అంటే ఎనీటైమ్ మనీ లాంటిది. ఎప్పుడు కావాలంటే అప్పుడు.. ఎక్కడ కావాలంటే అక్కడ డబ్బు తీసుకోవచ్చు. చేతిలో ఏటీఎం కార్డు ఉంటే అదో భరోసా! ఇదంతా ఒకప్పటి మాట. రాష్ట్రంలో కరెన్సీ కష్టాలు తీవ్రమయ్యాయి. దీంతో ఇప్పుడు ఏటీఎం అంటే 'ఎనీ టైమ్ మూత' అనే పరిస్థితి వచ్చింది. రాష్ట్రంలో దాదాపు 80 శాతం ఏటీఎంలు పనిచేయడం లేదు. ఎప్పుడు చూసినా షట్టర్లు మూసే ఉంటున్నాయి. తెరచి ఉన్న కొద్ది ఏటీఎంల్లో కూడా నగదు ఉండడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఉన్నాయని వెతుక్కుంటూ వెళితే అక్కడ రూ.10-20వేలు వస్తే గొప్ప. ఇంత కష్టం ఎందుకని బ్యాంకుకు వెళితే.. అక్కడా అదే పరిస్థితి. రూ.30-40వేలు అడిగితే ఐదు, పదివేలు ఇచ్చి.. చేతులెత్తేస్తున్నారు. లక్షకుపైగా అడిగితే.. కావాలంటే డిజిటల్ బదిలీ చేస్తాం తప్ప నగదు ఇవ్వలేమని తెగేసి చెబుతున్నారు. ఈ కరెన్సీ కష్టాలతో జనాలకు చిరాకొచ్చేసింది. చాలా అవసరం. మా డబ్బే కదా.. ఎందుకివ్వరు? అని గట్టిగా ప్రశ్నించినా, గొడవపడినా.. మేమేం చేయలేం అన్న సమాధానమే! రాష్ట్రవ్యాప్తంగా కరెన్సీకి కరువొచ్చింది. నగదు కొరత తీవ్ర రూపం దాల్చింది. పైగా నెలాఖరు వచ్చేసింది. నాలుగో శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు. ఆపై రెండురోజులుంటే పింఛన్లు, ఉద్యోగుల జీతాలు చెల్లించాల్సిన పరిస్థితి. వీటికి సుమారు రూ.10 వేల కోట్లపైనే కావాలి. కానీ బ్యాంకుల్లోనేమో నగదు లేదు. దీంతో పెద్దనోట్ల రద్దు సమయంలో ఎదురైన పరిస్థితులే పునరావృతం అవుతాయేమోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెస్ట్‌లకు నగదు లేదు..

రిజర్వు బ్యాంకు నుంచి జిల్లాల్లోని బ్యాంకుల చెస్ట్‌లకు నగదు అంతంతమాత్రంగానే వస్తోంది. దీంతో చెస్ట్‌లు కూడా పరిమితంగానే డబ్బును బ్యాంకులకు అందిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అదే పరిస్థితి. ఒక జిల్లాలో రూ. 500 కోట్లు చెస్ట్‌ను బ్యాంకులు అడిగితే అందులో 20 శాతం మాత్రమే ఇస్తున్నాయి. ఎంత అవసరం ఉందన్నా పూర్తి స్థాయిలో అందించడం లేదు. రిజర్వు బ్యాంకు నుంచి తమకు అంతే వస్తోందని... అంతకంటే ఎక్కువ ఇవ్వలేమని చెప్పేస్తున్నారు.

ఎఫ్‌ఆర్‌డీఏ బిల్లు.. తగ్గిన నమ్మకం

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎఫ్‌ఆర్‌డీఏ (ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్) బిల్లు ప్రజల్లో, ఖాతాదారుల్లో ఆందోళన నింపింది. బ్యాంకులు నష్టాల బారిన పడి డిపాజిట్‌దారుల డబ్బును తిరిగివ్వకున్నా... ఖాతాదారుల డబ్బుకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక భరోసా ఏమీ ఉండదని ఆ బిల్లులో పెట్టారు. దీంతో ప్రజలకు బ్యాంకులపై నమ్మకం సడలిపోయే పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో నోట్ల రద్దు అనంతరం కూడా ప్రజల్లో బ్యాంకులపై నమ్మకం తగ్గే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో తమ డిపాజిట్‌ల కాలపరిమితి తీరిపోయాక... నగదును ఇంటికి తెచ్చేసుకుంటున్నారు. అవసరం ఉన్నా లేకున్నా ఇంట్లోనే డబ్బు పెట్టుకుంటున్నారు తప్ప మళ్లీ డిపాజిట్ చేయడం లేదు. దీంతో బ్యాంకులకు నగదు వసూళ్లు తగ్గిపోయాయి. సాధారణంగా ఒక బ్యాంకు శాఖ ఆ రోజు వచ్చిన వసూళ్లు, బ్యాంకు చేసే చెల్లింపులకు మధ్య తేడాను చెస్ట్ నుంచి తెచ్చుకుంటుంది. ఇప్పుడు డిపాజిట్లు తగ్గిపోవడంతో వచ్చేది తగ్గిపోయింది. అదే సమయంలో ఖాతాదారులు తీసుకునేది పెరిగింది. ఈ భారీ వ్యత్యాసాన్ని భరించేందుకు చెస్ట్‌ల నుంచి డబ్బు అడుగుతున్నా.. ఇవ్వకపోవడంతో ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నారు.

బ్యాంకు బ్రాంచ్ ఏటీఎంల్లోనూ నిల్

సాధారణంగా ప్రధాన బ్యాంకు బ్రాంచ్‌లు, బ్యాంకు శాఖల వద్ద ఉన్న ఏటీఎంల్లో ఎప్పుడూ డబ్బు ఉంటుంది. కానీ ఇప్పుడు బ్యాంకుల ప్రధాన బ్రాంచ్ ఏటీఎంల్లోనూ డబ్బుల్లేవు. దీంతో బ్యాంకులకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. అక్కడేమో అడిగినంత ఇవ్వలేమని చెబుతుండడంతో ఖాతాదారులు గొడవకు దిగుతున్నారు. నోట్ల రద్దు సమయంలో ఇబ్బందులను మర్చిపోకముందే మళ్లీ ఈ దుస్థితి ఏమిటని బ్యాంకు అధికార్లను నిలదీస్తున్నారు.

కొత్త నోట్లు ఏమయ్యాయి?

మరోవైపు కేంద్రం రెండువేల నోట్ల ముద్రణను కొంత పరిమితివరకే చేసి ఆపై ఆపేసింది. అదే సమయంలో బ్యాంకుల్లో ఖాతాదారులు చేసే జమల్లో రెండు వేల నోట్లు ఉంటే.. అవి ఒకసారి బ్యాంకుకు, అక్కడినుంచి చెస్ట్‌కు, రిజర్వు బ్యాంకుకు వెళ్లాక.. అవిక తిరిగిరావడం లేదు. ఆ రెండువేల నోట్లను మళ్లీ బ్యాంకులకు పంపిణీ చేయడం లేదు. అదే సమయంలో ఖాతాదారుల చేతికి వచ్చిన రెండువేల నోట్లను వారు ఇళ్లల్లోనే పెట్టేసుకుంటున్నారు. రూ.500, రూ.200 నోట్లను విడుదల చేసినా, అవన్నీ చలామణిలో కనిపించకుండా పోతున్నాయి. ఆఖరికి రూ.10 కొత్త నోట్లను ఒకసారి తీసుకోవడమే తప్ప మళ్లీ వాటిని చలామణిలోకి తేవడం లేదు. ఇది కూడా నగదు కొరత తీవ్రతకు కారణమవుతోంది. మరోవైపు డిజిటల్ లావాదేవీలు పెంచేందుకు కేంద్రమే కావాలనే నగదు పంపిణీని తగ్గిస్తోందన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

20 వేల మంది బదిలీ... పరిస్థితి ఘోరం

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం తర్వాత పలు బ్యాంకులు దేశవ్యాప్తంగా 20 వేల మంది సిబ్బందిని బదిలీ చేశాయి. మూడేళ్లు ఒకే బ్యాంకు శాఖలో సర్వీసు పూర్తిచేసుకున్న వారందరినీ మార్చేశాయి. దానిలో భాగంగా రాష్ట్రంలోనూ వేలమంది బ్యాంకు అధికారులు, సిబ్బంది మారిపోయారు. కొత్త శాఖలకు వెళ్లిన వీరికి ఖాతాదారులతో ఇంకా సరైన పరిచయాలు ఏర్పడలేదు. మరోవైపు ఖాతాదారులు నగదు కోసం విపరీతమైన ఒత్తిడి చేస్తుండడంతో ఏంచేయాలో తెలియక సతమతమైపోతున్నారు. నగదు కొరతతో తమ పరిస్థితి ఘోరంగా తయారైందని ప్రజలతో పాటు బ్యాంకు సిబ్బంది కూడా వాపోతున్నారు. 'ఖాతాదారులకు విజ్ఞప్తి చేసి ఖాతాల్లో నిల్వ ఉంచమని అడుగుతాం. డిపాజిట్లు చేయిస్తాం. కానీ వారు అడిగినప్పుడు డబ్బు ఇవ్వకపోతే మమ్మల్ని నిలదీస్తున్నారు. మీరు చెప్తే నిల్వ ఉంచాం. మా డబ్బు మాకిచ్చేందుకు ఏమైంది? అని నిలదీస్తున్నారు. ఏం చేయాలో అర్థకావడం లేదు' అని కొందరు బ్యాంకు ఉద్యోగులు పేర్కొన్నారు.



అజీస్‌పురంలో చిన్నారిని ఎత్తుకొని ముద్దాడుతున్న వైఎస్ జగన్

చేతివృత్తిదారుల సంక్షేమానికి కృషి: జగన్

కనిగిరి, ఫిబ్రవరి 22: తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేతివృత్తులు, కుల వృత్తుల వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపడతామని వైసీపీ అధినేత జగన్ అన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రకాశం జిల్లాలో ఆయన నిర్వహిస్తున్న ప్రజా సంకల్పయాత్ర గురువారం కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలం రామాపురం, గుదేవారిపాలెంలో ప్రారంభించి కనిగిరి మండలంలోని అజీస్‌పురం సెంటర్ వరకూ సాగింది. ఈ క్రమంలో మేదరులు బుట్టలతో ప్రదర్శనగా వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని జగన్‌ను కోరగా... ఆయన పైవిధంగా స్పందించారు. మత్స్యకారులు కూడా జగన్‌ను కలిసి తమ సమస్యలు చెప్పారు. కరువుతో ఎండిన వరి, కంది, శనగ పంటలను రైతులు జగన్‌కు చూపించి ఆదుకోవాలని కోరగా జగన్ సానుకూలంగా స్పందించారు. అనంతరం అజీస్‌పురంలో పాదయాత్ర విరమించి, హైదరాబాద్ వెళ్లేందుకు కనిగిరి-పామూరు మీదుగా రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లారు.

వర్మ నుంచి ప్రాణహాని: మహిళా సంఘాలు

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని బీజేపీ మహిళా నేత తుమ్మల పద్మ విజయవాడ సూర్యారావుపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఓ చానల్ చర్చా వేదికలో పాల్గొన్నందుకు తన ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేయడంతో పాటు అసభ్యకర వ్యాఖ్యలు చేశాడని తెలిపారు. వర్మ అనుచరులూ అసభ్యపదజాలంతో పోస్టింగ్‌లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అంతేగాకుండా వర్మ తనను కేసు పెట్టి అరెస్టు చేయిస్తానని బెదిరిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తుచేసి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు. కాగా.. రామ్‌గోపాల్ వర్మపై నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఐద్వా ప్రతినిధులు, మహిళా సంఘాల నేతలు పి.దేవి తదితరులు హెచ్చరించారు. మహిళలపై వర్మ వ్యాఖ్యల్ని ఖండిస్తూ.. విజయవాడ సీపీఎం కార్యాలయంలో ఐద్వా... రౌండ్ టేబుల్ నిర్వహించింది.

కమిషన్ల చైర్మన్లకు గౌరవ వేతనం లక్ష

అమరావతి, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్, బీసీ కమిషన్, మహిళా కమిషన్‌ల చైర్మన్లందరికీ ఒకే గౌరవ వేతనం ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వీరికి నెలకు లక్ష గౌరవ వేతనం ఇస్తారు. అలాగే ఇంటి అద్దె కింద మరో రూ.25వేలు, వాహన అద్దె రూ.25వేలు చెల్లిస్తారు.

5 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5 నుంచి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు వెలగపూడిలో జరుగనున్నాయని రాష్ట్ర ప్రభుత్వం గురువారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 5 ఉ.9.30 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశాలు మొదలవుతాయి.

అసోంలో ముస్లింల పాగా: ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బంగ్లాదేశ్ నుంచి ఈశాన్య భారతంలోకి వలసలు భారీగా పెరుగుతున్నాయని, దీనికి కారణం పాక్ అని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ ఆరోపించారు. చైనాసాయంతో పాక్ పక్కా ప్రణాళికతోనే వలసలను ప్రోత్సహిస్తోందన్నారు. ఈశాన్య భారత సరిహద్దు ప్రాంతాల్లో భద్రత, అభివృద్ధి అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. అసోంలోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా పెరిగిపోతోందన్న నివేదికలను ప్రస్తావిస్తూ.. అసోంలో బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఏఐయూడీఎఫ్ పార్టీ బీజేపీ కంటే వేగంగా విస్తరిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై ఏఐయూడీఎఫ్, ఆప్, మజ్లిస్ పార్టీలు తీవ్ర విమర్శలు గుప్పించాయి.



కువైత్‌లో మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ప్రవాసాంధ్రులు

రాష్ట్రానికి కువైత్ బాధితులు: మంత్రి కొల్లు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్ని వ్యయప్రయాసలైనా భరించి.. కువైత్‌లోని బాధితులందరినీ స్వరాష్ట్రానికి తీసుకెళ్తామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. బాధితులను స్వరాష్ట్రానికి తరలించే విషయమై కువైత్‌లో రెండు రోజులుగా పర్యటిస్తున్న మంత్రి రవీంద్ర గురువారం పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తక్షణ చర్యలపై భారత రాయబార కార్యాలయంలో అంబాసిడర్ జీవసాగర్‌తో చర్చించారు.

రెండోరోజు 'టెట్'కు 93.33% హాజరు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)కు రెండోరోజైన గురువారం 93.33 శాతం అభ్యర్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి మొత్తం 49,622 మందికి 46,352 మంది హాజరయ్యారు. గురువారం ఉదయం సెషన్‌లో పేపర్-1(తెలుగు)కు 25,350 మందికిగాను 23,086(91.07%) మంది, మధ్యాహ్నం సెషన్‌లో పేపర్-1(తెలుగు)కు 24,312 మందికిగాను 23,266(95.70%) మంది హాజరయ్యారు.


38 కోట్లతో జూనియర్ కాలేజీల్లో వసతులు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 34 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో రూ.38.30 కోట్ల వ్యయంతో మౌలికసదుపాయాలు కల్పించేందుకు వీలుగా విద్యాశాఖ స్పెషల్ సీఎస్ ఆదిత్యనాథ్‌దాస్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మొత్తంలో రూ.30.66 కోట్లను నాబార్డు ఆర్‌ఐడీఎఫ్-23 కింద రుణంగా మంజూరు చేసింది. మిగిలిన రూ.7.63 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చనుంది.

సీఎంను కలిసిన ఇటాలియా సంస్థ బృందం

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లో అనాథ బాలబాలికలు, పేదలు, ఆపన్నులను ఆదుకునేందుకు తాము అందజేస్తున్న సేవల గురించి కేర్ అండ్ షేర్ ఇటాలియా సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఆయనను గురువారం కలిసి పలు ప్రాంతాలకు చెందిన 3,000 మంది చిన్నారులకు విద్య, వైద్యం, ఇతర వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

క్రైస్తవ ప్రచారకుడు బిల్లీ గ్రాహం కన్నుమూత



వాషింగ్టన్, ఫిబ్రవరి 22: ప్రఖ్యాత క్రైస్తవ మత ప్రచారకుడు బిల్లీ గ్రాహం బుధవారం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా ప్రొస్టేట్ క్యాన్సర్, నిమోనియా, పార్కిన్సన్ వ్యాధులతో బాధపడుతున్నారు. ఆయన ఆరు దశాబ్దాలకు పైగా మత ప్రచారం నిర్వహించారు.

అమృత..జయలలిత బిడ్డ కాదు: దీప పిటిషన్

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జయలలితకు బెంగుళూరు యువతి అమృత కుమార్తె కాదని జయ మేనకోడలు దీప పేర్కొన్నారు. కేవలం ఆస్తి కోసమే అమృత ఈ నాటకమాడుతోందంటూ మద్రాస్ హైకోర్టులో గురువారం దీప పిటిషన్ దాఖలు చేశారు.

వివాదంలో కమల్ పార్టీ లోగో!

చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు కమల్‌హాసన్ మదురైలో ఎగరేసిన 'మక్కల్ నీది మయ్యం' పార్టీ పతాక చిహ్నం (లోగో)పై వివాదం తలెత్తింది. బీఎస్ ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం దాదాపు ఇలాంటి లోగోనే కలిగి ఉండటం వివాదం రేపుతోంది. కమల్ లోగోలో ఆరు చేతులు ఉంటే.. ఈ టెలికాం సంఘం గుర్తులో తొమ్మిది తొమ్మిది చేతులు ఉన్నాయి. కాగా, అందరూ భావిస్తున్నట్టు తాను కాషాయానికి బద్ధ శత్రువును కానని కమల్‌హాసన్ అన్నారు. జాతీయ పతాకంలో ఉన్న కాషాయాన్ని గౌరవిస్తానన్నారు.

అడుగడుగునా కొర్రీలు

- 3,296 కోట్లకు.. 462 కోట్లు ఇచ్చిన కేంద్రం
- యూసీలు సమర్పించినా జాప్యమే
- ఇచ్చిన వివరాలే మళ్లీ ఇవ్వాలని పట్టు
- 2017-18లో ఏపీకి వచ్చింది 0.35శాతమే!

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పక్కా ఇళ్లకు వచ్చే నిధుల కోసం రాష్ట్రానికి ఎదురుచూపులు తప్పడం లేదు. కేటాయింపుల్లోనే ప్రాధాన్యత లేదని రాష్ట్రం ఓ వైపు ఆందోళన వ్యక్తం చేస్తుంటే... నిధుల విడుదల విషయంలోనూ జరుగుతున్న తీవ్ర జాప్యంతో మరింత అసహనం వ్యక్తమవుతోంది. యుటిలైజేషన్ సర్టిఫికెట్లు(యూసీలు) సమర్పించినా, ఆడిట్ వివరాలు ఇచ్చినా మళ్లీమళ్లీ కేంద్రం నివేదికలు కోరుతోంది. దీంతో ఇచ్చిన వివరాలే ఎన్నిసార్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. సకాలంలో నిధులు అందకపోవడంతో నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయని అధికారవర్గాలు అంటున్నాయి. అందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర గృహనిర్మాణ శాఖకు కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్లుగా మొత్తం రూ.3,296 కోట్లు కేటాయించింది. కానీ ఇప్పటివరకూ రూ.462కోట్లు మాత్రమే విడుదల చేసింది. 2017-18 నిధుల విడుదలకు కొంత జాప్యం జరిగిందని భావించినా... 2016-17 నిధులు కూడా పూర్తిగా రాకపోవడం గమనార్హం. 2016-17లో రెండు విడతలకుగాను ఇప్పటివరకూ ఒక్కటే విడుదల చేయగా, 2017-18లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్(పీఎంఏవైజీ) పథకం కింద రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు ఇళ్లు కేటాయిస్తున్నారు. ఈ పథకంలో కేంద్రం ఒక్కో ఇంటికి రూ.72వేలు రాయితీ ఇస్తుంది. మిగతా మొత్తాన్ని భరించి... మొత్తం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలుగా నిర్ణయించింది. ఈ పథకం కింద 2016-17లో 72,885 ఇళ్లు, 2017-18లో 48,058 ఇళ్లు కేటాయించారు. దాని ప్రకారం కేంద్రం నుంచి రూ.921కోట్లు రావాల్సి ఉండగా ఇప్పటివరకూ కేవలం రూ.281కోట్లు విడుదలయ్యాయి. పీఎంఏవై-అర్బన్ పథకం కింద కేంద్రం ఇచ్చే ఇళ్లను రాష్ట్రం బీఎల్‌సీ పథకం కింద మంజూరుచేస్తోంది. పట్టణాల్లో సొంత స్థలాలున్న పేదలు ఇళ్లు కట్టుకుంటే వారికి రూ.2.5లక్షలు రాయితీ ఇస్తారు. అందులో కేంద్రం లక్షన్నర ఇస్తే, రాష్ట్రం లక్ష ఇస్తుంది. దీని కింద ఏపీకి 2016-17లో 31,401 ఇళ్లు, 2017-18లో 1,02,977 ఇళ్లు, ఈ ఏడాది కోటా కింద 23,962 ఇళ్లు వచ్చాయి. దానికి కేంద్రం నుంచి రూ.2,375కోట్లు రావాలి.ఇప్పటివరకూ రూ.181కోట్లు మాత్రమే వచ్చా యి. కాగా, 2017-18లో దేశవ్యాప్తంగా రూ.20,404 కోట్లు కేటాయించగా.. ఏపీకి వచ్చింది కేవలం రూ.71 కోట్లు. అంటే.. మొత్తం నిధుల్లో ఏపీకి దక్కింది 0.35 శాతం!

అడిగినవే.. అడుగుతూ..

- ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాలను ప్రభుత్వం ఐఏపీ జిల్లాలుగా గుర్తించడం వల్ల ఇక్కడ రాయితీ 10శాతం అదనంగా ఇవ్వాలి. కానీ కేంద్రం అన్నిటికీ ఒకే విధమైన రాయితీ ఇస్తోంది. దీంతో ఆ జిల్లాలకు ఎక్కువ ఇవ్వాల్సి వస్తున్నందున 2016-17లో కేంద్రం ఇచ్చిన 75వేల ఇళ్లను 72,885గా మార్చుకుని నిధుల సర్దుబాటు చేసుకుంటామని రాష్ట్రం కోరింది. దానికి అప్పట్లో కేంద్రం అంగీకారం తెలపడంతో ఇళ్ల సంఖ్యను తగ్గించుకున్నారు. తీరా నిధుల విడుదలకు వచ్చేసరికి సంఖ్య ఎందుకు తగ్గిందని కొర్రీ వేశారు. 75వేల ఇళ్లు ఇస్తే దాన్ని తగ్గించడం ఏంటని వాదిస్తోంది. దీనిపై ముందే సమాచారం ఇచ్చామని తెలిపినా దానిని కేంద్రం పట్టించుకోవడం లేదు.
- అలాగే జిల్లాలవారీగా ఏటా ఆడిట్ నివేదికలు పంపుతారు. ఇటీవల ఆడిట్, యూసీలు కూడా కేంద్రానికి సమర్పించారు. 60శాతం నిధులు ఖర్చు చేసినట్లు నివేదికలు ఇచ్చారు. అయినా ఆ వివరాలు సమగ్రంగా కావాలని ఇటీవల మళ్లీ కేంద్రం కోరింది. మళ్లీ ఇచ్చినా జాప్యం తప్ప కొత్తగా ఏమీ ఉండదని గృహనిర్మాణశాఖ అంటోంది.
- కేంద్రం నుంచి వచ్చే నిధుల కోసం రాష్ట్రాలు ప్రత్యేకంగా నోడల్ ఖాతాను నిర్వహిస్తాయి. దాని ద్వారానే పీఎంఏవై నిధులు పంపిణీ చేస్తాయి. దానికనుగుణంగా ఏపీ నోడల్ ఖాతా వివరాలను ఆడిటర్ సంతకాలతో సహా కేంద్రానికి సమర్పించింది. కానీ ఆ నివేదికలు మళ్లీ కావాలని కోరారు.

కేంద్రం నుంచి వచ్చిన నిధుల వివరాలు

పథకం	కేటాయింపు కోట్లలో	విడుదల
పీఎంఏవై(గ్రామీణ్)2016-17	562	281
పీఎంఏవై(గ్రామీణ్)2017-18	359	0
పీఎంఏవై(అర్బన్)2016-17	471	181
పీఎంఏవై(అర్బన్)2017-18	1544	0
పీఎంఏవై(అర్బన్)2017-18 అదనం	359	0
మొత్తం	**3296**	**462**

కేటాయింపులూ స్వల్పమే

ఏపీకి పీఎంఏవై ఇళ్ల కేటాయింపులు కూడా స్వల్పంగానే ఉన్నాయి. 2016-17కి సంబంధించి దేశవ్యాప్త కేటాయింపుల్లో ఏపీ వాటా 2శాతానికి మించలేదు. 2011 జనగణనను ప్రామాణికంగా తీసుకున్నందున ఎక్కువ ఇళ్లు ఇవ్వలేమని కేంద్రం చెబుతోంది. కానీ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఎక్కువ మంది ఉన్నారని, తమ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని ఏపీ కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో కూడా పెద్దగా ఇళ్లు వచ్చే అవకాశం కనిపించడం లేదు.



సోఫియాకు.. ప్రేమతో మీ షారుఖ్

ముంబై, ఫిబ్రవరి 22: ప్రముఖ బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ హ్యూమనాయిడ్ రోబో సోఫియా ప్రేమకు ఫిదా అయిపోయాడు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ ఐటీ సదస్సులో సందడి చేసిన సోఫియాను.. తనకు ఇష్టమైన నటుడు ఎవరు అని అడిగితే ఠక్కున షారుఖ్ ఖాన్ పేరు చెప్పేసింది. సోఫియా అభిమానానికి కరిగిపోయిన షారుఖ్ ట్విటర్ వేదికగా స్పందించారు. 'నా దేశానికి వచ్చిన మహిళకు బహిరంగంగా ప్రేమను వ్యక్తం చేస్తున్నాను. అణువణువునా నువ్వు నన్ను అనుకరించావు సోఫియా' అంటూ సందేశాన్ని పోస్ట్ చేశాడు.

ఎవర్ని పెళ్లి చేసుకోవాలో మేం నిర్ణయించలేం

- హదియా కేసులో.. సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఇద్దరు మేజర్ల పరస్పర అంగీకారంతో జరిగిన వివాహాన్ని తాము రద్దు చేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎవర్ని పెళ్లి చేసుకోవాలో.. ఎవర్ని చేసుకోవద్దో తాము నిర్ణయించలేమని పేర్కొంది. 'ఒక వివాహ బంధంలో నిజాయితీ లేదని కోర్టు చెప్పగలదా? భార్యాభర్తల సంబంధంలో నిజాయితీ లేదని పేర్కొనగలదా? వివాహ బంధాన్ని మేమెలా రద్దు చేయగలం?' అని వ్యాఖ్యానించింది. కేరళకు చెందిన 25-ఏళ్ల హదియా కేసు విచారణను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌ల ధర్మాసనం గురువారం విచారించింది. మేజర్ అయిన వ్యక్తి తన నిర్ణయం ప్రకారం వివాహం చేసుకోవచ్చని తెలిపింది. వారు ఎంపిక నిర్ణయం సరైందా? కాదా? అనేది కోర్టు తీర్మానించలేదని పేర్కొంది. కేరళకు చెందిన అఖిల అశోకన్ అనే మెడికో మతం మార్చుకుని, హదియాగా మారిన విషయం తెలిసిందే. ఆమె షఫీన్ జహా అనే వ్యక్తిని పెళ్లిచేసుకుంది. ఇది లవ్ జిహాద్ అంటూ.. ఆమె తండ్రి అశోకన్ కేరళ హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆ వివాహాన్ని రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ.. ఆ దంపతులు గత ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు గురువారం ఈ కేసును విచారించింది. అశోకన్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదిస్తుండగా.. షఫీన్ జహా, హదియాల తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ మంత్రి కపిల్ సిబాల్ వాదనలను వినిపిస్తున్నారు.

నిరాటంకంగా విద్యుదుత్పత్తి

- కాంట్రాక్టు కార్మికుల సమ్మె ప్రభావం నిల్
- ఎన్టీటీపీఎస్‌లో మూడోరోజూ కొనసాగిన ఆందోళనలు
- రేపటి నుంచి విధుల్లోకి ఔట్‌సోర్సింగ్ కార్మికులు
- పరిస్థితిని సమీక్షించిన ట్రాన్స్‌కో సీఎండీ

అమరావతి,/ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం), ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల సమ్మెతో డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎన్టీటీపీఎస్)లో విద్యుదుత్పత్తికి ఆటంకం కలుగలేదు. గత మూడు రోజులుగా కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేస్తున్నారు. ఎన్టీటీపీఎస్‌లో మొత్తం నాలుగు దశల్లో ఏడు యూనిట్ల ద్వారా 1760 మెగావాట్ల(42మిలియన్ యూనిట్ల) విద్యుదుత్పత్తి జరుగుతోంది. 7యూనిట్లలో 1,308మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. వీరికి అదనంగా మరో 400మంది పీస్ వర్క్‌చేసే కార్మికులున్నారు. వీరంతా వేతనాల పెంపుకోరుతూ మూడురోజులుగా ఆందోళన చేస్తున్నారు. వీరుకాకుండా అన్ని విభాగాల్లో ఇంకా 2900మంది పైచిలుకు ఉద్యోగులు, ఇంజనీర్లు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. 7వ యూనిట్‌లో 500మెగావాట్ల ఉత్పత్తి ఎక్కువశాతం కాంట్రాక్టు కార్మికులతోనే జరుగుతుంది. మిగతా యూనిట్లలో ఉన్న ఓఅండ్ఎం కార్మికులను ఈ యూనిట్‌కు పంపి ఉత్పత్తికి ఆటంకం కలగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో మూడోరోజు కాంట్రాక్టు కార్మికులు విధులకు హాజరు కాకపోయినా ఉత్పత్తిపై ప్రభావం పడలేదు. శనివారం నుంచి వారిస్థానంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులను తీసుకోవాలని, సమ్మెలో ఉన్నవారిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు పర్యవేక్షక ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. అత్యవసర సేవలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలన్నీ తీసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం విద్యుత్‌సౌధ నుంచి ఎస్ఈలు, సీఈలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సిబ్బంది 24గంటలు విధి నిర్వహణలో ఉండేలా, విద్యుత్ సరఫరాను ఎస్ఈలు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. సమాచారాన్ని చేరవేసేందుకు 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూం ఏర్పాటుచేశామని తెలిపారు. విధులకు హాజరవుతున్న సిబ్బందిని అడ్డుకుంటున్నవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జేఎండీ దినేశ్ పరుచూరి అధికారులకు సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో జేఎండీ విజిలెన్స్ పి.ఉమాపతి, ఏపీ ట్రాన్స్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

26న విద్యా కమిషనరేట్ ముట్టడి

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా సమస్యలపై ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ(ఏపీసెక్) ఆధ్వర్యంలో ఈనెల 26న పాఠశాల విద్యా కమిషనరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ రాష్ట్ర నాయకులు రమేశ్ పట్నాయక్, జి.హృదయరాజు, కె.వెంకటేశ్వరరావు, పి.కృష్ణయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మాతృభాషలోనే విద్యాబోధన

- హైస్కూలు స్థాయి వరకూ తప్పనిసరి చేయాలి
- రాష్ట్రాలకు ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- ఇస్రో చైర్మన్ శివన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం


చెన్నై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను విస్మరిస్తే మనిషికి మనుగడే లేదని, హైస్కూలు స్థాయి వరకూ తప్పనిసరిగా మాతృభాషలో విద్యను బోధించాలని అన్ని రాష్ట్రాలకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. గురువారం చెన్నై శివారులోని సవితా డీమ్డ్ విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ కె.శివన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దెబియేందు మజుందార్, కేంద్ర రక్షణశాఖ వైజ్ఞానిక సలహాదారుడు జి. సతీష్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు, కేసీపీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ ఇందిరాదత్‌కు గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య స్నాతకోత్సవ సందేశమిస్తూ.. పట్టాలు పొందడంతోనే సరిపోదని, ప్రస్తుత పోటీ యుగంలో తాము ఎంచుకున్న రంగాల్లో జరుగుతున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వైద్య విద్యనభ్యసించినవారు తప్పనిసరిగా గ్రామాల్లో సేవలందించాలని, కనీసం వారి జన్మస్థలాల్లోనైనా ఏడాది పాటు ప్రజలకు సేవ చేయాలని కోరారు. పదివేల ఏళ్ల నాటి దేశ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. తెలుగు భాష గొప్పదనాన్ని తమిళ కవి భారతియార్ 'సుందరమైన తెలుగు' అని పొగిడారని గుర్తు చేశారు. ఆంగ్లేయులను వ్యతిరేకించిన మనం... ఆంగ్ల భాషపై, కాన్వెంట్ చదువులపై మోజు పెంచుకుంటున్నామని, తల్లిదండ్రులను అమ్మా, నాన్నా అని ప్రేమగా పిలవడం మానుకుని మమ్మీ, డాడీ అనడమే ఫ్యాషన్‌గా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఆంగ్లభాషను నేర్చుకోవడం తప్పుకాదు కానీ, అదే సమయంలో మాతృభాషను విస్మరించకూడదని హితవు పలికారు. భారతదేశం ఎల్లప్పుడూ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్నే కోరుకుంటుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. వర్సిటీ చైర్మన్ వీరాయన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో తమిళనాడు విద్యాశాఖ మంత్రి కేపీ అన్బళగన్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.


ఇస్రో చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వెంకయ్య

'సివిల్స్' మార్కులను వెల్లడించడం కుదరదు

ఆర్టీఐ దరఖాస్తుదారులతో సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ పరీక్షల మార్కుల వెల్లడి కుదరదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో ఎంపిక కాని కొందరు యువకులు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరుపుతూ సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యానించింది. ఢిల్లీకి చెందిన కొందరు యువకులు 2010 ప్రిలిమ్స్‌లో ఎంపికవ్వకపోవడంతో.. ఆర్టీఐ ద్వారా తమ మార్కుల వివరాలు, కటాఫ్ వివరాలు, ప్రామాణిక మార్కులు, ఎంపికైన ఇతర అభ్యర్థులకు వచ్చిన మార్కుల వివరాలివ్వాలని అభ్యర్థించారు. అది సాధ్యంకాదని యూపీఎస్సీ చెప్పడంతో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారికి మార్కుల వివరాలివ్వాల్సిందేనని హైకోర్టు చెప్పడంతో.. యూపీఎస్సీ సుప్రీంలో అప్పీల్ చేసింది. ఈ కేసు విచారించిన జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌లు మార్కులు వెల్లడి చేయడం సాధ్యం కాదంటూ తీర్పునిచ్చారు. అలా చేయడం యూపీఎస్సీ నిజాయితీని ప్రశ్నించినట్లు అవుతుందని పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మార్కులను వెల్లడించాల్సిందేనని.. అయితే.. ఈ కేసుకు అవి వర్తించవని వివరించారు.



ముఖ్యమంత్రి నా ఇంట్లో దెయ్యాలను వదిలారు

అందుకే బంగ్లా ఖాళీ చేశా: తేజ్ ప్రతాప్

పట్నా, ఫిబ్రవరి 22: 'సీఎం నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ నా ఇంట్లో దెయ్యాలను వదిలారు.అవి నన్ను వేధిస్తున్నాయి.అందుకే బంగ్లా ఖాళీ చేయాల్సి వచ్చింది.' అని ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు, బిహార్ మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ ఆరోపించారు. తేజ్‌ప్రతాప్ మంత్రిగా ఉన్నప్పుడు దేశ్‌రత్న్ మార్గ్‌లోని భవనాన్ని కేటాయించారు. మొదట్నుంచి వాస్తు, మతపరమైన విషయాలపై నమ్మకం ఉన్న తేజ్‌ప్రతాప్ ఆ బంగ్లాను తన సెంటిమెంట్‌గా భావించారు. అప్పట్లో ఈ బంగ్లా ప్రధానద్వారం మూసేసి, పలు మార్పులు కూడా చేయించారు. కానీ మంత్రి పదవి నుంచి దిగిపోయాక ఆ భవనాన్ని ఖాళీ చేయాలని తేజ్‌ప్రతాప్‌కు నితీశ్ ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. దీనిపై హైకోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్నారు. విచారణ పెండింగ్‌లో ఉండగానే దెయ్యాలు ఉన్నాయంటూ బంగ్లా ఖాళీ చేయడం ఓ జిమ్మిక్కని జేడీయూ ఆరోపించింది.

బాలికను మింగిన డెంగీ.. ఆస్పత్రి బిల్లు 18లక్షలు

గురుగ్రామ్ కార్పొరేట్ ఆస్పత్రి నిర్వాకం

గురుగ్రామ్, ఫిబ్రవరి 22:బిడ్డను కోల్పోయిన బాధలో ఉన్న తల్లిదండ్రులకు ఆ ఆస్పత్రి యాజమాన్యం ఓ 20 పేజీలతో కూడిన బిల్లును చేతిలో పెట్టింది. ఆస్పత్రిలో 15 రోజులపాటు చికిత్స పొందినందుకు రూ.18 లక్షల బిల్లు అయిందన్నది అందులోని సారాంశం. బిల్లును చూసిన ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి? హరియాణా గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆస్పత్రి నిర్వాకమిది. ఈ విషయాన్ని బాధిత తల్లిదండ్రుల బంధువులు ట్విటర్ ద్వారా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఆద్యాసింగ్ అనే ఏడేళ్ల బాలికను తీవ్రజర్వంతో గత ఏడాది ఆగస్టు 31న తల్లిదండ్రులు ఫోర్టిస్ మెమోరియల్ ఆస్పత్రిలో చేర్పించారు. మరుసటి రోజే బాలికను వెంటిలేటర్‌పై ఉంచారు. 15 రోజుల పాటు డయాలసిస్ కూడా నిర్వహించారు. తల్లిదండ్రులకు మాత్రం బాలిక 24 గంటల్లో కోలుకుంటుందని నమ్మించారు. తీరా 15 రోజుల తర్వాత బాలిక ప్రాణాలు కోల్పోయింది. బిడ్డను కోల్పోయిన బాధలో ఉన్న తల్లిదండ్రుల చేతి లో రూ.18 లక్షల బిల్లును పెట్టారు. చికిత్సలో భాగంగా బాలికకు 660 ఇంజక్షన్లు ఇచ్చామని..2,700 గ్లవ్స్ వాడామని అందులో పేర్కొన్నారు.

అవినీతి గొంగళి అక్కడే!

భారత్‌లో తిష్టవేసిన భ్రష్టాచారం.. నీతివంతమైన దేశాల్లో 81వ ర్యాంకు

- 2016 కన్నా దిగజారిన స్థానం
- మాల్దీవులు, ఫిలిప్పీన్స్‌కు తీసిపోం
- ఫలించని అవినీతి వ్యతిరేక పోరాటం
- మెరుగైన స్థానంలో భూటాన్, చైనా
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ర్యాంకుల వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం భ్రష్టాచారంపై తిరుగులేని యుద్ధం ప్రకటించినట్టు చెప్పుకొంటున్నప్పటికీ.. అవినీతి నిరోధంలో భారత్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ 2017 సంవత్సరానికి అవినీతి నిరోధంపై ప్రకటించిన ర్యాంకుల్లో భారత్‌కు 81వ స్థానం దక్కింది. 2016 ఏడాదితో పోలిస్తే 2 ర్యాంకులు దిగజారింది. సున్న నుంచి వంద వరకూ స్కోరు కార్డులో భారత్‌కు 40 మార్కులే దక్కాయి. 2016లోనూ 40 మార్కులే వచ్చాయి. ర్యాంకు మాత్రం దిగజారింది. 2015లో భారత్ 38 మార్కులతో 76వ ర్యాంకులో ఉంది. 2016లో నోట్ల రద్దు, 2017లో జీఎస్టీ అమలు లాంటి చర్యలు మన అవినీతి తల రాతను మార్చలేక పోయాయి. పొరుగున ఉన్న భూటాన్ 67 మార్కులతో 26వ ర్యాంకులో వెలిగిపోతోంది. చైనా 41 మార్కులతో 77వ ర్యాంకుతో మనకన్నా మెరుగైన స్థానంలో ఉంది. చుట్టూ ఉన్న దేశాల్లో శ్రీలంక (91), పాకిస్థాన్ (117), బంగ్లాదేశ్ (143), మయన్మార్ (130) మనకన్నా వెనుకబడి ఉన్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రిక్స్ దేశాల్లో భారత్, చైనాను మినహాయిస్తే.. దక్షిణాఫ్రికా 71, బ్రెజిల్ 96, రష్యా 135 ర్యాంకులను సాధించాయి. మొత్తం 180 దేశాలకు ర్యాంకులు ఇచ్చారు. ఇవి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా తేల్చి న ర్యాంకులు. వీటికి ఇతర గణాంకాల ప్రాతిపదిక లేదు. సు న్నా మార్కులు వస్తే అత్యంత అవినీతి దేశమని, 100 మా ర్కులు వస్తే అత్యంత నీతిమంతమైన దేశమని భావించాలి. యాభై మార్కులు కూడా రాని దేశాలను అవినీతిమయమైన దేశాలుగా పరిగణిస్తున్నారు. అన్ని దేశాల సగటు 43 మార్కులు కాగా, భారత్‌కు 40 మార్కులే వచ్చాయి. సగటు మార్కుల కన్నా తక్కువ వచ్చినవి అత్యంత అవినీతిమయమైన దేశాలుగా పరిగణిస్తున్నారు. ఇంకా..

- అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన జర్నలిస్టులు, అధికారులను బెదిరించడం, చంపడం భారత్, ఫిలిప్పీన్స్, మాల్దీవుల్లో ఎక్కువగా ఉందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఆసియా పసిఫిక్ దేశాల్లోనే ఈ 3దేశాల్లో అవినీతి వ్యతిరేక ఉద్యమకారుల పరిస్థితి దారుణంగా ఉందని హెచ్చరించింది.
- గత ఆరేళ్లలో 15 మంది జర్నలిస్టులు అవినీతిపై పోరాటంలో అంతం అయ్యారని వెల్లడించింది. ఆరేళ్లలో మరణించిన 90% జర్నలిస్టులు 45మార్కుల కన్నా తక్కువ స్కోరు సాధించిన దేశాల్లోనే మరణించారని తెలిపింది.
- భారత్‌లో వ్యక్తులుగా అవినీతికి ఎదురొడ్డి నిలిస్తే ప్రాణాలకే ముప్పని పేర్కొంది.
- అవినీతి వ్యతిరేక ర్యాంకింగ్‌లో అగ్రభాగాన న్యూజిలాండ్ (1-89), డెన్మార్క్ (2-88) నిలవగా, సిరియా, దక్షిణ సూడాన్, సోమాలియా అట్టడుగున ఉన్నాయి.
- పశ్చిమ యూరప్ దేశాలన్నీ 66 సగటు మార్కులు సాధించి, ఉత్తమ అవినీతి రహిత ప్రాంతంగా మన్ననలు అందుకున్నాయి.

ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సూచనలు

- అవినీతిని నిలువరించే చట్టాలు చేయండి. వ్యవస్థలు ఏర్పాటు చేయండి.
- అవినీతిపరులపై రాజకీయ ప్రతీకారేచ్ఛ వద్దు. న్యాయమూర్తులు, పోలీసుల ద్వారా సాంకేతికంగా పరిష్కరించండి.
- పౌర సమాజానికి భయం లేకుండా అభిప్రాయాలను వ్యక్తీకరించే అవకాశమివ్వండి.
  - పాఠశాల స్థాయి నుంచే వ్యక్తి సమగ్రత మీద దృష్టి పెట్టండి.



దేశంలో అవినీతి ఎక్కడ ఎంత?

పోలీస్ స్టేషన్లు, దర్యాప్తు సంస్థలు, కోర్టుల్లో లంచగొండులు	62%
భూ లావాదేవీలల్లో	38%
లారీలు, ఆటోవాలాలు, టాక్సీలు చెల్లించే లంచాలు	61%
అవినీతి కేసుల్లో ఇరుక్కున్న ఎంపీలు	31%
అవినీతికి పాల్పడుతున్న ఇతర నేతాగణం	78%
పేదలకు అందాల్సిన ఆహార ధాన్యాల్లో అందుతున్నది	40%

11 రకాల సేవల్లో ఏటా అవినీతి విలువ
రూ. 3,19,72,50,00,000

అర దండాలు కాదు.. శతకోటి దండాలు

- నిరుద్యోగం అవినీతిని పెంచుతోంది. ఉద్యోగం కోసం లంచం ఇస్తున్న వారు దాదాపు 45 శాతం మంది
- గట్టి శిక్షలు లేకపోవడం వల్ల అవినీతి పెరుగుతోంది.
- ప్రజలు అవినీతిని నిరసిస్తారు కానీ అవినీతిని నిరోధించే విషయంలో వారి మధ్య ఐక్యత లేదు.
- టేకిట్ ఈజీ పాలసీ వల్ల అవినీతిపరుల దందాలు ఎక్కువవుతున్నాయి.
- ఉద్యోగుల ఆదాయపు చిట్టాలో పారదర్శకత లేదు.
- సమాచార హక్కు చట్టం వచ్చినా అది అవకతవకలను నిరోధించలేకపోతోంది.
- స్వతంత్ర నేర పరిశోధన, దర్యాప్తు సంస్థ లేకపోవడం
- కోర్టులు, ఎలక్షన్ కమిషన్ సహా చాలా రాజ్యాంగ సంస్థలకు గట్టి అధికారాలు లేవు.
- కంపెనీల మధ్య అనారోగ్యకర పోటీ.

జీడీపీలో 15% సంపద 101 మంది వద్దే: ఆక్స్‌ఫామ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: భారతదేశంలో గడిచిన మూడు దశాబ్దాల్లో అసమానతలు మరింత పెరిగాయి. స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో 15 శాతానికి సమానమైన సంపద కొద్దిమంది సంపన్నుల ఖాతాలో జమపడే స్థాయికి అంతరాలు విస్తరించాయి. ప్రభుత్వాల తప్పుడు విధానాలే ఇందుకు కారణమని 'ఆక్స్‌ఫామ్' తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలో 2017లో 101 మంది శతకోటీశ్వరులు ఉన్నారని, ఐదేళ్ల క్రితం జీడీపీలో 10 శాతంగా ఉన్న వారి సంపద ఇప్పుడు 15 శాతానికి చేరగా, మరోవైపు పేదలు మరింత దారిద్ర్యంలోకి కూరుకుపోయారని 'పెరుగుతున్న అగాధం: భారతదేశంలో అసమానతల నివేదిక-2018'లో ఆక్స్‌ఫామ్ వెల్లడించింది.

ఒక బెంచ్ తీర్పుపై మరో బెంచ్ స్టే

సుప్రీంలో మరో రగడ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మధ్య తాజాగా మరో వివాదం చెలరేగింది. భూ సేకరణ బిలు లోని కొన్ని అంశాలపై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ వెలువరించిన తీర్పును పట్టించుకోవద్దని జస్టిస్ మదన్ లోకూర్ నేతృత్వంలోని మరో బెంచ్ ఉత్తర్వులివ్వడం కొత్త వివాదానికి కారణమైంది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకున్నా భూ సేకరణలో స్వాధీనం చేసుకున్న భూమిపై కేంద్రానికి అధికారం ఉంటుందని- 2013 నాటి భూసేకరణ, నష్టపరిహార చట్టం సెక్షన్ 24ను ప్రస్తావిస్తూ- జస్టిస్ అరుణ్ మిశ్రా బెంచ్ ఇటీవల పుణె మున్సిపాలిటీకి చెందిన ఓ కేసులో తీర్పు ఇచ్చింది. డబ్బులు ప్రభుత్వ ఖజానాలో ఉన్నా నిర్వాసితులకు డబ్బులు చెల్లించినట్లే పరిగణించాలని, నిర్దిష్ట సమయంలో నిర్వాసితులకు చెల్లిస్తారు కాబట్టి ఇక ఆ భూమి ప్రభుత్వ పరమైనట్లేనని బెంచ్ అభిప్రాయపడింది. ఆ తీర్పు చట్ట విరుద్ధమని జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో కూడిన మరో బెంచ్ వ్యాఖ్యానించింది.. ఆ తీర్పును పట్టించుకోవాల్సిన అవసరం లేదని హైకోర్టులకు రూలింగ్ ఇచ్చింది. దీనిపై విస్తృత ధర్మాసనం వేయాలా వద్దా? ప్రధాన న్యాయమూర్తి పరిశీలనకు పంపాలా వద్దా అన్న విషయమై మార్చి 7వ తేదీన నిర్ణయిస్తామని ప్రకటించింది. ఇది అరుణ్ మిశ్రా బెంచ్‌కు ఆగ్రహం తెప్పించినట్లు సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. నిర్ణయించాల్సింది ప్రధాన న్యాయమూర్తి గానీ లోకూర్-కురియన్‌లు కాదని అంటూ భూసేకరణ చట్టంలోని అంశాలపై విస్తృత ధర్మాసనం వేసే అంశాన్ని పరిశీలించాలని సీజే జస్టిస్ దీపక్ మిశ్రాను కోరింది. సమ స్థాయి కలిగిన వేరే బెంచ్ తీర్పును తప్పుపట్టడం క్రమశిక్షణా రాహిత్యమా కాదా? సీజే నేతృత్వంలోని విశాల ధర్మాసనం నిర్ణయిస్తుందని జస్టిస్ అరుణ్ మిశ్రా వ్యాఖ్యానించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ మధ్య సీజేపై తిరుగుబాటు చేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ మదన్ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు ఉన్నారు. ఈ వివాదం పుణె మున్సిపాలిటీ, ఇండోర్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఢిల్లీ డెవలప్‌ఎమెంట్ అథారిటీలకు సంబంధించిన 3 విడివిడి కేసులివి. ఒక బెంచ్‌లో జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ గోయల్, జస్టిస్ మోహన్ శంతన్ గౌడార్‌లు సభ్యులు, మరొక బెంచ్‌లో సీనియర్ జడ్జీలు మదన్ లోకూర్, కురియన్ జోసెఫ్‌లు సభ్యులు.

రోటోమాక్ అధినేత అరెస్టు

- విక్రమ్ కొఠారీ కుమారుడినీ అరెస్టు చేసిన సీబీఐ అధికారులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బ్యాంకుల నుంచి రూ.వేల కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన రోటోమాక్ యజమాని విక్రమ్ కొఠారీని, ఆయన కుమారుడు రాహుల్‌ను సీబీఐ అధికారులు గురువారం అరెస్టు చేశారు. మొత్తం ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకుల (బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓవర్సీస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) నుంచి రూ.2919 కోట్ల మేర రుణాలను విక్రమ్ కొఠారీ తీసుకున్నారని, వడ్డీతో కలిపి అది రూ.3695 కోట్లకు చేరిందని ఆ సొమ్ము చెల్లించకుండా కొఠారీ మోసం చేశారని సీబీఐ అధికారులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. కొఠారీ తమ వద్ద తీసుకున్న రుణాన్ని చెల్లించడంలేదంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై ప్రశ్నించేందుకు విక్రమ్ కొఠారీని, రాహుల్‌ను సీబీఐ అధికారులు ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. విచారణలో సహకరించనందున వారిని అరెస్టు చేశామని ఒక అధికారి తెలిపారు.

నీరవ్ మోదీ గీతాంజలి సెజ్ జప్తు

- దాని విలువ రూ.1200 కోట్లు: ఐటీశాఖ
- 100 కోట్ల డిపాజిట్లు, షేర్లు, కార్లు సీజ్

హైదరాబాద్, ముంబై, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ నేషనల్ బ్యాంకును నిలువునా ముంచి దేశం నుంచి పరారైన నీరవ్ మోదీ గీతాంజలి గ్రూపునకు చెందిన.. హైదరాబాద్ శివార్లలోని ప్రత్యేక ఆర్థిక మండలిని ఆదాయ పన్ను శాఖ గురువారం అటాచ్ చేసింది. ఈ సెజ్ విలువ రూ.1200 కోట్లు ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. నీరవ్ మోదీ పన్ను ఎగవేతకు సంబంధించి చేస్తున్న దర్యాప్తులో భాగంగా ఈ సెజ్‌ను అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు.. నీరవ్ మోదీ, ఆయన మామ మేహుల్ చోక్సీ సంస్థలకు చెందిన రూ.100 కోట్ల డిపాజిట్లు, షేర్లు, లగ్జరీ కార్లను ఈడీ సీజ్ చేసింది. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ స్కాంలో వారిపై మనీలాండరింగ్ ఆరోపణలకు సంబంధించి దర్యాప్తు జరుపుతున్న నేపథ్యంలో ఈ చర్యకు ఉపక్రమించింది. చోక్సీ అధినేతగా ఉన్న గీతాంజలి గ్రూపునకు సంబంధించిన రూ.86.72 కోట్ల విలువ చేసే షేర్లు, మ్యూచువల్ ఫండ్లను.. నీరవ్ గ్రూపునకు చెందిన రూ.7.80 కోట్ల డిపాజిట్లను స్తంభింపజేశామని ఈడీ అధికారులు తెలిపారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ నెల 15న నీరవ్, చోక్సీ ఆఫీసులు, నివాసాల్లో సోదాల సందర్భంగా 9 విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసులో జప్తుచేసిన ఆస్తుల విలువ రూ.5,826 కోట్లకు చేరింది. ఇక, నీరవ్ పాస్‌పోర్టును ఎందుకు ఉపసంహరించకూడదో తెలియజేయాలంటూ ఆయనకు ఈమెయిల్ ద్వారా నోటీసు పంపినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. దీనిపై ఆయనే తమను పరోక్షంగా సంప్రదించారని, ఒక మెయిల్ ఐడీని ఇచ్చి నోటీసులను దానికి పంపాల్సిందిగా కోరారని రవీష్ వివరించారు. తాము ఇచ్చిన నోటీసుకు నిర్ణీత సమయంలో స్పందించకుంటే చర్యలు తీసుకుంటామని రవీష్ స్పష్టం చేశారు. కాగా, ఈ కేసుకు సంబంధించి తమ ముందు హాజరు కావాలంటూ సమన్లు జారీ చేసినప్పటికీ ఆయన రాకపోవడంతో.. 26 లోపు హాజరు కావాలంటూ తాజాగా సమన్లు జారీ చేసినట్టు ఈడీ అధికారులు తెలిపారు. తన పాస్‌పోర్టును సస్పెండ్ చేసినందు వల్ల, ఇతరత్రా వ్యాపార కారణాల వల్ల రాలేకపోతున్నట్టు నీరవ్ మోదీ.. ఈడీ దర్యాప్తు అధికారికి తెలిపినట్టు వారు వివరించారు. నీరవ్ మామ చోక్సీ కూడా శుక్రవారం ఈడీ ముందు హాజరు కావాల్సి ఉంది.

కెనడా ప్రధాని విందుకు ఖలిస్థాన్ ఉగ్రవాది!

- ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్న కెనడా హైకమిషన్
- అధికారులపై చర్యలు తీసుకుంటామన్న ట్రూడో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో విందుకు ఖలిస్థాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం అందడంపై వివాదం చెలరేగింది. దీంతో కెనడా హైకమిషన్ ఆహ్వానాన్ని వెనక్కి తీసుకుంది. భారత పర్యటనలో ఉన్న కెనడా ప్రధాని ముంబై, ఢిల్లీలో అధికారిక విందులో పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఈ రెండింటికి జస్పాల్ అత్వాల్‌కు ఆహ్వానం పంపారు. ముంబై విందులో పాల్గొన్న అత్వాల్.. ట్రూడో భార్యతో ఫొటోలు కూడా దిగడంతో వివాదం చెలరేగుతోంది. దీంతో ఢిల్లీ విందుకు జస్పాల్‌కు పంపిన ఆహ్వానాన్ని కెనడా హై కమిషనర్ నాదిర్ పటేల్ వెనక్కి తీసుకున్నారు. 1986లో కెనడాలో పర్యటించిన పంజాబ్ మంత్రిని ఇంటర్నేషనల్ సిక్కు యూత్ ఫెడరేషన్‌లో కీలక సభ్యుడిగా ఉన్న జస్పాల్ అత్వాల్ చంపేందుకు ప్రయత్నించాడు. ఈ కేసులో అతనికి జైలు శిక్ష కూడా పడింది. సిక్కు వేర్పాటువాదులకు, ఖలిస్థాన్ ఉద్యమ కారులకు కెనడా ప్రభుత్వం మద్దతిస్తోందని పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ సహా పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు జస్పాల్‌ను ఆహ్వానించడంపై ట్రూడో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కాగా, జస్టిన్ ట్రూడో తన కుటుంబసభ్యులతో కలిసి ఢిల్లీలోని జామా మసీదును గురువారం సందర్శించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Balanagar (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

నవజీవనవేదం

లోపం లేని వారెవరు?

అసంతృప్తిని మనం మొదట్లోనే తుంచేయాలంటే ఎదుటి వ్యక్తిలో ఒక లోపం కనిపిస్తే, ఒక సంస్థలో ఎక్కడైనా లోపం కనిపిస్తే ఒక్కలోపంతోనే దాన్ని సరిపెట్టుకోవాలి. దానికి ఇంకొన్ని జోడించి పెంచొద్దు. అలా జోడించుకుంటూ వెళితే కొన్నాళ్లకు అవతలి వాడు నెత్తురు తాగే కసాయివాడిలా కనిపిస్తాడు. మనం ఏ ప్రదేశానికి వెళ్లినా, ఎవరింటికి వెళ్లినా, ఏ సంస్థలో పనిచేస్తున్నా, ఏ వ్యక్తితో కాపురం చేస్తున్నా అనేక విషయాల్లో ఇలాగే ఆలోచిస్తే చాలా బాగుంటుంది. 'ఆ ఒక్క లోపమే కదా, సరిచేసుకుంటాడులే! మిగతా విషయాల్లో రత్నం అని అనుకుంటే చాలు. భార్య-భర్త, ఉద్యోగి-యజమాని ఇలా దోషాన్వేషణ మానేసి, ఇన్ని సుగుణాలు ఉన్నప్పుడు ఆ ఒక్క దోషాన్ని తట్టుకోలేమా! అని సర్దుకోవాలి.

**అనన్త రత్న ప్రభవస్య యస్య హిమం న
సౌభాగ్య విలోపి జాతమ్
ఏకో హి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీన్దోః
కిరణేష్వివాఙ్కః (కాళిదాసు
'కుమారసంభవం' 1-3)**

'కిరణాలతో వెన్నెల కురిపించే చంద్రుని అనేకానేక సుగుణాల ముందు అతనికున్న చిన్న మచ్చ లెక్కలోకి రాదు. అలాగే ఎంతో విలువైన రత్నరాశులెన్నిటికో నెలవైన హిమవంతుడి గొప్పతనానికి, అతనిపైనున్న మంచు అడ్డుకాదు.'

సృష్టి రహస్యాన్ని తెలుసుకుంటే దోషాన్వేషణ అనే భావన మనలో తొలగిపోతుంది. సంపూర్ణంగా దుర్మార్గుడు అనే మనిషిని మనం చూడలేం. అలాగే సంపూర్ణంగా గుణవంతుడైన వ్యక్తినీ చూడలేం! ఎంతటి మహాపురుషుడినైనా చూడండి! ఎంతటి అవతార పురుషుడి పేరైనా చెప్పండి! వారికి వ్యతిరేకంగా గ్రంథాలు రాసిన వారు కూడా ఉన్నారు. శ్రీరామచంద్రుణ్ణి అంగీకరించలేకపోయిన వారూ ఉన్నారు. గాంధీ సిద్ధాంతాలను ఒప్పుకోలేక పోయిన వారూ ఉన్నారు. లోపం లేని వాడు లోకంలో ఉండడు. ఎందుకంటే - సృష్టి రహస్యమే అది. దాన్ని కూడా కాళిదాసు 'కుమారసంభవం'లో ఇలా చెబుతాడు.

పార్వతి తపస్సు చేయడానికి వెళుతుంటే ఆ వనంలో పుష్పాలన్నీ వికసించి ఉన్నాయట. రకరకాల వర్ణాలతో ఆ ప్రాంతమంతా వెలిగిపోతోందట. అందులో కొండగోగు పువ్వు చాలా ప్రకాశవంతంగా ఉంటుంది. అందులోనూ ఒక లోపం కనిపించిందట.

**వర్ణప్రకర్షే సతి కర్ణికారం దునోతి
నిర్గన్ధతయా స్మ చేతః
ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాం పరాఙ్ముఖీ
విశ్వసృజః ప్రవృత్తిః (3-28)**

'ఈ కొండ గోగు పువ్వును చూస్తుంటే ఎంత ఆనందం కలుగుతోందో, అంత దుఃఖం వస్తోంది. దాని రంగు చూస్తే చాలా ఆకర్షణీయంగా ఉంది. కానీ వాసన లేదు. బ్రహ్మదేవుడు సుగంధం కూడా పెడితే బాగుండేది కదా!'

భర్తలో ఒక లోపం కనిపించింది. ఎన్నో మంచి సుగుణాలున్నాయి. కోపమొక్కటే ఆయనలో ఉన్న లోపం. ఏం సర్దుకోలేవా? సృష్టిలో లోపం లేనిది లేదు. వ్యక్తుల మధ్య ఉండే అసంతృప్తులు, ఉద్యోగాల్లో ఉండే అసంతృప్తి, సంసారంలో ఉండే అంసతృప్తి పోవాలంటే ఈ విషయం అవగాహన చేసుకోవాలి. లోకమంతా ఎలా ఉంటుందీ అంటే ఒక యోగి ఆత్మకథలో మహాశయుడు ఇలా చెబుతాడు. ఈ మధ్యనే చదివాను. ఇసుక, పంచదార కలిసి ఉంటాయి. చీమ పంచదారను తీసుకుంటుంది. ఇసుకను వదిలేస్తుంది. నువ్వు చీమ నైపుణ్యాన్ని అలవాటు చేసుకో. ఇసుకను దొర్లిద్దామని ప్రయత్నం చేయకు. ప్రతి వ్యక్తి ఇసుక, పంచదార మిశ్రమంలాగే ఉంటాడు. మనకు కావాల్సిన పంచదార మనం తీసుకోవాలి. మనం భవనమే కట్టాలి అనుకుంటే ఇసుకే తీసుకోవాలి, పంచదార వదిలేయాలి. కాఫీ తాగాలంటే పంచదారే తీసుకోవాలి. ఇసుకతో తాగలేం. ఈ విషయాన్ని గ్రహిస్తే జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.



● డా. గరికిపాటి నరసింహారావు

శ్రీరమణకథామృతం

భగవాన్ సాక్షాత్కారం

(గత సంచిక తరువాయి)

శ్రీభగవాన్ మహాసమాధి జరిగిన తరువాత కూడా కీర్స్‌కి భగవాన్ మార్గదర్శకత్వం లభిస్తూనే ఉంది. ఆయన శ్రీరమణాశ్రమానికి తరచూ వెళ్తుండే వారు. శ్రీభగవాన్ ఉనికి తెలుస్తూనే ఉండేదాయనకి. 1980లో తన ఇంట్లో ఒక విందుని ఏర్పాటు చేశారు. విందు తరువాత తాను దేహాన్ని విడిచి పెట్టేస్తానని మిత్రులకు చెప్పారు. శ్రీభగవాన్ పటాన్ని నేల మీద పెట్టి సాష్టాంగ నమస్కారం చేశారు. ఆ పటం ఎదుట, భగవాన్ పాదాల చెంత ఒక దిండుని పెట్టారు. తన తలని ఆ దిండుపై పెట్టి పడుకున్నారు. అలాగే తన ప్రాణాలను విడిచారు. స్వచ్ఛందంగా ప్రాణాలు విడవడం ఈ సాధకుని అంతిమ విజయమని అనుకోవచ్చు.

(సశేషం)

● పింగళి సూర్యసుందరం

విజ్ఞానసారం



మంత్రం మననం

'మననాత్ త్రాయతే ఇతి మంత్రః'- మననం చేస్తూండడం వల్ల రక్షించేది మంత్రం. మంత్రం అనేది ఒక దేవతకు శబ్ద రూపం. మననం అంటే అదే పనిగా మంత్రాన్ని మానసికంగా వల్లె వేసుకోవడం! మంత్రాన్ని స్మరించుకోవడం కూడా మననమే! మంత్ర మననాన్ని భావంతో చెయ్యాలి. 'భావే చోప లబ్ధేః' అని బ్రహ్మసూత్రం. అంటే 'భావంలోనే దొరుకుతుంది' అని అర్థం. మంత్ర మననం, మంత్ర జపం మంత్ర యోగం అవుతాయి. మంత్ర యోగం దేవతతో సమన్వయాన్ని (సింథసిస్) ఇస్తుంది. 'తతు సమన్వయాత్' అని 'బ్రహ్మసూత్రం' చెబుతోంది. ఇక్కడ 'తత్' అని అన్నది పరమాత్మ అయిన బ్రహ్మన్‌ను ఉద్దేశించే అయినా, ఈ సమన్వయం (కో-ఆర్డినేషన్ కాదు) అన్నది ఉద్దేశించబడిన ఏ దేవతకైనా పొసుగుతుంది.

మూడు రకాల జపం!

మంత్ర జపాన్ని మాలతో చేస్తారు. లేదంటే చేతి వేళ్ల కణుపులతో లెక్కించుకుంటూ చేస్తారు. మంత్ర జపం మూడు రకాలు. 1. మానసిక జపం 2. ఉపాంశు జపం. 3. వైఖరీ జపం. మంత్రాన్ని మానసికంగా జపించడం 'మానసిక జపం' అవుతుంది. మంత్రాన్ని శబ్దించకుండా నోటితో అనుకుంటూ జపించడం 'ఉపాంశు' అవుతుంది. మంత్రాన్ని బయటకు వినిపించేట్లుగా ఉచ్చరిస్తూ జపించడం 'వైఖరీ జపం' అవుతుంది. వీటిలో మానసిక జపం ఉత్తమం. ఉపాంశు జపం మధ్యమం. వైఖరీ జపం అధమం.

దేవనాగరి లిపిలో పదహారు అచ్చులు, ముప్ఫైఅయిదు హల్లులు... మొత్తం యాభై ఒక్క అక్షరాలు కదా! 'అ' కారం నుంచి 'క్ష' కారం వరకూ ఉన్న వర్ణాలను 'మాతృక' అని అంటారు. ఆ మాతృక ఆధారంగానే మంత్రాలు పుట్టాయి. మంత్రాలకు మూలాలు వేదాలలోనూ, తంత్ర గ్రంథాలలోనూ ఉన్నాయి.

మంత్రాలలో లింగ భేదాలు

నిజానికి, మంత్రాలు ప్రార్థనలు, కీర్తనలు కావు. మంత్రాలు ఋషులతో ఒక నియమిత పద్ధతిలో నిర్మించబడ్డాయి. మంత్రం అనేది దేవతకు సంకేతం. దానికి నిర్ణీతమైన 'ఒక శబ్ద క్రమం' ఉంటుంది. మంత్రాలలో 'ఓం' కారానికి ప్రత్యేకమైన స్థానముంది. 'మంత్రాణాం ప్రణవ శ్శిరః'. ఓంకారం మంత్రానికి శిరస్సు. ఓంకారం సర్వాంతర్యామి అయిన బ్రహ్మన్‌కు పేరు. 'తస్య వాచకం ప్రణవం' అని పతంజలి యోగ సూత్రాలలో చెప్పారు. ఒక మంత్రాన్ని 'ఓం' కారంతో మొదలుపెట్టాలి.

ఈ మంత్రాలలో పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగ భేదాలున్నాయి. పుంలింగ దేవతలవి... పుంలింగ మంత్రాలు. స్త్రీ లింగ దేవతలవి... స్త్రీలింగ మంత్రాలు. పుంలింగ మంత్రాలను 'సౌర మంత్రాలు' అని అంటారు. స్త్రీ లింగ, నపుంసక లింగ మంత్రాలను 'సౌమ్య మంత్రాలు' అంటారు. స్త్రీ లింగ మంత్రాలను 'విద్య' అని కూడా అంటారు. పుంలింగ మంత్రాలు 'హుం' లేదా 'ఫట్' అని ముగుస్తాయి. స్త్రీ లింగ మంత్రాలు 'స్వాహా' లేదా 'ఠం' అని ముగుస్తాయి. నపుంసక లింగ మంత్రాలు 'నమః' అని ముగుస్తాయి. 'నమః' అని ముగిసే నపుంసక లింగ, లేదా 'పౌరాణిక' మంత్రాలలో శక్తి, జీవం ఉండవు అని 'శారదా తిలక', 'ప్రపంచ సార' లాంటి గ్రంథాలు మనకు తెలియజేస్తున్నాయి. ఎంతో ముఖ్యమైన ఈ విషయం వాడుకలో లోపించింది.

సరిగ్గానే జపిస్తున్నామా?


కాలక్రమంలో తప్పులు దొర్లడం అన్నది మంత్రాల విషయంలోనూ జరిగింది. ఏడు కోట్ల మంత్రాలు ఉండేవని తెలుస్తోంది. కానీ మనకు ఇప్పుడు చాలా కొద్ది మంత్రాలు మాత్రమే తెలుస్తున్నాయి. అవీ తప్పులతోనే మనలో చలామణిలో ఉన్నాయి. గాయత్రీ మంత్రం మొదలుకుని ప్రతి మంత్రమూ తప్పులతోనే వాడుకలో ఉంది.

జాగ్రత్తగా తెలుసుకోవలసినదేమిటంటే పుంలింగ దేవతల మంత్రాలు 'హుం' లేదా 'ఫట్' అనే శబ్దాలతోనే ముగియాలి. స్త్రీ లింగ దేవతల మంత్రాలు 'స్వాహా' లేదా 'ఠం' అనే శబ్దాలతోనే ముగియాలి. ఇవాళ మనం పుంలింగ మంత్రాలనూ, స్త్రీ లింగ మంత్రాలనూ కూడా 'నమః' అన్న శబ్దంతో ముగిస్తున్నాం. అంటే మనం 'శబ్దం ద్వారా మంత్రాలను నిర్వీర్యం చేసేసుకుంటున్నాం' అన్నది నిజం. ఇప్పటికైనా మనం ఈ తప్పును సరిదిద్దుకోవాలి.

మంత్రం దైవత్వం. శబ్దరూపమైన దైవశక్తి. 'నిర్ణీతమైన ఆ శబ్దరూపం పాడవకూడదు. దైవత్వం చెడకూడదు' అని గుర్తుంచుకొని, ప్రామాణికమైన తంత్ర గ్రంథాల ఆధారంగా మంత్రాన్ని శబ్ద దోషం లేకుండా మననం చేసుకుంటూ, అనుసంధానం చేసుకోవాలి.

● రోచిష్మాన్

మీకు తెలుసా?



సప్తాశ్వాలు ఇవీ!
సూర్యుడి రథానికి ఏడు గుర్రాలుంటాయి. వాటి పేర్లు గాయత్రి, బృహతి, ఉష్ణిక, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి. ఇవి వేదాలకు సంబంధించిన ఛందస్సుల పేర్లు కూడా.

ఉపదేశం



మనం సమస్యను సరిగ్గా అర్థం చేసుకుంటే, పరిష్కారం దాని నుంచే వస్తుంది. ఎందుకంటే పరిష్కారం అనేది సమస్య నుంచి విడిగా ఉండదు.

● జిడ్డు కృష్ణమూర్తి

ధర్మపథం

కరుణతో సరిదిద్దాలి!

క్రూరంగా ప్రవర్తించిన వారిపై కూడా తన సహజ కారుణ్యాన్ని చూపించి, వారిలో మార్పు తీసుకువచ్చేవాడు బుద్ధుడు. జేతవనంలో ఎక్కువ కాలం నివసించాడు బుద్ధుడు. కోసల రాజధాని శ్రావస్తి నగర శివారులో జేతవనం ఉంది. బుద్ధ ప్రబోధాల ఫలితంగా రాజు ప్రసేనుడు, మిగిలిన రాజ ప్రముఖులు యజ్ఞయాగాది క్రతువుల్ని మానారు. దీనితో తమకు భుక్తి పోయిందని ఆగ్రహించిన పండిత పురోహితులు బుద్ధుణ్ణి అవమానపరచాలని పథకం వేసుకున్నారు.

దానికి చించిత అనే ఒక గణిక (వేశ్య లాంటి వనిత) సహాయం కోరారు. "కావలసినంత ధనం ఇస్తాం!" అని చెప్పి, ఏం చేయాలో అంతా చెప్పారు. ఇక, ఆ రోజు నుంచి చించిత జేతవనం వైపు ఉదయం, సాయంత్రం పోసాగింది. తెల్లవారుజామునే వెళ్ళి, ఉదయం పొద్దెక్కాక జేతవనం ముందు నుండి బయటికి వస్తూ ఉండేది.



ఆ సమయానికి బుద్ధుడి ప్రబోధం వినడానికి జేతవనంకేసి వచ్చేవారు- "ఎక్కడి నుండి?" అడిగితే, "బుద్ధ సేవ చేసి వస్తున్నాను!" అనేది. అలాగే సాయంత్రం ప్రబోధానంతరం తిరిగి వస్తున్న జనానికి ఎదురు వస్తూ ఉండేది. "ఇప్పుడెక్కడికి?" అంటే... "ఈ రాత్రి బుద్ధ సేవకు!" అని చెప్పి వెళ్ళేది. ఇలా కొన్నాళ్ళు గడిచింది.

ఒక రోజున జేతవనంలో బుద్ధుడు ధర్మ ప్రబోధం చేస్తున్నప్పుడు 'గర్భిణి'గా ఉన్న చించిత అక్కడికి వచ్చింది. ఆమెను నియమించిన పండితులు ఆ సమావేశంలో కూడా ఉన్నారు. ఆమె అక్కడికి వచ్చి ఏడుపు లంకించుకుంది. "నాకు గర్భం వచ్చింది. దీనికి కారణం వీరే!" అంటూ బుద్ధుణ్ణి చూపించింది. ప్రజలు నివ్వెరపోయారు. వెంటనే పండితులు బుద్ధుణ్ణి, చించితనూ నిందించసాగారు. ప్రజలు లేచి, చించితతో "భగవానుని మీదే నిందలు వేస్తావా?" అంటూ ఆగ్రహం వెళ్ళగక్కారు.

బుద్ధుడు వారిని వారించి- ప్రబోధం పూర్తి చేసి పంపాడు. "సోదరీ! నీవు ఇక్కడే ఉండు!" అని చెప్పాడు. వారంతా వెళ్ళిపోయాక- "సోదరీ! బాధపడకు. ఇక్కడ నీకెలాంటి ఇబ్బందీ లేదు. నెలలు నిండేవరకూ మా ఆరామంలోనే ఉండు. ప్రసవించాక, ఆ బిడ్డను మాకు అప్పజెప్పు. నీవు వెళ్ళిపోవచ్చు. నీ మర్యాదకు భంగం రాదు" అంటూ ధైర్యం చెప్పాడు.

బుద్ధుని వాత్సల్యాన్ని, కరుణను కళ్ళారా చూసి చించిత కరిగిపోయింది. తను చేసింది ఎంత తప్పో గ్రహించింది. ఇంత కరుణామయునిపై పండితులు చేసిన దుర్మార్గాన్ని తలచుకొని తల్లడిల్లిపోయింది. తగిన బుద్ధి చెప్పాలనుకొంది. ఆ రాత్రి అక్కడే ఉంది.

మరునాటి ప్రబోధం వేళకు సభకు వెళ్ళింది. ఆమె కబురు ప్రకారం పండితులంతా కట్టగట్టుకుని వచ్చారు. చించితను చూసి అవాకులు, చెవాకులు మొదలుపెట్టారు. బుద్ధ దూషణకు దిగారు. ఆమె సభ ముందుకు వచ్చి- పొట్టకు కట్టుకున్న గుడ్డల్ని విప్పి, సభ ముందు పోగు పెట్టింది. ఈ నాటకానికి కారకులైన పండితులందరి గురించి వెల్లడించింది. వారి దుర్మార్గం, దురాలోచన బైటపెట్టి, బుద్ధుని పాదాల దగ్గర ప్రణమిల్లింది. తన గణిక జీవితాన్ని విడిచి, బౌద్ధ అభిమానిగా, మంచి వ్యక్తిగా జీవించింది.

● బొర్రా గోవర్ధన్


విశ్వాసానికి అదే సాక్ష్యం!

"**మీ**రు చెడును చూస్తే చేతితో ఆపే ప్రయత్నం చేయండి. చేతితో ఆపే శక్తి లేకపోతే నోటితోనైనా దానిని ఆపే ప్రయత్నం చేయండి. నోటితో కూడా ఆపే శక్తి మీలో లేకపోయినట్టయితే కనీసం మనసులోనైనా ఆ చెడును అసహ్యించుకోండి. ఇది విశ్వాసానికి చివరి మెట్టు. కనీసం చెడును చూసి మీలో అసహ్యమైనా కలగకపోతే మీలో రవ్వంత కూడా విశ్వాసం లేనట్టే" అన్నారు మహా ప్రవక్త (సల్లల్లాహు అలైహివసల్లం).

వివేకవంతుల లక్షణం

ప్రస్తుత సమాజంలో ఎటు చూసినా అసంఖ్యాకమైన చెడులు రాజ్యం చేస్తున్నాయి. అవినీతి, అక్రమాలు, హింసా దౌర్జన్యాలు, మద్యపానం, జూదం, వ్యభిచారం, భ్రూణహత్యలు, మానభంగాలు, డ్రగ్స్, అశ్లీల కార్యకలాపాలు సర్వసాధారణమైపోయాయి. నేల నలుచెరగులా వ్యాపించిన ఈ చెడుల పట్ల సర్వత్రా ఉదాసీనత, నిర్లిప్తత, 'మనకెందుకులే!' అనే భావన వ్యక్తమవుతున్నాయి. కానీ మహా ప్రవక్త "మీరు ఏ మాత్రం చెడు చూసినా చేతితో దాన్ని ఆపండి! బలప్రయోగం ద్వారా దాన్ని నిర్మూలించండి" అని పిలుపునిచ్చారు. "ఒకవేళ అధికారంతో ఆపగలిగే శక్తి లేకపోతే కనీసం నోటి ద్వారానైనా, అంటే మంచి మాటల ద్వారా హిత బోధల ద్వారా చెడుకు వ్యతిరేకంగా ప్రచారం ద్వారా దాన్ని ఆపడానికి విశ్వ ప్రయత్నం చేయా"లని ఆదేశించారు. కనీసం మంచి మాటలు కూడా చెప్పే పరిస్థితులు లేనప్పుడు, మనసులోనైనా ఆ చెడు పట్ల వ్యతిరేకత, అసహ్యం, రోత వ్యక్తం చేయాలి. చింత, విచారం కలగాలి కానీ 'ఈ సమాజం ఏమైపోతే నాకెందుకులే!' అని అనుకోవడం వివేకవంతుల లక్షణం కాదు.

సందేశం



హదీసు బోధ

చుట్టూ దుర్గంధం ప్రవహిస్తున్నప్పుడు ముక్కు మూసుకుని తనకి దుర్వాసన రాదని భావించడం మూర్ఖత్వమే అవుతుంది. ఈ దుర్గంధాన్ని కనుక దూరం చేయకపోతే అది వారిని కూడా కబళించివేస్తుంది. ఈ విషయాన్ని మహా ప్రవక్త ఇలా తెలిపారు:

అల్లాహ్ ఒక ఊరిలో ఉన్న ప్రజలను సర్వనాశనం చేసి రమ్మని తన దూతలను పంపాడు. అప్పుడు ఆ దూతలు ఆ ఊరు వెళ్ళి చూస్తే అక్కడ ఓ దైవ భక్తుడు నిరంతరం దైవధ్యానంలో లీనమై ఉన్నాడు. ఊరిని నాశనం చేస్తే ఈ భక్తుడు కూడా నాశనమవుతాడని భావించిన దైవదూతలు- అల్లాహ్ వద్దకు వెళ్ళి ఈ విషయాన్ని విన్నవించారు. అప్పుడు దైవం "దూతలారా! నాకు సర్వమూ తెలుసు. ముందు ఆ భక్తుడి నుంచే శిక్షను ప్రారంభించండి. ఎందుకంటే అతడు తన చుట్టూ అన్యాయాలు, అక్రమాలు జరుగుతుంటే, సమాజంలో చెడు శరవేగంతో పెరుగుతుంటే- ఆ చెడును రూపుమాపే ప్రయత్నం చేయకుండా తనకు తాను దైవధ్యానంలో నిమగ్నమైపోయాడు. తన చుట్టూ సమాజమంతా ఏమైపోయినా ఫరవాలేదని తలచాడు. కనుక ముందు అతణ్ణే నాశనం చేయండి,! తరువాత మిగతా వారిని!" అని ఆజ్ఞ ఇచ్చాడు. (హదీస్ గ్రంథం: మిష్కాత్)

● మహమ్మద్ వహీదుద్దీన్

దేవుడు... మన వెంటే!

తదుపరి అడుగు ఎక్కడ పడనున్నదో కూడా తెలియనంత కారుచీకటిలో నడవడానికి పూనుకోవడం దుస్సాహసమే!! అదీ తెలియని ప్రదేశంలో లేదా కారడవిలోనైతే ఎంతో ప్రమాదం కూడా! అలాంటప్పుడు ప్రయాణం ముందుకు సాగకపోవచ్చు. సాగినా గమ్యం చేర్చని తప్పుడు మార్గమూ కావచ్చు. మరో ప్రమాదం ఏంటంటే, ఈలోగా ఏ క్రూర జంతువో, విషనాగు బారినో బాటసారి పడవచ్చు. కానీ దావీదు చక్రవర్తి రాసిన 119వ కీర్తన- ఈ పరిస్థితుల్లో దేవుని సాయం ఏ విధంగా అందుతోందన్నది ప్రతి వచనంలోనూ వివరించే అతి సుదీర్ఘమైన బైబిలు భాగం. 'నీ వాక్యం నా పాదాలకు దీపం, నా తోవకు వెలుగై ఉంది' అంటాడు దావీదు (119:105). ఈ ఒక్క వాక్యంలో దావీదు చాలా కాలం పాటు కారుచీకటి లాంటి ప్రతికూలతలో సాగిన తన జీవితాన్ని, అంతటి ప్రతికూలతలోనూ తనను తొట్రిల్లనివ్వని, ఓడిపోనివ్వని దేవుని అసమానమైన ప్రేమను నిక్షిప్తం చేశాడు.

దైవమార్గం



దాదాపు 15 ఏళ్లప్పుడు ఇశ్రాయేలు దేశానికి కాబోయే చక్రవర్తిగా దేవుడు ఆయన్ను అభిషేకించాడు. ఆ తర్వాత 15 ఏళ్లకు, అంటే దావీదుకు 30 ఏళ్లున్నప్పుడు సౌలు మరణం తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించాడు. కానీ ఈ 15 ఏళ్లల్లో సౌలు లాంటి శత్రువులు, ఎన్నో ఆటంకాలు, సొంత వాళ్ల ఈర్ష్యాసూయలు, నమ్మినవాళ్ల వెన్నుపోట్లు, తిండి, నిద్ర కూడా లేకుండా ఎన్నో చీకటి రాత్రుల అనుభవాలు ఉన్నాయి. ఈ 15 ఏళ్లలో దావీదు ఎంత క్షోభ, అభద్రతా భావనకు గురయ్యాడో దేవుని వాక్యధ్యానం ద్వారా అంతే బలంగా ఒక కదలని పర్వతంలాగా స్థిరపడ్డాడు. తన ఆత్మీయానుభవాన్నంతటినీ క్రోడీకరించి రాసిన కీర్తన కాబట్టే 119వ కీర్తనను మహా పండితులు 'దావీదు ఆత్మీయ జ్ఞానభాండాగారమనీ' అది దావీదు 'పాకెట్ బైబిల్' అనీ వర్ణిస్తారు. ఈ కీర్తనలోని ప్రతి వచనం దేవుని ఆదరణ భరితం!!

జీవితం దావీదును ఎంత క్షోభ పెట్టి, ఎంతటి అభద్రతా భావానికి గురిచేసిందో, దేవుని వాక్యం, దేవుడితో అతని అనుబంధం అతణ్ణి అంతగా ఆదరించి బలపర్చింది. దేవుడు తనతోనే ఉన్నాడన్న 'సంపూర్ణమైన విశ్వాసమే' ఇంధనంగా, చక్రాలుగా దావీదు ప్రయాణం సాగింది. చీకటిలో అత్యంత ప్రతికూలతలో మనం వేసే అడుగులకు ముందు, వెనక కూడా దేవుని అడుగుజాడలుంటాయి. ఎందుకంటే మనకు వెనుక, ముందు, కుడిపక్క, ఎడమ పక్క మన చుట్టూ మనల్ని ఆవరించి ఆదరించే దేవుడు ఆయన!! (కీర్తన 139: 1-8)

● సుశీల్ సందేశ్

నవ్య సకల

ఆసుపత్రుల భయం పోగొట్టాలి



పేరెంటచ్

కొంత మంది పిల్లలకు రక్తం అంటే భయం..... ఇంజెక్షన్ అంటే భయం. అందుకే ఆసుపత్రులను చూస్తే వాళ్లకు అంతులేని భయం. ఇలాంటి పిల్లలు రోగుల వద్దకు గానీ, ఆసుపత్రుల పరిసరాలకు గానీ వెళ్లాలంటే గడగడా వణికిపోతారు. తలిదండ్రులు కూడా, తమ పిల్లలకు అవంటే భయమని ఎప్పటికీ వాటికి దూరదూరంగానే ఉంచేస్తారు. ఎంత భయపడితే మాత్రం, ఏదైనా గాయమైనప్పుడో, మరేదైనా అనారోగ్యం చేసినప్పుడో ఆసుపత్రికి వెళ్లక తప్పదు కదా! నిజానికి రక్తాన్ని చూస్తేనో, సిరంజిని చూస్తేనో భయం కలగడం పూర్తిగా అర్థం లేనిది. ఎందుకంటే గాయపడటం లేదా అనారోగ్యం పాలుకావడం వంటివి ఎప్పుడో ఒకప్పుడు అందరికీ ఎదురయ్యేవే కదా! అందువల్ల పిల్లలను ఆ వాతావరణానికి ఎప్పటికీ దూరంగానే ఉంచాలనుకోవడం పెద్ద అపరాధమే అవుతుంది. ఒకవేళ అయిన వాళ్లెవరైనా ఆసుపత్రిలో పడితే, వెళ్లకుండా తప్పించుకోవచ్చేమో గానీ, తనే ఆసుపత్రిలో పడే పరిస్థితి వస్తే అప్పుడింక తప్పదు కదా! అనివార్యమై పోయి అప్పుడు గుండెలు బాదుకుంటూ వెళ్లడం కన్నా, అప్పుడో ఇప్పుడో ఆసుపత్రికి వెళ్లి రావడం అలవర్చుకుంటే మేలు కదా! కొంత మంది తలిదండ్రులేమో, ఆరోగ్యసూత్రాలన్నీ పక్కాగా పాటిస్తాం కదా! ఆసుపత్రులతో మాకేం పని?" అంటూ మాట్లాడతారు. కానీ, అనుకోని ప్రమాదాలు, ప్రత్యేకించి రోడ్డు ప్రమాదాలు ఇలాంటి వాటిల్లో ఎదుటి వారి తప్పులకు కూడా మనం బలి అయిపోతాం కదా! అప్పుడైనా వెళ్లాల్సిందే కదా! అయినా, ఆరోగ్యాన్ని చక్కదిద్ది, ఒక్కోసారి ప్రాణాలే నిలబెట్టే ఆసుపత్రులంటే గౌరవం, ప్రేమ కలగాలి గానీ, భయపడే పరిస్థితి ఎందుకు ఉండాలి? రక్తాన్ని చూస్తే భయం కలగడం ఏమిటి? రక్తమే కదా మనిషి ప్రాణాల్ని నిలబెట్టేది! అర్థం లేని ఇలాంటి నెగెటివ్ భావాల్ని పిల్లల మనసుల్లోంచి తొలగించి, వాటి పట్ల పాజిటివ్ భావన ఏర్పడేలా చేయడం తలిదండ్రుల బాధ్యత అవుతుంది. అందులో భాగంగా అప్పుడప్పుడు ఆ భయపడే ప్రదేశాల వద్దకే తీసుకు వెళుతుండాలి. ఈ విషయమై తలిదండ్రుల ప్రయత్నాలేవీ ఫలించకపోతే, ఎవరైనా మానసిక నిపుణుడి వద్దకు తీసుకు వెళ్లడమైనా చేయాలి.

మీకు మీరే డాక్టర్

మోదుగతో ఆరోగ్యం భేష్



- మోదుగ గింజలను నూరి లేపనంగా వేస్తే తెల్ల మచ్చలు (ల్యూకోడెర్మా), తామర (రింగ్‌వార్మ్) వ్యాధి తగ్గిపోతాయి.
- తాజా మోదుగ చెక్క రసాన్ని పూస్తే తెగిన గాయాలు తొందరగా మానతాయి.
- మోదుగ పూలను రాత్రివేళ చల్లటి నీటిలో నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఆ నీటిలో పటిక బెల్లం కలిపి తాగుతూ ఉంటే, మూత్రం మార్గం వెంట రక్తం పడటం తగ్గిపోతుంది.
- మోదుగ పూలను మెత్తగా నూరి పట్టిస్తే, దెబ్బలు, వాపులు తగ్గుతాయి.
- మోదుగ పూలను ఉడికించి గోరువెచ్చగా ఉన్నప్పుడు బొడ్డు పైన లేపనంగా వేస్తే మూత్రం సాఫీగా వెళుతుంది.
- మోదుగ వేరు పట్టను దంచి పాలతో కలిపి ప్రతి రోజూ తాగుతూ ఉంటే, లైంగిక శక్తి పెరుగుతుంది.
- మోదుగ గింజలను మెత్తగా నూరి ఆ ముద్దను బియ్యం కడిగిన నీళ్లతో సేవిస్తే పొట్టలోని పలురకాల క్రిములు నశిస్తాయి.

కౌన్సెలింగ్

మట్టి తినడం వల్లేనా ఇవన్నీ?



నా వయసు 24. నాకు 14 ఏళ్లు వచ్చేదాకా మట్టి తినే అలవాటు ఉండేది. అయినా ఏడాది క్రితం దాకా నాకు ఏ ఇబ్బందీ అనిపించలేదు. కాకపోతే ఇటీవలే ఒక్కొక్కటిగా పలు రకాల సమస్యలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, అప్పుడప్పుడు రెండు మూడు నిమిషాల పాటు, తల తిరుగుతున్నట్లు, చీకట్లు కమ్మినట్లు అనిపిస్తుంది. కాళ్లూ చేతులు లాగడంతో పాటు తిమ్మిర్లు కూడా వస్తాయి. ఈ మధ్య వెన్ను నొప్పి కూడా ఉంటోంది. వీటితో పాటు కడుపు ఉబ్బరం, మూత్ర విసర్జనలో మంట ఉంటున్నాయి. ఒళ్లంతా నొప్పిగానూ నీరసంగానూ ఉంటోంది. ఏ పని చేయడానికీ ఉత్సాహం ఉండడం లేదు. ఈ సమస్యలు మట్టితినడం వల్ల వచ్చినవేనా? మరేదనైనా కారణం ఉందా? నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

- కె. రాజేశ్వర్, జగిత్యాల

ఏళ్ల పర్యంతం మట్టి తినే అలవాటు ఉన్న వాళ్లల్లో ఈ సమస్యలు తలెత్తడం సహజమే. మట్టిలో ఉండే సూక్ష్మక్రిములు, వీళ్ల కాలేయంలో, పేగుల్లో నివాసం ఏర్పరుచుకుంటాయి. ఇవి కాలేయంతో పాటు జీర్ణకోశం పైన కూడా దుష్ప్రభావాన్ని చూపుతాయి. ఈ స్థితి రక్తహీనతకు కూడా దారి తీస్తుంది. ఈ క్రమంలో కడుపు ఉబ్బరం సమస్య కూడా మొదలవుతుంది. మరికొందరిలో ఇది వెన్ను నొప్పికి కూడా కారణమవుతుంది. రక్తహీనత వల్ల సహజంగానే నీరసం, నిస్సత్తువా ఆవరిస్తాయి. ప్రస్తుతం వాయు విడంగ చూర్ణం, కరక్కాయ చూర్ణం సమపాళ్లలో కలిపేసుకుని, ఉదయం ఒకటిన్నర చెంచా, సాయంత్రం ఒకటిన్నర చెంచా నీటితో తీసుకోవాలి. దీనికి తోడు నవాయస చూర్ణం ఉదయం పావు చెంచా, సాయంత్రం పావు చెంచా మజ్జిగలో కలిపి తాగాలి. ఇవి రక్తహీనత ను తగ్గించడం వల్ల నీరసం, నిస్సత్తువ కూడా తొలగిపోతాయి. అయినా ఒకసారి మల పరీక్ష, రక్త పరీక్ష చేయించండి ఆ రిపోర్టుల ఆధారంగానే పూర్తి స్థాయి చికిత్స సాధ్యమవుతుంది.

● డాక్టర్ డి. విఠల్ రావు
రిటైర్డ్ ప్రొఫెసర్
ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, హైదరాబాద్

త్రీ సుడోకు - 114

3				2	5	4		6
							3	
	6	4	9					
	2					7	6	
5			2		1			9
	1	9					2	
					4	9	5	
	5							
8		7	5	9				2

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 113 సమాధానం